బుధవారం
19-3-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 177
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
# విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం



మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్ర లో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్
మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343


# పార్టీ పునర్నిర్మాణమే లక్ష్యం

- సీపీఐకి ఉద్యమ ఘన చరిత్ర
- విజయవంతంగా శత వార్షికోత్సవాలు
- దేశాన్ని గాలికొదిలేసిన మోదీ
- చత్తీస్‌గఢ్ ఆదివాసీలపై విధ్వంసకాండ
- అమిత్‌షా కనుసన్నల్లో దాడులు
- కార్పొరేట్ రంగాలకు మోదీ పెద్దపీట
- 23 నుంచి దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు
- సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా క్షేత్రస్థాయి నుంచి పార్టీ పునర్నిర్మాణమే లక్ష్యంగా దృష్టి కేంద్రీకరించామని, ఆ దిశగా పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నామని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా వెల్లడించారు. సీపీఐ ఆవిర్భావించిన డిసెంబరు 26, 1925 నుంచి కొనసాగిన అనేక ఉద్యమాలు, ఘట్టాలను రాజా సంక్షిప్తంగా గుర్తుచేశారు. విజయవాడ దాసరి భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజతో కలిసి డి.రాజా మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వాతంత్ర్యోద్యమంలో సీపీఐ కీలక భూమిక పోషించిందని రాజా వివరించారు. ఎన్నో త్యాగాలు చేసిందని, సంపూర్ణ స్వరాజ్యం కోసం పోరాడినట్లు గుర్తుచేశారు. పార్టీ శత వార్షికోత్సవాలను దేశవ్యాప్తంగా విజయవంతంగా పూర్తి చేసుకుంటున్నామని వివరించారు. అన్ని రాష్ట్రాల్లోను సభలు, సమావేశాల ద్వారా పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్నట్లు తెలిపారు. శత వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా ఈ ఏడాది డిసెంబరు 24, 25 తేదీల్లో విజయవాడలో జాతీయ సెమినార్లు నిర్వహిస్తున్నామని, దీనికి జాతీయస్థాయి పార్టీ నేతలు, వివిధ కమ్యూనిస్టు, ప్రజాసంఘాల ప్రతినిధులు హాజరవుతారని వివరించారు. డిసెంబరు 26న తెలంగాణలోని ఖమ్మంలో శత వార్షికోత్సవ ముగింపు సభ జరుగుతుందని, ఈ సభకు ముందు పెద్దఎత్తున ప్రదర్శన నిర్వహించనున్నట్లు చెప్పారు ఈనెల 23 నుంచి ఏప్రిల్ 14 వరకు దేశవ్యాప్తంగా రాజకీయ అజెండాతో పార్టీ ప్రచార కార్యక్రమాన్ని సీపీఐ నిర్వహిస్తోందన్నారు.

పోలీసుల పహారాలో చత్తీస్‌గఢ్ ఉందని రాజా ఆందోళన వ్యక్తంచేశారు. మావోయిస్టుల అణిచివేత పేరుతో అక్కడి ఆదివాసీయులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కనుసన్నల్లో... ఆపరేషన్ కగార్ పేరుతో... మావోయిస్టుల అణచివేత ముసుగులో భద్రతా దళాలు అమాయక గిరిజనులపై దాడులకు తెగబడుతున్నాయని దుయ్యబట్టారు. ఆదివాసీలు ఎంతోకాలం నుంచి అటవీ ప్రాంత జలాలు, భూములను కాపాడుతున్నారని తెలిపారు చత్తీస్‌గఢ్‌లోని పరిస్థితులను పార్టీ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు రామకృష్ణ పాండేతో వెళ్లి అధ్యయనం చేశామని, వాస్తవ పరిస్థితుల్ని అధ్యయనం చేసి... స్థానికులతో మాట్లాడినట్లు రాజా వివరించారు. మావోయిస్టులు, గిరిజనులను అణచివేసి... అటవీ భూములను కార్పొరేట్ రంగాలకు అప్పగించడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని రాజా విమర్శించారు. చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులను కాల్చిచంపడం ద్వారా విధ్వంసకర చర్యలకు కేంద్రం పాల్పడుతోందని, స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ చరిత్రను తిరిగి రాయడానికి ప్రయత్నిస్తున్న మితవాద, మతవాద శక్తుల విధానాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.

ఏర్‌టెల్, జియో కలిసి స్పెక్ట్రమ్‌ను ఎలాన్ మస్క్‌కు ధారాదత్తం చేయడాన్ని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని రాజా స్పష్టంచేశారు. ఎలాన్ మస్క్ పెంటగాన్‌కు మద్దతు ఇస్తున్నారని, తద్వారా భారతదేశ రహస్యాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నప్పటికీ ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం నోరు విప్పడం లేదని, ప్రజలు, దేశ భద్రతపై దృష్టి పెట్టడం లేదన్నారు. విద్యారంగంపై రాజా మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో మొక్కుబడిగానే నిధులు కేటాయిస్తున్నారన్నారు. విద్యా రంగానికి దేశ జీడీపీలో 6 శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ సిఫార్సు చేస్తే... ఇప్పటివరకు మోదీ ప్రభుత్వం కనీసం 3 శాతం అందించలేని పరిస్థితికి దిగజారిందని మండిపడ్డారు. దీని ప్రభావంతో దేశంలోని అనేక మంది విద్యార్థులు ఉచితవిద్యకు దూరమయ్యారని, కోట్లాదిమంది నిరక్షరాస్యులుగా మారిపోతున్నారని చెప్పారు. మోదీ అధికారంలోకి వచ్చాక నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసి... విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణే లక్ష్యంగా పనిచేస్తున్నారని, ఆ దిశగా కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్ రంగానికి అనుకూలంగానే నిధులు కేటాయించారని రాజా విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా విచ్ఛిన్నం చేసే దిశగా మోదీ విధానాలున్నాయని విశ్లేషించారు. దేశాన్ని, ప్రజలను బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ విధానాలు విచ్ఛిన్నం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఒకే దేశం–ఒకే భాష, ఒకే దేశం–ఒకే మతం, ఒకే దేశం–ఒకే ఎన్నిక తదితర రాజ్యాంగ

- మిగతా 2 లో

## రెండు వారాల్లో కౌంటర్ దాఖలు

### కృష్ణా ప్రాజెక్టులపై కేంద్రానికి, ఏపీకి సుప్రీం ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: కృష్ణా ప్రాజెక్టుల పిటిషన్లపై రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. కృష్ణానది ప్రాజెక్టులను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ)కి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌పై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. 2021లో కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌ను తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానంలో సవాల్ చేసింది. మరోవైపు అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ తెలంగాణ ప్రభుత్వం వారికి కేటాయించిన నీటి వాటా కంటే అధికంగా కృష్ణానదీ జలాలు వినియోగించుకుంటోందని ఏపీ ప్రభుత్వం సైతం సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసింది. తెలంగాణ జారీ చేసిన జీవో రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన పిటిషన్‌లో కోరింది. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌పై స్టే ఇవ్వాలని తెలంగాణ మరో పిటిషన్ వేసింది. తెలంగాణ వేసిన ఈ రెండు రిట్ పిటిషన్లపై రెండు వారాల్లో కౌంటర్ వేయాలని కేంద్రంతోపాటు ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. రెండు ప్రభుత్వాలు కౌంటర్ దాఖలు చేసిన వారం రోజుల్లో రిజాయిండర్ ఫైల్ చేయాలని జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

## కార్మిక కోడ్లు, ప్రైవేటీకరణ వద్దు

కేంద్ర కార్మిక సంఘాల డిమాండ్

8లో



## పిటిషనర్‌కు రూ.కోటి జరిమానా

విశాలాంధ్ర–హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో సంచలన తీర్పు వెలువడింది. కోర్టును తప్పుదోవ పట్టించిన ఓ పిటిషనర్‌కు రూ. కోటి జరిమానా విధిస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడం మంగళవారం సంచలనం రేపింది. హైకోర్టునే తప్పుదోవ పట్టిస్తారా అని హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిటిషనర్‌కు కోటి రూపాయల జరిమానా విధించారు. హైకోర్టులో ఓ కేసు పెండింగ్‌లో ఉంది. ఆ విషయాన్ని దాచిన పిటిషనర్ వేరే బెంచ్ వద్ద పిటిషన్ వేసి ఆర్డర్ తీసుకున్నారు. దీనిపై హైకోర్టు న్యాయమూర్తి నగేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నత న్యాయస్థానాన్ని

- మిగతా 2 లో

## చిన్న కేసులూ మా వద్దకా: సుప్రీం

న్యూఢిల్లీ: ట్రయిల్ కోర్టుల తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. చాలా సాధారణ కేసుల్లో దర్యాప్తు పూర్తయినప్పటికీ బెయిల్ పిటిషన్లను తిరస్కరించడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పు బట్టింది. ప్రజాస్వామ్య దేశం పోలీసుల రాజ్యంలా పని చేయకూడదని హితవు పలికింది. ఒక చిన్న కేసులో బెయిల్ కోసం దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. 'ఒక ప్రజాస్వామ్య దేశం పోలీసుల రాజ్యంలా పని చేయకూడదు. ఇక్కడ నిజాలతో

- మిగతా 2 లో



## 44 ఏళ్ల నాటి కేసులో ముగ్గురికి మరణశిక్ష

లక్నో: నాలుగు దశాబ్దాల కిందట దళితుల ఊచకోత కేసులో ఉత్తరప్రదేశ్‌లోని ప్రత్యేక న్యాయస్థానం ముగ్గురు దోషులకు మరణశిక్ష విధించింది. రూ.50వేల చొప్పున జరిమానా కూడా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఉత్తర ప్రదేశ్‌లోని దిహులీలో 1981 నవంబరు 18న 24 మంది దళితులను ఊచకోత కోశారు. దళిత కుటుంబం లక్ష్యంగా ఈ దారుణానికి ఒడిగట్టారు. మృతులలో మహిళలు సహా ఆరు నెలలు, రెండేళ్ల వయసున్న చిన్నారులు ఉన్నారు. ఖాకీ దుస్తుల్లో వచ్చిన 17 మంది ఈ దారుణానికి ఒడిగట్టారు. ఈ కేసులో తొలుత

- మిగతా 2 లో

## ఇజ్రాయిల్ మారణహోమం

### అర్ధరాత్రి గాజాపై భీకర వైమానిక దాడులు

- 413 మంది పలస్తీయన్ల మృతి
- బందీల విడుదల వరకు పోరు: నెతన్యాహు
- అమెరికా, ఇజ్రాయిల్‌దే పూర్తి బాధ్యత: హమాస్

జెరూసలేం: అమెరికా ప్రోద్బలంతో ఇజ్రాయిల్ మరోమారు గాజాపై మారణహోమానికి తెగబడింది. రంజాన్ మాసంలోనూ భీకర వైమానిక దాడులతో విరుచుకుపడి 413 మంది పలస్తీనియన్ల ప్రాణాలు హరించింది. హమాస్ స్థావరాలే లక్ష్యంగా సోమ–మంగళవారం మధ్యరాత్రి విచక్షణారహితంగా భూతల, వైమానిక దాడులకు పాల్పడింది. మృతుల్లో పిల్లలు, మహిళలు అధికసంఖ్యలో ఉన్నారు. ఉత్తర గాజా, డేర్ అల్ బల్హ్, ఖాన్ యూనిస్, రఫా సహా గాజాలోని అనేక ప్రాంతాల్లో వైమానిక దాడులతో ఇజ్రాయిల్ విరుచుకుపడింది. ఈ దాడుల్లో రఫాలో

- మిగతా 2 లో

## దళితుల అభ్యున్నతికి కృషి

- వర్గీకరణ పోరులో అమరుల కుటుంబాలను ఆదుకుంటాం
- దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం
- కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ బీసీలకు అండగా ఉంటుంది
- సీఎం రేవంత్ రెడ్డి
- ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఏకగ్రీవ ఆమోదం

విశాలాంధ్ర–హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ శాసనసభ మంగళవారం ఆమోదం తెలిపింది. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు సీఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దళితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటోందన్నారు. పార్టీలో, ప్రభుత్వంలో ఎస్సీలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. దళితులకు అండగా ఉంటూ వారి అభ్యున్నతికి మా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 1960లోనే ఉమ్మడి రాష్ట్రంలో దామోదరం సంజీవయ్య లాంటి దళితుడిని ముఖ్యమంత్రిని చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. దళితుడు మల్లికార్జున ఖర్గేను ఏఐసీసీ అధ్యక్షుడిగా పార్టీ నియమించిందని పేర్కొన్నారు. పంజాబ్ కేసు సుప్రీం కోర్టులో సుదీర్ఘంగా కొనసాగిందని, మేం అధికారంలోకి వచ్చాక ఏడుగురు జడ్జిల ముందు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా న్యాయవాదితో సుప్రీం కోర్టులో మన వాదనలు వినిపించామన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే వర్గీకరణకు అనుకూలంగా శాసనసభలో తీర్మానం చేసి, మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశామన్నారు. అలాగే న్యాయనిపుణులను సంప్రదించి ఏక సభ్య కమిషన్ ను ఏర్పాటు చేయడంతో పాటు కమిషన్ ఇచ్చిన నివేదికను తూచ తప్పకుండా ఆమోదించామన్నారు. 59 ఉపకులాలను మూడు గ్రూపులుగా విభజించి 15 శాతం రిజర్వేషన్లు వారికి పంచామని, ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలను ప్రభుత్వం కచ్చితంగా ఆదుకుంటుందని తెలిపారు. వారి కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు,

- మిగతా 2 లో

## 'ఫిబ్రవరి 4, మార్చి 18 చరిత్రలో నిలిచిపోతాయి'

- మంత్రులు దామోదర, ఉత్తమ్
- ఎస్సీ వర్గీకరణకు బీఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతు: ఎమ్మెల్యే వేముల

విశాలాంధ్ర– హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చునని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన 6 నెలల్లోనే వర్గీకరణ చట్టం చేసుకుంటున్నామని ఇది కాంగ్రెస్ పార్టీ, మా సీఎం రేవంత్ రెడ్డి నిబద్ధత అని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. 2025 ఫిబ్రవరి 4వ తేదీ(సోషల్ జస్టిస్ డే), మార్చి 18వ తేదీలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. గతంలో ఓసారి వర్గీకరణ చేసినా... కోర్టు తీర్పులతో అది నిలిచిపోయిందని గుర్తు చేశారు. అయితే నాటి వర్గీకరణకు, నేటి వర్గీకరణకు పెద్దగా తేడా లేదని,

- మిగతా 2 లో

## ఇదీ లోకం!

## 45 శాతం ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు

### అగ్రస్థానంలో ఆంధ్రప్రదేశ్

### ఏడీఆర్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న ఎమ్మెల్యేల్లో 45 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు తేలింది. వారిలో 29 శాతం మంది హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, మహిళలపై నేరాలు వంటి తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నట్లు ఓ నివేదిక వెల్లడించింది. ఎన్నికల సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్ ఆధారంగా 28 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల అసెంబ్లీలకు చెందిన మొత్తం 4,123 మంది ఎమ్మెల్యేల్లో 4,092 మంది క్రిమినల్ కేసులు ఉన్నట్లు అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) తెలిపింది. ఈ నివేదిక ప్రకారం మొత్తం ఎమ్మెల్యేల్లో దాదాపు 45 శాతం అంటే 1,861 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వారిలో 1,205 మంది (25 శాతం) హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, మహిళలపై నేరాలు వంటి తీవ్ర నేరారోపణలు ఎదుర్కొంటున్నారు. ఏపీకి చెందిన ఎమ్మెల్యేలు అత్యధిక శాతం (174 మందిలో 138 మంది) క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నట్లు తేలింది. ఆ తర్వాత కేరళ, తెలంగాణ(69 శాతం), బీహార్(66 శాతం), మహారాష్ట్ర(65 శాతం) తమిళనాడు 59 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల జాబితాలో ఏపీ 59 శాతంతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత 50 శాతంతో తెలంగాణ, 49 శాతంతో బీహార్ ఉన్నాయి.

పార్టీల వారీగా విశ్లేషిస్తే... ఏపీలోని చంద్రబాబు నాయుడుకు చెందిన తెలుగుదేశం పార్టీలో అత్యధికంగా 86 శాతం (134 మందిలో 115 మంది) మంది ఎమ్మెల్యేలు క్రిమినల్ కేసులు

- మిగతా 2 లో

## ఆధార్‌తో ఓటరు ఐడీ లింక్

### కేంద్రం అంగీకారం

### ఆర్టికల్ 326, ప్రతినిధుల చట్టం ప్రకారమే ముందుకు: ఈసీఐ

న్యూఢిల్లీ: ఓటరు గుర్తింపు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. దీంతో ఈ ప్రక్రియను ప్రారంభించినట్లు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రకటించింది. కేంద్ర హోం శాఖ ఉన్నతాధికారులతో ఈసీ అధికారులు మంగళవారం సుదీర్ఘంగా చర్చించిన తర్వాత ఈ మేరకు నిర్ణయించినట్లు వెల్లడించింది. ఓటరు జాబితాలలో అక్రమాలపై విపక్షాల విమర్శల వేళ ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజాప్రాతినిధ్య చట్టం–1950, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం అనుసంధాన ప్రక్రియను చేపడుతున్నట్లు ఈసీఐ తెలిపింది. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఉడాయ్), ఈసీ సాంకేతిక నిపుణులు కూడా

- మిగతా 2 లో

## తొలి కమ్యూనిస్టు ప్రభుత్వం

ప్రపంచవ్యాప్తంగా చూసినా మొదటి సారి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఖ్యాతి భారత కమ్యూనిస్టు పార్టీదే. 1957లో జరిగిన కేరళ శాసనసభ ఎన్నికలలో మొత్తం 126 స్థానాలలో కమ్యూనిస్టు పార్టీ 60 సీట్లు సంపాదించింది. కేరళలో 1939లో కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుల్లో ప్రధాన పాత్రధారి ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ ముఖ్యమంత్రి అయ్యారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

# స్టాచ్యూ ఆఫ్ లిబర్టీని తిరిగివ్వబోం

### ఫ్రాన్స్‌కు అమెరికా స్పష్టీకరణ

వాషింగ్టన్: 'మీరు స్టాచ్యూ ఆఫ్ లిబర్టీని మాకు ఇచ్చారు. దానిని మేము తీసుకున్నాం. ఇక తిరిగివ్వబోం' అని ఫ్రాన్స్‌కు అమెరికా స్పష్టం చేసింది. స్టాచ్యూ ఆఫ్ లిబర్టీని తమకు తిరిగివ్వాలన్న ఫ్రాన్స్ నేత డిమాండ్‌ను తోసిపుచ్చింది. 'అది జరగని పని' అంటూ శ్వేతసౌధం ఓ ప్రకటన చేసింది. ఫ్రాన్స్‌కు చెందిన రఫేల్ గ్లుక్స్‌మాన్ ఐరోపా యూరోపియన్ పార్లమెంటులో స్టాచ్యూ ఆఫ్ లిబర్టీని అమెరికా తమకు తిరిగివ్వాలని డిమాండ్ చేశారు. ఆ విగ్రహం విలువలను అమెరికా మర్చిపోయిందని వ్యాఖ్యానించారు. దీనికి శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ స్పందిస్తూ 'ఫ్రాన్స్‌లో కింది స్థాయి రాజకీయ నాయకుడికి నేను చెప్పదల్చుకున్నది ఏమంటే... మీరు (ఫ్రాన్స్) అమెరికా కారణంగానే నేడు జర్మన్ మాట్లాడటం లేదని మరువరాదు' అని అన్నారు. నాజీ-జర్మనీకి వ్యతిరేకంగా రెండవ ప్రపంచ యుద్ధంలో అమెరికా-ఫ్రాన్స్ పొత్తునుద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, న్యూయార్క్‌లో 1886, అక్టోబరు 28న స్టాచ్యూ ఆఫ్ లిబర్టీని ఏర్పాటు చేశారు. తమ స్నేహానికి గుర్తుగా ఫ్రాన్స్ దీనిని అమెరికాకు బహూకరించింది. స్వేచ్ఛ, స్ఫూర్తి, ఆకాంక్షలకు చిహ్నంగా స్టాచ్యూ ఆఫ్ లిబర్టీని అమెరికాకు ఫ్రాన్స్ బహూకరించినట్లు అధికారిక వెబ్‌సైట్ పేర్కొంది.

**కెన్నడీ హత్య కేసు రహస్యాలు వెల్లడిస్తాం: ట్రంప్**

అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెన్నడీ హత్య కేసుకు సంబంధించిన దస్త్రాలను విడుదల చేస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. వాషింగ్టన్‌లోని కెన్నడీ సెంటర్‌ను సందర్శించిన సందర్భంగా మీడియాతో మాట్లాడిన ట్రంప్ ఈ మేరకు ప్రకటన చేశారు. కెన్నడీ హత్య జరిగి 60 ఏళ్లకు పైగా అవుతున్నా ఆయన హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడి కాలేదు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం సంబంధిత డాక్యుమెంట్స్‌ను బహిర్గతం చేస్తానని ట్రంప్ అన్నారు. అయితే వాటిలో ఉన్న సమాచారం ఏమిటో తెలుపలేదు. భారీగా పత్రాలు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. వీటిని చదవడానికి చాలా సమయం పడుతుందన్నారు. కెన్నడీ హత్యకు సంబంధించి యూఎస్ నేషనల్ ఆర్కైవ్స్ కాన్ఫిడెన్షియల్‌గా వేల సంఖ్యలో రికార్డులు విడుదల చేసింది. జాతీయ భద్రతా కోణంలో వాటన్నింటిని మళ్లీ వెనక్కి తీసుకుంది. మొత్తం 50 లక్షల పేజీల సమాచారం ఉన్నట్లు తెలుస్తోంది. 2022 డిసెంబర్‌కి 97 శాతం పేజీలను విడుదల చేసినట్లు యూఎస్ నేషనల్ ఆర్కైవ్స్ గతంలో వెల్లడించింది. 1961లో అమెరికాకు 35వ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన జాన్ ఎఫ్ కెన్నడీ 1963 నవంబరు 22న టెక్సాస్‌కు వెళ్లినప్పుడు హత్యకు గురయ్యారు.

# గ్రీస్‌లో కమ్యూనిస్టుల సామూహిక సమాధుల గుర్తింపు

ఏథెన్స్: గ్రీస్‌లోని రెండవ అతిపెద్ద నగరమైన థెస్సలోనికిలో 1946-49 నాటి పౌర యుద్ధమప్పుడు అమరులైన కమ్యూనిస్టుల రెండు సామూహిక సమాధులు బయటపడ్డాయి. నేషనల్ రెసిస్టెన్స్ మెమోరియల్ సమీపంలో పునరాభివృద్ధి పనుల క్రమంలో వీటిని గుర్తించారు. ఇప్పటికే ఆరు చోట్ల ఇటువంటి సమాధులు గుర్తించారు. యెడి కులే జైలుకు సమీపంలో అస్థి పంజరాలు లభ్యం కావడంతో ఇవన్నీ రాజకీయ ఖైదీలవిగా భావిస్తున్నారు. మొత్తం 22 అస్థి పంజరాలలో ఒక మహిళది కాగా ఇరు 20ఏళ్ల యువకులవిగా గుర్తించారు. గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) కేంద్ర కమిటీకి చెందిన 'రిజొస్పాస్టిస్' ప్రకారం యెడి కులే పరిసరాలు కొన్ని వేల మంది రాజకీయ ఖైదీలు, కమ్యూనిస్టు మిలిటెంట్లు, కేడర్, కేకేఈ సభ్యులకు మరణ శిక్షలు అమలయ్యాయి. 1950 దశకంలో పాటు పౌర యుద్ధం జరిగినప్పుడు ఈ ప్రాంతాల్లో సామూహిక ఖననాలు జరిగాయి. 1946 నుంచి 1955 వరకు యెడి కులే జైలు లోపల వేలాది మందిని నిర్బంధించి వేధించారు. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో వందల మందికి మరణ శిక్షలు అమలు చేశారు. అయితే ఈ అవశేషాలకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి, వారి వారసులకు అప్పగించే దిశగా గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ కసరత్తు మొదలు పెట్టింది. ఈ విధంగా ఇప్పటివరకు గుర్తించిన 400 మంది అమరుల జాబితాను త్వరలోనే విడుదల చేయాలని భావిస్తోంది.

# పెరూలో ఎమర్జెన్సీ...

### భారీగా సైన్యం మోహరింపు

లిమా: పెరూలో ఎమర్జెన్సీ అమలైంది. ప్రముఖ గాయకుడి హత్యతో ఒక్కసారిగా హింస చెలరేగింది. దీంతో పరిస్థితిని అదుపు చేసేందుకు రాజధాని లిమాలో 30 రోజుల పాటు అత్యవసర పరిస్థితి విధిస్తూ అధ్యక్షురాలు దీనా బోలువార్టే ఉత్తర్వులు జారీచేశారు. భారీగా సైన్యాన్ని మోహరించారు. జన సమూహాలను నిషేధిస్తూ ఆదేశాలిచ్చారు. నిషేధాజ్ఞల ఉల్లంఘనకు జ్యుడీషియల్ ఆర్డర్ లేకుండా అరెస్టు చేసేలా పోలీసులు, సైన్యానికి అధికారం ఇచ్చారు. గత కొన్ని సంవత్సరాలుగా పెరూలో హత్యలు, దోపిడీలు పెరిగిపోయాయి. జనవరి 1 నుంచి మార్చి 16 వరకు 459 హత్యలు జరిగింది. ఒక్క జనవరిలోనే 1,909 దోపిడీలు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. కాగా, కంబియా బాండ్ అర్మోనియా 10కు చెందిన లీడ్ సింగర్ పాల్ ఫ్లోరెస్ (39) ఆదివారం హత్యకు గురయ్యారు. దీంతో దేశం అట్టుడికిపోయింది. నిరసనలు హింసాత్మకంగా మారాయి. శాంతి భద్రతలు ప్రశ్నార్థకమయ్యాయి. దీంతో అంతర్గత మంత్రి జువాన్ జోసె శాంటివాఫెజ్‌పై అవిశ్వాస తీర్మానం కోసం విపక్షాలు పట్టుబట్టాయి. ఈ ఏడాది చివరిలో జరిగే కాంగ్రెస్ ప్లీనరీలో దీనిపై చర్చిస్తారు. కాగా, గతేడాది సెప్టెంబరు, డిసెంబరులో హింస జరిగినప్పుడు కూడా పెరూలో ఎమర్జెన్సీ విధించారు.

# పార్టీ పునర్నిర్మాణమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేక విధానాలను మోదీ ప్రభుత్వం అవలంబిస్తోందన్నారు. ఉత్తరాది, దక్షిణాది అనే ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తూ... ప్రజల మధ్య చిచ్చురేపేలా మోదీ ప్రభుత్వ విధానాలు కొనసాగుతున్నాయని ధ్వజమెత్తారు. మోదీ పాలనలో సామాన్య ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదని, కార్పొరేట్ వర్గాలకే మేలు చేస్తున్నారన్నారు.

నియోజకవర్గాల పునర్విభజన పేరుతో మోదీ సర్కారు మరో కుట్రకు తెరదీస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్‌లో బీజేపీ ప్రభావం లేకపోవడంతో... అక్కడ బలం పుంజుకోవడానికి అనేక కుయుక్తులు పన్నుతోందన్నారు. మోదీ ప్రభుత్వం వల్ల ఏ వర్గానికీ మేలు జరగలేదని, కార్మిక వర్గాల హక్కులు, సంక్షేమాన్ని అణచివేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఢిల్లీలో కేంద్ర కార్మిక సంఘాల ఆందోళనకు దిగాయని చెప్పారు. మోదీ ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ విరుద్ధ చర్యల్ని వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్య పార్టీలతో దేశవ్యాప్తంగా ఇండియా ఐక్యసంఘటన ఏర్పడిందని రాజా పునరుద్ఘాటించారు. భవిష్యత్‌లో మోదీ ప్రజావ్యతిరేక విధానాలపై అన్ని లౌకిక పార్టీలను కలుపుకొని పోరాటాలను నిర్వహిస్తామన్నారు. సునీతా విలియమ్స్ 9 నెలల తర్వాత స్వదేశానికి తిరిగిరావడం శుభ పరిణామమని రాజా స్వాగతించారు. శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు. సీపీఐ తరపున ఆమెను స్వదేశానికి ఆహ్వానిస్తున్నామని రాజా చెప్పారు.

# 'ఫిబ్రవరి 4, మార్చి 18 చరిత్రలో నిలిచిపోతాయి'

(మొదటిపేజీ తరువాయి)

కేవలం 1.78 లక్షల జనాభా ఉన్న 26 కులాలు మాత్రమే ఇతర గ్రూపుల్లో చేర్చబడ్డాయని మొత్తం మాదిగల్లో ఈ 26 కులాల జనాభా 3.43 శాతమే కావడం గమనార్హమన్నారు. మిగిలిన 33 కులాలూ, పాత గ్రూపుల ప్రకారం కొనసాగుతున్నాయని వివరించారు. మంగళవారం నాడు అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడారు. దళితుల దశాబ్దాల వర్గీకరణ కలను నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేబినెట్ సబ్‌కమిటీ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇతర సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ అంశాలతో సీఎం దార్శనికతకు తార్కాణంగా పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 15 ఏళ్లకే ఎస్సీ వర్గీకరణ డిమాండ్ మొదలైందని తెలిపారు. వర్గీకరణ కోసం ఉమ్మడి రాష్ట్రంలో అనేక ఉద్యమాలు జరిగాయని... ఎంతో మంది త్యాగాలు చేశారన్నారు. మాదిగ సమాజం తరఫున కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. మంత్రి, ఎస్సీ వర్గీకరణ కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ రోజు ఒక చారిత్రాత్మక రోజన్నారు. దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం లో అన్ని వర్గాలు మద్దతు ఇచ్చినా కూడా వాస్తవ రూపం దక్కలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లో చిత్తశుద్ధితో వర్గీకరణ చేశామన్నారు. తాను ఎమ్మెల్యే అవ్వకముందు నుండి ప్రతి శాసనసభలో, పార్లమెంట్ లో ఎస్సీ వర్గీకరణ జరగాలని అన్ని పార్టీలు, ప్రభుత్వాలు మాట్లాడేవని గుర్తు చేసుకున్నారు. కానీ ఈ రోజు ఒక పకడ్బందీ ప్రణాళికతో ఎస్సీ వర్గీకరణ చట్టం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని, ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు పై శాసన సభలో జరిగిన చర్చ సందర్భంగా మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం లోని ఆర్టికల్ 14 ప్రకారం ఆయా రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ బిల్లుకు సంపూర్ణంగా సమర్థిస్తున్నామని చెప్పారు. మాదిగల సామాజిక ఆర్థిక పరిస్థితులపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడిగా కేసీఆర్ వర్గీకరణ అంశానికి మొదటి నుండి సంపూర్ణ మద్దతు తెలిపారన్నారు. టీఆర్ఎస్ ఉద్యమం నుండి పుట్టిన పార్టీ కాబట్టి స్వయంగా కేసీఆర్... వర్గీకరణ అంశంలో మందకృష్ణ మాదిగతో పాటు అనేక ఇతర సంఘాలు, సంస్థలు, వ్యక్తులు, మేధావులు చేసిన పోరాటాన్ని,ఉద్యమాన్ని అర్థం చేసుకొని వారి కార్యాచరణకు ఎల్లప్పుడూ అండగా నిలబడ్డారన్నారు. ఇప్పటి నుంచి రాబోయే అన్ని విద్యా,ఉద్యోగాల్లో కొత్త రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోందన్నారు. అలాగే వర్గీకరణ పూర్తి అయితే స్థానిక సంస్థల్లో మాదిగలకు రాజకీయ అవకాశాలు పెరుగుతాయి కాబట్టి... వర్గీకరణ చేసిన తర్వాతనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పిటిషనర్‌కు రూ.కోటి జరిమానా

(మొదటిపేజీ తరువాయి)

తప్పుదోవ పట్టించేలా రిట్ పిటిషన్లు వేయటంపై ఆయన సీరియస్ అయ్యారు. అక్రమ మార్గాలలో విలువైన ప్రభుత్వ భూములను సొంతం చేసుకోవాలని పిటిషనర్ యత్నించినట్లు గుర్తించారు. కోర్టులను మభ్యపెట్టాలని ప్రయత్నించడం, కోర్టుల సమయాన్ని వృథా చేయడంతో పాటు తప్పుదోవ పట్టించేయత్నం చేసినందుకు పిటిషనర్‌కు కోటి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

# 44 ఏళ్ల నాటి కేసులో ముగ్గురికి మరణశిక్ష

(మొదటిపేజీ తరువాయి)

17 మంది నిందితులపై హత్య, హత్యాయత్నం, దోపిడీ సహా అనేక సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. కేసు విచారణ క్రమంలోనే 14 మంది నిందితులు చనిపోయారు. ఈ కేసు విచారణ సుదీర్ఘకాలం సాగింది. నాటి ప్రధాని ఇందిరా గాంధీ అప్పట్లో బాధిత కుటుంబీకులను పరామర్శించారు. బీజేపీ అగ్రనేత అటల్ బిహారీ వాజ్‌పేయీ కూడా సంఘీభావం తెలిపారు. ఫిరోజాబాద్‌లోని సదుపుర్ నుంచి దిహులీ వరకు పాదయాత్ర కూడా చేశారు.

# ప్రతిపక్షాలనూ మాట్లాడనిస్తే బాగుండేది: ప్రియాంక

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగంపై కాంగ్రెస్ ముఖ్య నాయకురాలు ప్రియాంకగాంధీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన నాన్‌స్టాప్‌గా మహాకుంభమేళాపై ఆశావాద ప్రసంగం చేస్తూ పోయారని, ఇంకెవరికీ మాట్లాడే అవకాశం ఇవ్వలేదని అన్నారు. ప్రతిపక్షాలకు కూడా మాట్లాడే అవకాశం ఇస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాలకు కూడా వారు మాట్లాడాల్సిన అంశాలు మనోభావాలు ఉంటాయని ప్రియాంకగాంధీ అన్నారు. తాను కూడా తమ అభిప్రాయాలు వెల్లడించాలి కదా అని ప్రశ్నించారు. కనీసం రెండు నిమిషాలైనా ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం ఇస్తే బాగుండేదని అన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం లోక్‌సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. మహాకుంభమేళా విజయం అందరూ కలసికట్టుగా చేసిన కృషికి నిదర్శనమని అన్నారు.

# చిన్న కేసులూ మా వద్దకా: సుప్రీం

(మొదటిపేజీ తరువాయి)

సంబంధం లేకుండా చట్టం అమలుచేసే సంస్థలు కొందరు వ్యక్తులను నిర్బంధించేందుకు ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తాయి. అలా చేయడం ఆమోదయోగ్యం కాదు. రెండు దశాబ్దాల క్రితం చిన్న కేసుల్లో బెయిల్ పిటిషన్లు హైకోర్టు, సుప్రీంకోర్టులకు చాలా అరుదుగా వచ్చేవి. ట్రయల్ కోర్టు స్థాయిలో పరిష్కారం కావాల్సిన కేసులకు సంబంధించి బెయిల్ పిటిషన్ల విషయంలో అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడమనేది దిగ్భ్రాంతి కలిగిస్తోంది. అనవసరంగా వ్యవస్థపై భారం పడుతోంది' అని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఒక చిన్న కేసులో రెండేళ్లకు పైగా కస్టడీలో ఉన్న నిందితుడికి ధర్మాసనం బెయిల్ మంజూరుచేసింది. దర్యాప్తు పూర్తయి ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ నిందితుడి బెయిల్ పిటిషన్‌ను ట్రయల్ కోర్టు, గుజరాత్ హైకోర్టు తిరస్కరించాయి. మేజిస్ట్రేట్లు విచారించగలిగే కేసుల్లో బెయిల్ విషయాలను సుప్రీంకోర్టు ముందుకు తీసుకురావడం దురదృష్టకరమని అభయ్ ఎస్ ఓకా అసహనం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని గుర్తించి ప్రస్తావించడం ఇదే తొలిసారి కాదు. చిన్నచిన్న నేరాలకు సంబంధించిన కేసుల్లోనూ బెయిల్ మంజూరు చేయడంలో ట్రయల్ కోర్టులు, హైకోర్టులు మరింత ఉదారవాద వైఖరితో వ్యవహరించాలని సూచించింది.

# ఆస్తులు తాకట్టు పెట్టి రూ.50 వేల కోట్ల రుణాలా?

### ప్రభుత్వంపై హరీశ్ రావు మండిపాటు

విశాలాంధ్ర - హైదరాబాద్: ప్రశ్నోత్తరాల పై ప్రతిపక్షాలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వం పారిపోయిందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. మంగళవారం కీలకమైన ప్రశ్నలుండటం వల్లే సమాధానం చెప్పలేక ప్రభుత్వం ప్రశ్నోత్తరాల గంటను రద్దు చేసుకుందని పేర్కొన్నారు. శాసనసభ లాబీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీని పైన స్పీకర్‌కు, కార్యదర్శికి అభ్యంతరం చెప్పామన్నారు. ఈ ప్రభుత్వం హెచ్ ఎండీఏ భూములు తాకట్టు పెట్టి రూ.20 వేల కోట్లు, టీజీఐఐసీ- రూ.10 వేల కోట్లు, హెచ్ ఎండబ్ల్యూఎస్-రూ. 10 వేల కోట్లు, జీహెచ్ ఎంసీ ఆస్తులను తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లు మొత్తం రూ.50 వేల కోట్లను అప్పు తెస్తోందని ఆరోపించారు. సభలో మా ప్రశ్నల పై సమాధానం చెప్పలేక ప్రభుత్వం మా గొంతు నొక్కి ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. సభ్యుల హక్కులను స్పీకర్ కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. జీవోలను వెబ్‌సైట్‌లో కూడా పెట్టడం లేదన్నారు. ఆంధ్రజ్యోతిలో కారణంగా మహబూబ్ నగర్, నల్లగొండలో పంటలు ఎండిపోతు న్నాయని, రైతు భరోసా వానాకాలం వేశారా లేదా అని ప్రశ్న వేస్తే... దానిని రద్దు చేశారన్నారు. కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చెయ్యకపోవడం వల్ల తక్కువ ధరకు రైతులు పంటలు అమ్ముకొని నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. మా హయాంలో 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ప్రస్తుత ప్రభుత్వం కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం మాత్రమే కొనుగోలు చేసిందన్నారు. ప్రభుత్వం చెప్పినట్లు యాసంగి రైతు భరోసా ఇంతవరకు ఇవ్వలేదని చెప్పారు. వరంగల్ జిల్లాలో దేవాదుల, దుబ్బాకలో మల్లన్న సాగర్ కింద పంటలు ఎండిపోతున్నాయన్నారు. నా నియోజకవర్గంలో రైతు భరోసా కింద రైతులకు రూ.39 కోట్లు మాత్రమే ఇచ్చారని... ఇంకా 37 కోట్లు రావాల్సి ఉందన్నారు.

# దళితుల అభ్యున్నతికి కృషి

(మొదటిపేజీ తరువాయి)

రాజీవ్ యువ వికాసం పథకాల్లో ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అందరూ సమర్ధిస్తున్నారని, 2026 జనగణన పూర్తి కాగానే ఆ లెక్కల ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లు పెంచుతామన్నారు. రిజర్వేషన్లు పెంచడం వారిని సహేతుకంగా పంచడం మా బాధ్యత అని, సభా నాయకుడిగా ఇందిరమ్మ రాజ్యంలో మీకు అన్యాయం జరగదు అని మాట ఇస్తున్నా అంటూ చెపుకొచ్చారు. రిజర్వేషన్లను పెంచి వాటిని అమలు చేసే బాధ్యత మేం తీసుకుంటామని, బిల్లు ఆమోదానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

**సీఎంకు బీసీ సంఘాల నాయకుల అభినందన**

బీసీ రిజర్వేషన్ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపిన నేపథ్యంలో అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి బీసీ సంఘాల నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ అభినందనలు నాకు కాదు ఈ అభినందనలు అందించాల్సింది రాహుల్ గాంధీకి అన్నారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా అధికారంలోకి వచ్చిన రాష్ట్రాల్లో కులగణన నిర్వహిస్తామని రాహుల్ గాంధీ స్పష్టంగా చెప్పారని, ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో కులసర్వే నిర్వహించామని పేర్కొన్నారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లు పెంచుకోవాలంటే ముందుగా జనాభా లెక్క తేలాలన్నారు. ఆ లెక్కలకు చట్టబద్దత కల్పిస్తే అప్పుడే రిజర్వేషన్లు పెంచుకునేందుకు వీలుంటుందన్నారు. అందుకే రాష్ట్రంలో బీసీ కులసర్వే నిర్వహించుకున్నామని, అసెంబ్లీలో ఫిబ్రవరి 4 కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అందుకే ఫిబ్రవరి 4 ను సోషల్ జస్టిస్ డేగా ప్రకటించుకున్నామని చెప్పారు. పక్కా ప్రణాళికతో మంత్రివర్గ ఉపసంఘం, ఆ తరువాత డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసి ఒక టైం ఫ్రేమ్ లో కులసర్వే పూర్తి చేశామన్నారు. మొదటి విడతలో కులసర్వేలో పాల్గొనని వారికోసం రెండో విడతలో అవకాశం కల్పించామని, పూర్తి పారదర్శకంగా కులసర్వేను పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ కులసర్వే దేశానికి ఒక మైలురాయిగా నిలిచిపోతుందని, ఇందులో భాగస్వాములవడం తమకు గర్వకారణంగా ఉందన్నారు. దీనిని బీసీ సోదరులు అర్ధం చేసుకోవాలని, దీన్ని తప్పుపడితే నష్టపోయేది బీసీ సోదరులేనని తెలిపారు. కేవలం దాక్యుమెంట్ చేసి వదిలేయకుండా చట్టబద్దత కల్పించేందుకు బిల్లు చేశామని, రాజకీయ పరమైన రిజర్వేషన్లు, విద్యా ఉద్యోగ రిజర్వేషన్ల కోసం వేర్వేరుగా రెండు బిల్లులు శాసనసభలో ఆమోదించుకున్నామన్నారు. జనగణనలో కులగణన ఎప్పుడూ జరగలేదని, జనగణనలో కులగణనను చేర్చితే సరైన లెక్క తేలుతుందని స్పష్టం చేశారు. మండల్ కమిషన్ కూడా బీసీల లెక్క 52 శాతం అని తేల్చిందని కానీ మేం కులసర్వే ద్వారా బీసీల లెక్క 56.36 శాతంగా తేల్చామన్నారు. లెక్కతేల్చడం కోసమే స్థానిక ఎన్నికలు వాయిదా వేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ బీసీలకు అండగా ఉందని, భవిష్యత్తులో కూడా ఉంటుందన్నారు. టీపీసీసీ అధ్యక్షులుగా పనిచేసినవారిలో ఎక్కువ మంది బీసీలే ఉన్నారని, ఈ కులగణన అందరికీ భగవద్గీత, బైబిల్, ఖురాన్ లాంటిదన్నారు. కులం ముసుగులో రాజకీయంగా ఎదగాలని అనుకునే వారి ట్రాప్ లో పడకండని పిలుపునిచ్చారు. ఈ సర్వేను తప్పుపడితే నష్టపోయేది మీరే అని వ్యాఖ్యానించారు. పునాదిలోనే అడ్డుపడితే మీకు మీరే అన్యాయం చేసుకున్నవారవుతారని, మీ హక్కుల సాధన కోసం మీరే నాయకత్వం వహించండి నేను మీకు మద్దతుగా నిలబడతానని స్పష్టం చేశారు.

# ఆధార్‌తో ఓటరు ఐడీ లింక్

(మొదటిపేజీ తరువాయి)

త్వరలో సంబంధిత అంశాలపై చర్చిస్తారని పేర్కొంది. కాగా, న్యూఢిల్లీలోని ఈసీఐ ప్రధాన కార్యాలయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీ, కేంద్ర హోంశాఖ కార్యదర్శి, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి, ఉడాయ్ సీఈఓ, ఈసీ సాంకేతిక నిపుణులు సమావేశమయ్యారు. ఓటరు ఐడీతో ఆధార్‌ను అనుసంధానం చేయడంపై సుదీర్ఘంగా చర్చించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుంది. వ్యక్తి గుర్తింపును నిర్ధారించగలిగిన పత్రంగా ఆధార్ మాత్రమే ఉంటుందన్న దృష్టిలో పెట్టుకొని అనుసంధానం ప్రక్రియకు కేంద్రం పచ్చజెండా ఊపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్ల 23(4), 23(5), 23(6) నిబంధనలు, 2023లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా ఓటర్ ఐడీ, ఆధార్ కార్డు అనుసంధాన ప్రక్రియను చేపడుతున్నట్టు ఈసీఐ తెలిపింది. ఎన్నికల సంఘం తాజా నిర్ణయాన్ని ప్రజాస్వామిక వాదులు కొందరు స్వాగతించారు.

**ఆ చర్యకు సిద్ధం: సుప్రీంతో ఈసీ**

బూత్ వారీగా పోలింగ్ శాతాన్ని తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలనే డిమాండ్‌ను పరిశీలించేందుకు సిద్ధమని ఎన్నికల సంఘం తాజాగా సుప్రీంకోర్టుకు తెలిపింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ ముగిసిన 48 గంటల్లోపు పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటింగ్ శాతం డేటాను తన వెబ్‌సైట్‌లో పెట్టేలా ఈసీని ఆదేశించాలని 2019లో టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా, ఎన్జీఓ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్లపై సీజేఐ సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తులు సంజయ్ కుమార్, కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది మణీందర్ సింగ్ వాదనలు వినిపించారు. ఈ ఫిర్యాదును చర్చించడానికి ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ సమావేశం య్యారని, పిటిషనర్లు ఆయనను కలిసి వారి సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. బూత్ వారీగా ఓటింగ్ శాతాన్ని అప్‌లోడ్ చేయాలనే డిమాండ్‌పై చర్చించడానికి ఈసీ సిద్ధమన్నారు. ఈసీ వాదనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, 10 రోజుల్లోగా ఈసీ ఎదుట తమ అభిప్రాయాలను తెలియజేయాలని పిటిషనర్లకు సూచించింది. తదుపరి విచారణను జులై 28వ తేదీకి వాయిదా వేసింది.

# ఇజ్రాయిల్ మారణహోమం

(మొదటిపేజీ తరువాయి)

ఒకే కుటుంబానికి చెందిన 17 మంది మృత్యువాత పడ్డారు. వీరిలో 12 మంది మహిళలు, ఐదుగురు పిల్లలు ఉన్నారని యూరోపియన్ ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. జనవరిలో కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన తర్వాత ఇంతటి భీకర దాడులు ఎప్పుడూ జరగలేదు. ఒప్పందం కాల్పుల విరమణను పొడిగించేలా చర్చలు జరుగుతుండటం... ఇజ్రాయిల్ మాత్రం దుందుడుకు చర్యలకు పాల్పడుతోంది. తాజా దాడుల్లో ఇద్దరు ఉన్నతస్థాయి పోలీసు అధికారులు, నలుగురు సీనియర్ అధికారులు చనిపోయినట్లు హమాస్ ప్రభుత్వ మీడియా పేర్కొంది.

**చర్చల్లో పురోగతి లేనందునే: నెతన్యాహు**

కాల్పుల విరమణ దిశగా సాగే చర్చల్లో పురోగతి కనిపించకపోవడంతో దాడులకు ఆదేశాలిచ్చినట్లు ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తెలిపారు. బందీలందరినీ విడిపించే వరకు తమ పోరు ఆగదన్నారు. 'ఇజ్రాయిల్ ఇకపై మరింత సైనిక బలంతో హమాస్‌పై దాడులు చేస్తుంది' అని ఆయన ఓ ప్రకటన చేశారు. తూర్పు గాజాను ఖాళీ చేయాలని ఇజ్రాయిల్ సైన్యం ఆదేశించింది. క్షేత్రస్థాయిలో మరింత భీకర దాడులు జరపనున్నట్లు సంకేతాలిచ్చింది. బందీలంతా ఇంటికి చేరేంత వరకు పోరు ఆగదని ఆ దేశ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ వెల్లడించారు.

**ఇది బందీలకు మరణశాసనమే: హమాస్**

కాల్పుల విరమణ ఉల్లంఘనకు పూర్తి బాధ్యత నెతన్యాహు వహించాలని హమాస్ స్పష్టంచేసింది. 'యుద్ధం చేయాలన్న నెతన్యాహు నిర్ణయం మిగతా బందీలకు మరణశాసనమే' అని హమాస్ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. అవలిమిత రాజకీయ, సైనిక మద్దతు కోసం ఇజ్రాయిల్ గాజాపై భయానక వైమానిక దాడులను తెగబడుతోంది. దురాక్రమణకు, మారణహోమానికి పూర్తి బాధ్యత ఇజ్రాయిల్, వాషింగ్టన్ వహించాలి' అని ఒక ప్రకటన చేశారు. ఈ దురాక్రమణ ఆపడానికై చేసేందుకు మధ్యవర్తులతో చర్చిస్తున్నట్లు తెలిపారు. హమాస్ ఇప్పటివరకు ప్రతీకార దాడులకు జరిపినట్లు సమాచారం లేదు. కాగా, ఇజ్రాయిల్ తమకు చెప్పే దాడులు చేసినట్లు శ్వేతసౌధం ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లీవిట్ ఓ ప్రకటన విడుదల చేశారు. 'గాజాపై దాడులు జరపడానికి ముందు శ్వేతసౌధాన్ని ఇజ్రాయిల్ సంప్రదించింది. హమాస్, హౌతీలు, ఇతర ఉగ్రవాదులతో కేవలం ఇజ్రాయిల్‌కే కాదు... అమెరికాకూ ముప్పు. అందుకే వారందరినీ అంతం చేయాలని అధ్యక్షుడు ట్రంప్ చెప్పారని లీవిట్ తెలిపారు.

**ఇరాన్, ఈజిప్టు, టర్కీ, రష్యా ఖండన**

తాజా వైమానిక దాడులను అత్యంత భయంకరమైనవని ఇరాన్, ఈజిప్టు, టర్కీ, రష్యా దేశాలు పేర్కొన్నాయి. ఇజ్రాయిల్ తీరును ఆక్షేపించాయి. భారీస్థాయిలో ప్రాణనష్టం జరుగుతుండటంపై ఆందోళన వ్యక్తంచేశాయి. ఈ దాడులకు అమెరికా ప్రత్యక్ష బాధ్యత వహించాలని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బకేయీ డిమాండ్ చేశారు. కాల్పుల విరమణను ఉల్లంఘించడం, మారణహోమానికి పాల్పడటం ఆమోదయోగ్యం కాదని ఈజిప్టు పేర్కొంది. గాజా ప్రజలకు మానవతా సాయం అందించేందుకు కాకుండా కాల్పుల విరమణ కచ్చితంగా అమలయ్యేలా చూడాలని అంతర్జాతీయ సమాజానికి టర్కీ పిలుపునిచ్చింది. మారణహోమం విధానంలో కొత్త దశకు తాజా దాడులు అద్దం పట్టాయని, ఈ పరిణామాలు పశ్చిమాసియా భవిష్యత్‌కు ప్రమాదకరమని టర్కీ విదేశాంగ శాఖ పేర్కొంది. ఇజ్రాయిల్ దాడులతో గాజాలో భారీగా ప్రాణ నష్టం సంభవిస్తుండటం ఆందోళన కలిగిస్తోందని క్రెమ్లిన్ పేర్కొంది.

ఇది అత్యంత భయానక పరిస్థితి అంటూ ఐక్యరాజ్య సమితి (ఐరాస) ఆందోళన వ్యక్తం చేసింది. 'ఇజ్రాయిల్ భయానక రీతిలో రక్తపాతం సృష్టిస్తూ విపత్కర పరిస్థితులను మరింత జటిలం చేస్తోంది' అని ఐరాస హక్కుల అధిపతి వోల్కర్ టర్క్ ఆవేదన వ్యక్తంచేశారు. ఇజ్రాయిల్‌కు మనస్సాక్షి లేదా అంటూ ఐరాస చిన్నారుల సంస్థ కమ్యూనికేషన్స్ నిపుణులు రోసాలియా బొల్లెన్ వ్యాఖ్యానించారు. 'రెండు నెలల కాల్పుల విరమణతో కాస్త ఊపిరి పీల్చుకున్న గాజా ప్రజలపై ఇజ్రాయిల్ అర్థరాత్రి భీకర దాడులకు పాల్పడటం దారుణం. 'పేలుళ్ల శబ్దాలతో అర్ధరాత్రి 2 గంటలకు నిద్ర నుంచి ఉలిక్కిపడి లేచాం' అని ఆమె వెల్లడించారు.

**వైద్యం అతికష్టం: రెడ్ క్రాస్**

పలస్తీనా భూభాగంలో వైద్య సేవలు అందించడం చాలా కష్టతరమైనట్లు రెడ్‌క్రాస్ తెలిపింది. ఇజ్రాయిల్ దాడులతో పరిస్థితి మరింత జటిలంగా మారిందని పేర్కొంది. అరకొర వైద్య సదుపా యాలు కూడా అవసరాలకు అందే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తంచేసింది. మృతదేహాలు పెద్ద సంఖ్యలో ఆసుపత్రులకు చేరుతుండటంతో నెలకొన్న దారుణ పరిస్థితులు, సిబ్బందిపై ఒత్తిడి గురించి జెనీవాలో మీడియాతో మాట్లాడిన ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్ క్రాస్, రెడ్ క్రెసెంట్ సొసైటీస్ అధికార ప్రతినిధి టొమ్మాసో డెల్లా లాంగో వెల్లడించారు. మారణహోమాన్ని ఆపాలంటూ గాజాలోని బందీల కుటుంబాలు నెతన్యాహుకు విన్నవించాయి. ప్రధాని, రక్షణ మంత్రి, రాయబార బృందం అధిపతిని కలిసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు హాస్టేజెస్ అండ్ మిస్సింగ్ ఫ్యామిలీస్ ఫోరం తెలిపింది.

# 45 శాతం ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు

(మొదటిపేజీ తరువాయి)

ఎదుర్కొంటున్నారు. టీడీపీకి చెందిన 61 శాతం (82 మంది ఎమ్మెల్యేలు) మంది ఎమ్మెల్యేలు తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దేశంలో బీజేపీకి చెందిన ఎమ్మెల్యేల్లో దాదాపు 39 శాతం అంటే 1,653 మంది శాసనసభ్యుల్లో 638 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించారు. వారిలో 436 మంది అంటే 26 శాతం మంది తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 646 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో (52 శాతం) 339 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. 194 మందిపై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయని ఆ నివేదిక తెలిపింది. తమిళనాడు అధికార డీఎంకేలో 74 శాతం (132 మందిలో 98) మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. వీరిలో 42 మంది తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేల్లో దాదాపు 41 శాతం అంటే 230 మందిలో 95 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. వారిలో 78 మంది (34 శాతం) తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మొత్తంగా 54 మంది ఎమ్మెల్యేలు హత్య ఆరోపణలు ఎదుర్కొంటున్నారని, 226 మందిపై హత్యాయత్నం కేసులు ఉన్నాయని నివేదిక పేర్కొంది. 127 మంది ఎమ్మెల్యేలు మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులను ఎదుర్కొంటున్నారు. వీరిలో 13 మంది అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్నట్లు నివేదిక వెల్లడించింది. నేరారోపణలే కాకుండా ఎమ్మెల్యేల ఆర్థిక నేపథ్యాన్ని కూడా నివేదిక వెల్లడించింది. 119 మంది ఎమ్మెల్యేలను (3 శాతం) బిలియనీర్లుగా పేర్కొంది. అన్ని రాష్ట్ర అసెంబ్లీల్లోని ఎమ్మెల్యేల ఆస్తులు రూ.17.92 కోట్లు అని, క్రిమినల్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల ఆస్తులు రూ. 20.97 కోట్లుగా ఉన్నట్లు నివేదిక తెలిపింది.

# అంతర్రాష్ట్ర నిందితుడు అరెస్టు : సీపీ

విశాలాంధ్ర- సత్తుపల్లి : అంతర్రాష్ట్ర దొంగను సత్తుపల్లి పోలీసులు అరెస్టు చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. మంగళవారం సత్తుపల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సిపి తెలిపిన వివరాలు ప్రకారం మార్చి 10 రాత్రి 9 గంటల సమయంలో పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ నరేష్ కుమార్‌కు అనుమానాస్పద వ్యక్తి తారసపడటంతో అతన్ని పట్టుకునే ప్రయత్నం చేయగా కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అతడు అంతర్ రాష్ట్ర దొంగ సురేంద్రగా గుర్తించినట్లు ఖమ్మం సిపి వెల్లడించారు. వేంసూర్ రోడ్డులో స్మశాన వాటిక సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని గమనించిన కొందరు పోలీసులకు సమాచారం అందించగా పట్టణ సీఐ నరేష్, ఎస్సై కవిత సిబ్బందితో కలిసి వెళ్లి చూడగా అంతర్రాష్ట్ర గజదొంగ సురేంద్ర గా గుర్తించారు. దాడిలో గాయపడిన నరేష్ కుమార్ సురేందర్ ను గుర్తించడంతో పోలీసులు అతన్ని పట్టుకొని విచారించారు. కానిస్టేబుల్ నరేష్ కుమార్ పై దాడికి సంబంధించి సత్తుపల్లి పిఎస్ లో కేసు నమోదు అయిందన్నారు. కానిస్టేబుల్ నరేష్ పై దాడి చేస్తున్న సమయంలో దగ్గర్లో ఉన్న ప్రసాద్ రాజు అనే వ్యక్తి తిరు వీధుల సురేందర్‌గా గుర్తించారన్నారు. తిరువీధులసురేంద్ర తాపీ మేస్త్రీ గా పని చేస్తూ దొంగతనాలకు అలవాటు పడ్డాడని అన్నారు. సురేంద్ర స్వగ్రామం ఆంధ్ర ప్రదేశ్ లోని ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చిత్తపూర్ గ్రామం అన్నారు. ఆ తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల్లో 90కి పైగా నేరాలు చేశాడన్నారు చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఓ కేసులో నేరస్థుడిగా శిక్ష అనుభవిస్తు బెయిల్‌పై విడుదలయ్యాడని, అప్పటి నుంచి మూడు నెలల వ్యవధిలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఏడు జిల్లాల్లో 43 దొంగతనాలు చేశారన్నారు. ఖమ్మం కమిషనరేట్ పరిధి లో 15 దొంగతనాలు చేసాడన్నారు . కొత్తగూడెంలో 4 దొంగతనాలు, మహబూబాబాద్‌లో 3 దొంగతనాలు, వరంగల్ కమిషనరేట్‌లో 3 దొంగతనాలు సూర్యాపేటలో 7, నల్గొండలో 5, ఏలూరులో 5, పశ్చిమ గోదావరి జిల్లాలో 1 దొంగతనం చేయడం ద్వారా మొత్తం 43 దొంగతనాలు చేశారన్నారు. రెండు కేసుల్లో అతని నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తు 45 లక్షలు ఉంటుందని సిపి సునీల్ దత్ తెలిపారు. సమావేశంలో కల్లూరు ఏసీపీ రఘు, సీఐ కిరణ్, ఎస్సై కవిత పాల్గొన్నారు.

## కృత్రిమ మేధాతో విద్యార్థులకు విద్యా బోధన

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: సర్కారు బడుల్లో కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను వినియోగిస్తూ విద్యార్థులకు సులభతరంగా విద్య బోధన చేసేందుకు చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం ఆయన రామగుండం మండలం గాంధీ పార్క్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,ఉర్దూ మీడియం ఎంపిపిఎస్ స్కూల్ , ఇంగ్లీష్ మీడియం లను తనిఖీ చేశారు.ఎ.ఐ విద్యా బోధన కోసం ఆయా పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ (ఏ.ఐ)ను వినియోగిస్తూ విద్యార్థుల ఆకట్టుకునేలా సులభ రీతిలో బోధన ప్రారంభించాలని,విద్యార్థులకు మంచి లెర్నింగ్ ఎక్స్పీరియన్స్ దక్కేలా చూడాలని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో 20 ప్రభుత్వ పాఠశాలలో ముందస్తుగా పైలెట్ ప్రాజెక్టు కింద ఏ.ఐ. విద్యాబోధనను ప్రారంభిస్తున్నామని తెలిపారు. పిల్లలు తెలుగు,ఆంగ్లం బాగా చదివి, రాసేలా, గణిత అంశాల్లో పట్టు సాధించేలా చూడడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి,ఏ.ఎం.ఓ డాక్టర్ పిఎం షేక్, సంబంధిత అధికారులు,పాల్గొన్నారు.

## వీరేందర్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర గూడూరు: గూడూరు మండలం గుండెంగా గ్రామం తేజవత్ ధంజా తండకు చెందిన తేజవత్ వీరేందర్ టీజీపీఎస్సీ పరీక్షలలో విజయభేరి మోగించి హిందీ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. పేదరికంలో పుట్టి చదువులో రాణించి శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. అంచలం చలుగా ఎదిగి చదువులో ఉన్నత శిఖరాలను అదిరోహించారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీద జూనియర్ లెక్చరర్ నియమాక పత్రమును అందుకున్నారు. మంగళవారం కొత్తగూడజూనియర్ కాలేజీలో హిందీ పండిట్‌గా బాధ్యత స్వీకరించారు. వీరేందర్ మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో,పట్టుదలతో గమ్యాన్ని చేరుకోవచ్చని వీరేందర్ తెలిపారు.కాలేజీ ప్రిన్సిపాల్ వెంకన్న, కుటుంబ సభ్యులు వీరేందర్ ను శాలువతో సన్మానించారు.

## ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచాలి : కలెక్టర్

విశాలాంధ్ర -జిల్లా బ్యూరో మహబూబాబాద్: జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ అద్వైత కుమార్ సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ మొదటి అంతస్తులోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఏపీఓలతో కలసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ( ఎన్ఆర్ఈజీఎస్ ) పనుల్లో వేగం పెంచి, కూలీల సంఖ్య వంద శాతం హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మార్చి 31 లోపు, జిల్లాలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా జరుగుతున్న పనులు కాలువ పూడికతీత, చెక్‌డ్యాం నిర్మాణం, ఇంకుడు గుంతలు, తదితర అన్ని పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సాల్ టోప్పో, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్ రాజు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఎంపీడీవోలు ఏపీ ఓలు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - గార్ల : మండలంలోని రాంపురం చెక్ డ్యాం పై హై లెవల్ బ్రిడ్జి తోపాటు ముల్కనూరు సమీపంలో మున్నేరు ప్రాజెక్టు నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక మంగపతిరావు భవనం లో వి.పి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సిపిఎం పార్టీ మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. మార్చి బడ్జెట్ లో నిధుల మంజూరు కు స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య సియం దృష్టి కి తీసుక వెళ్ళాలని కోరారు. ఈ సమావేశంలో మండల నాయకులు అంబటి వీరాస్వామి, ఇమ్మడి గోవింద్, మల్లెల నాగమణి, చింత మౌనిక, భాగం లోకేశ్వరావు, చింత ఎల్లయ్య, ధారావత్ బాబు, అలవాల రామకృష్ణ, ఇస్లావత్ రాము తదితరులు పాల్గొన్నారు

## రేషన్ బియ్యం స్వాధీనం

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా ఖానాపూర్ : ఇంద్రనగర్, ఖానాపూర్ టౌన్‌కు చెందిన కడమంచి లక్ష్మణ్ తండ్రి పోషన్న అమాయక ప్రజల నుంచి తక్కువ ధరకు సుమారు 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, బియ్యాన్ని ఖానాపూర్ పట్టణం ఇంద్ర నగర్‌లోని అతని ఇంటి వెనుకల ప్రహరీ గోడ వద్ద నిల్వచేసి అధిక ధరకు అమ్ముటకు సిద్ధంగా ఉంచారు. ఈ విషయమై సమాచారం అందిన వెంటనే ఫిర్యాదు మేరకు సుమారు 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఖానాపూర్ ఎస్సై గైక్వాడ్ రాహుల్ తెలిపారు .

## కాంగ్రెస్‌తోనే బీసీ రిజర్వేషన్ పెంపు సాధ్యం

విశాలాంధ్ర- పినపాక: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంపు కాంగ్రెస్ పార్టీకే సాధ్యమైందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరిణామంతో మండల కాంగ్రెస్ శ్రేణుల్లో మంగళవారం హర్షతిరేకాలు వ్యక్తం అయ్యాయి. బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి, ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి నియోజకవర్గం వ్యాప్తంగా సంబరాలు చేసుకున్నారు. మణుగూరు మండలం ప్రజా భవన్‌లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, అడవి అభివృద్ధి చైర్మన్ పోదెం వీరయ్య ఆదేశాలమేరకు మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్ అధ్యక్షతన పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ సోమవారం అసెంబ్లీలో అత్యంత ప్రతిష్టాత్మకంగా బీసీ కులగణన బిల్లును ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో లో ఇచ్చిన హామీ మేరకు, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశంలోనే మొదటిసారిగా కుల గనన నిర్వహించి, 42 శాతానికి పెంచుతూ బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు ఆమోదానికి ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివ సైదులు, ఐతనబోయిన సతీష్, సౌజన్య, కనకలక్ష్మి, పాలమూరు రాజు, గాండ్ల సురేష్, టివి సుబ్బారెడ్డి, పాల్వంచ రాములు, గోరంట్ల కనకయ్య, వెంకట్రావు గౌడ్, సోమేశ్వరరావు గౌడ్, గుండగని నాగేశ్వరరావు, సాదిని సీతయ్య, మదడి రాజేష్, శ్యామల, గౌతమీ, షబానా, పద్మ, రజిత, రవీందర్, రాంబాబు పాల్గొన్నారు.

## విద్యుత్ లైన్ల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేయండి : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం : జిల్లా వ్యాప్తంగా పోడు వ్యవసాయం చేసే రైతులకు నీటి సౌకర్యం కోసం విద్యుత్తులైన్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని పోడు వ్యవసాయంకు విద్యుదీకరణ, ఉపాధి హామీ పనుల పురోగతి తదితర పథకాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. త్రాగునీటి సంరక్షణ చర్యలు, మొక్కల పెంపకం, ఇంకుడు గుంతలు త్రవ్వకాలు, మీసేవ దరఖాస్తులు, ధరణి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం కోసం సంబంధిత అధికారులు కార్యచరణ రూపొందించాలన్నారు. ఎక్కడ అయితే విద్యుత్తు లైన్లు అవసరమో పంచాయతీ సెక్రటరీ గుర్తించి, విద్యుత్ లైన్ల మంజూరుకు అవసరమైన పత్రాలు గ్రామసభ ఆమోదంతో అటవీశాఖ అధికారులకు అందించాలన్నారు. విద్యుత్ లైన్ల ఏర్పాటు సాధ్యం కానీ ప్రదేశాలలో అటవీ శాఖ అధికారుల ఆమోదంతో బావులు త్రవ్వి సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలనీ సూచించారు. పోడు భూములలో ఆయిల్ ఫామ్ సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ భూముల్లో నీటి గుంటలు త్రవ్వకాల కోసం రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. బోర్లతో వ్యవసాయం చేసే ప్రతి భూమిలో నీటి గుంటలు ఉండాలన్నారు. జిల్లాలోని అన్ని నర్సరీలలో ఇప్ప, కరక్కాయ, చింత, విష ముష్టి, కుంకుడు, తంగేడు వంటి మొక్కలను పెంచాలని సూచించారు. వీటికోసం గింజల సేకరణ మొదలు పెట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, అడిషనల్ డి ఆర్ డి ఓ రవి, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాసరావు, అధికారులు స్వర్ణలత లెనినా, వెంకటేశ్వర చారి, అనసూర్య, ఇందిర, నలిని తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న పాలకులు : కొండపర్తి

విశాలాంధ్ర- నేలకొండపల్లి: సమాజ మనుగడలో ప్రధాన భూమిక పోషిస్తున్న వ్యవసాయ రంగాన్ని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారు అని తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద కనకబండి సీతారాములు అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మండల 3వ మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొండపర్తి గోవిందరావు మాట్లాడుతూ.. నేటి పాలకులు కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతుల సంక్షేమాన్ని విస్మరించడం ఆందోళన కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. 70 శాతం ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి ప్రజలు జీవిస్తున్నప్పటికీ ఆ రంగాన్ని పట్టించుకోవడం లేదన్నారు . రైతుల భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే చట్టాలను రూపొందించి చిన్న సన్న కారు రైతుల వ్యవసాయానికి ప్రోత్సాహకాలు , ప్రకటించాలని డిమాండ్ చేశారు . రైతుల ఆర్థిక సంక్షోభంలో కోరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటూ దిక్కులేని పరిస్థితిలోకి నెట్టి , నెట్టి వేయబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి అని పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మండల కమిటీ నీ ఎన్నుకున్నారు రైతు సంఘం మండల అధ్యక్షుడు గా కనకబండి సీతారాములు, కార్యదర్శి గా పాల్తియ శ్రీనివాస్ మండల కమిటీ గా 11 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా, రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిడికంటి వేంకటరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ప్రసాద్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బానోతు రామకోటి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, కౌన్సిల్ సభ్యులు కుంచం భిక్షం,చిర్ర ప్రసాద్,చావా గణపతి,వల్లలా కృష్ణ, పొలంపల్లి నారాయణ, భూక్యా రాములు, వేంకటేశ్వరరావు, వేంకటేశ్వర్లు, బాలిన కృష్ణంరాజు,చిలివేరు రేణుబాబు, మేకల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాలికల వసతి గృహం తనిఖీ

విశాలాంధ్ర -ములుగు జిల్లా బ్యూరో : ఏటూరు నాగారం మండలం ఆకులవారి ఘనపురంలోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహంను మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. ఆకస్మిక తనిఖీ చేశారు. ఏటూరు నాగారంలోని ఐటిఐ క్యాంపస్‌లో కొత్త ట్రేడ్ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నూతన బిల్డింగ్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పరిశీలించారు.అనంతరం ఐటిఐ కళాశాలలో అగ్ని పత్ విర్ అగ్నిపథ్ కింద 2025-26 సంవత్సరానికి అగ్నివీర్ నియామకానికి అవివాహిత పురుష అభ్యర్థులు భారత సైన్యం లో చేరుటకు ఆన్లైన్ దరఖాస్తుల చేయు విధానము ను అవగాహన కార్యక్రమము నకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై యువతకు పలు సూచనలు చేశారు. ఏటూరునాగారం మండలంలోని ముళ్లకట్ట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, పనుల గ్రౌండింగ్ కొరకు నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొని, ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పనులను పరిశీలించారు. రామన్నగూడెంలోని ఓ హెచ్ ఎస్ ఆర్ ట్యాంకు ను కలెక్టర్ పరిశీలించి, వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, మిషన్ భగీరథ పైపులైన్లను క్రమం తప్పకుండా పరిశీలించి, ఎక్కడైనా మరమ్మతుల అవసరం ఉంటే, వెంటనే చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూ ఎస్ డి ఈ సతీష్ కుమార్, ఏఈ శ్రీనివాస్, పాల్గొన్నారు.

## విద్యార్థులు టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించాలి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : టెన్త్ పరీక్షల్లో సింగరేణి సంస్థ పాఠశాలలోంల చదువుతున్న విద్యార్థులందరూ అద్భుతమైన ఫలితాలు సాధించాలని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బాలరామ్ ఆకాంక్షిస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 2 వరకు టెన్త్ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి జి. శ్రీనివాస్ తోపాటు సంస్థ పాలిటెక్నిక్ ఫ్యాకల్టీలు శ్యామల, పార్వతి లు సీఎండీ ని మర్యాద పూర్వకంగా కలిశారు. సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల 17 వ వార్షికోత్సవం ఈ నెల 22న నిర్వహించనున్నారు. ఈ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథులు గా హాజరవ్వాలని సీఎండీ తోపాటు ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు, డైరెక్టర్ (పా ) వెంకటేశ్వర్లు ను ఆహ్వానించారు. సింగరేణి విద్యాలయాల అంశాలపై సీఎండీ వారిని అడిగి తెలుసు కున్నారు. టెన్త్ పరీక్షలు భవిష్యత్తు విజయాలకు తొలి మెట్టు లాంటివని బాలరామ్ అన్నారు. విద్యార్థులు ఈ రెండు వారాలు వేరే ఆలోచనలకు స్వస్తి పలికి పుస్తకాల పైనే ఏకగ్రత పెట్టి శాయశక్తులా కృషి చేయ్యాలని ఆయన సూచించారు. టెన్త్ బోర్డు పరీక్షలను విద్యార్థులు తొలి సవాల్ గా స్వీకరించాలని కోరారు. అప్పుడే పట్టుదల, ధైర్యం కలిగి ఏకగ్రత ఏర్పడుతుందన్నారు.

## బీసీల రిజర్వేషన్ బిల్లు ఆమోదంపై నేతల హర్షం

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును శాసనసభలో ప్రవేశ పెట్టి, ఆమోదం తెలిపిన తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డికి, మంత్రి మండలికి, తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు, కాంగ్రెస్ పార్టీ ఏటూరునాగారం బ్లాక్ కమిటీ అధ్యక్షులు ఇర్స వడ్ల వెంకన్న, మండల కమిటీ అధ్యక్షులు సి. హెచ్. రఘు, మైనార్టీ జిల్లా అధ్యక్షులు అయూబ్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల కేంద్రంలో ని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకన్న,రఘు అయూబ్ మాట్లాడుతూ రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చరిత్రత్మకం మని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయించిన ఘనత రాహుల్ గాంధీ కి దక్కుతుందని,వారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఏర్పాటు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీ చరిత్రలో నిలుస్తుందన్నారు.తెలంగాణ శాసనసభలో బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రవేశపెట్టిన బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందడం సంతోషించదగ్గ విషయమని తెలిపారుకాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు తెలంగాణ ఇస్తా అని చెప్పి ఇచ్చిన ఘనత సోనియా గాంధీ కి దక్కిందని తెలిపారు. అలాగే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల ఇచ్చిన ఘనత రాహుల్ గాంధీకి దక్కుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలులో కాంగ్రెస్ పార్టీ చరిత్రలో నిలిచిపోతుందని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపికి చెందిన 8 మంది ఎంపీలను గెలిపించిన ప్రజలకు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ ద్వారా ఆమోదం పొందేలా చేసి, వారి యొక్క చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు.

## నల్గొండ బైపాస్‌పై సమీక్ష

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : రాష్ట్ర రోడ్లు ,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశాల మేరకు నల్గొండ బైపాస్ జాతీయ రహదారి 565కు సంబంధించి అవార్డు పాస్ చేయడం, పనుల ప్రారంభం వంటివి వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. మంగళవారం ఆమె తన ఛాంబర్‌లో నేషనల్ హైవే 565 నల్గొండ బైపాస్ పై జాతీయ రహదారుల సంస్థ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. ఈ రోడ్డుకు సంబంధించి అవార్డు పాస్ చేసేందుకు ముందుగా పత్రికలో నోటిఫికేషన్ విడుదల చేయటం, అలాగే మార్కెట్ ధర నిర్ధారణ, వివరాలన్నింటిని ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయడం పూర్తి చేయాలని సూచించారు. బైపాస్ సందర్భంగా స్ట్రక్చర్లు, ఇతర నిర్మాణాలపై ఆమె సమీక్షించారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జాతీయ రహదారుల సంస్థ విశ్రాంత భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్య నారాయణ ,జాతీయ రహదారుల సంస్థ ఎస్ ఈ ధర్మారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేంద్రప్రసాద్, నల్గొండ ఆర్డీవో అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## యువత అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర -ములుగు జిల్లా బ్యూరో : తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో నెహ్రూ యువ కేంద్ర వరంగల్ సౌజన్యంతో కస్తూరిబాయి మహిళామండలి ఆధ్వర్యంలో , మంగళవారం ఏటూరునాగారం డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో యువతకు లైంగిక వ్యాధులపై అవగాహన సమావేశం జరిగింది. మొదటగా అతిధులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రేణుక అధ్యక్షత వహించగా ,ముఖ్యఅతిథిగా ఏటూరునాగారం ఐసిడి ఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఇ పి ప్రేమలత మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో యువత విలువలతో కూడిన జీవితాన్ని పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రేమ, వ్యామోహం, మాటున యువత చెడు దారిలో పయనించకుండా నిగ్రహశక్తిని పెంపొందించుకొని, జీవితంలో స్థిరపడిన తర్వాతనే వివాహం చేసుకొని, జీవిత భాగస్వామితో మాత్రమే ఆనందంగా జీవించాలని, లేకుంటే అపరిచితులతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎయిడ్స్ వ్యాధికి గురయ్యే ప్రమాదం పొంచి ఉందని హితవుపలికారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న యువతకు వివిధ అంశాల పైన అవగాహన కల్పించారు. వివిధ సంఘాల నుంచి విచ్చేసిన బాధ్యులకు, కార్యక్రమంలో పాల్గొన్న యువతకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా మహిళా మండలి అధ్యక్షురాలు కొమరగిరి సామ్రాజ్యం, వెంకటయ్య, శ్యామలత, అడ్వకేట్ బానోత్ మహేందర్, జిల్లా హరికృష్ణ, రాజు పాల్గొన్నారు

## వీసీని సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర -ఖమ్మం :విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ జార్జి రెడ్డి పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు మంద సురేష్. జిల్లా కార్యదర్శి మస్తాన్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఖమ్మం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి ఖమ్మం ఉమ్మడి పరిధిలో ఉన్న కాకతీయ విశ్వవిద్యాలయంలో వివిధ డిగ్రీల మొదటి, మూడవ ఐదవ సెమిస్టర్ ఫలితాలు విడుదల కాగా యూనివర్సిటీ పరిధిలో పలు కళాశాల ఫలితాలు నిలిపివేశారని, కాకతీయ పరిధిలోని 303 డిగ్రీ కళాశాలు ఉన్నాయి వీటిలో బకాయిలు చెల్లించని 117 కళాశాలల విద్యార్థుల సెమిస్టర్ ఫలితాలు నిలిపివేయడం తో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న వీసీని తక్షణమే సస్పెండ్ చేసి, విద్యార్థులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి లు శివ నాయక్ వంశీ. జార్జిరెడ్డి పిడిఎస్యు జిల్లా సహాయ కార్యదర్శి అజయ్ ఇందు వర్ష టీబి విలాషా పాల్గొన్నారు

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు పోరాటాలు తప్పవు

విశాలాంధ్ర -ఖమ్మం : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిటీషన్ కార్డులు, హెల్త్ కార్డుల సమస్యలపై పోరాటాలు చేయక తప్పదని టీయూడబ్ల్యూజ ఐజేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టికోల రామనారాయణ అన్నారు. మంగళవారం వైరాలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఖమ్మం జిల్లా టియుడబ్ల్యూజే ఐజేయు మహాసభల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా మహాసభలు వైరాలో నిర్వహించేందుకు నాయకత్వం నిర్ణయించింది. ఈ సందర్భంగా రామ్ నారాయణ మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ఐ జె యు ఆధ్వర్యంలో గొప్ప గొప్ప పోరాటాలు జరిగాయని ఆయన పేర్కొన్నారు. జిల్లా స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు జర్నలిస్టుల సమస్యలపై ఐజేయు నాయకత్వంలో పోరాటాలు జరుగుతున్నాయని టియుడబ్ల్యూజే ఐజేయు అనుబంధంగా రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై పోరాటాలు చేస్తుందన్నారు. ఖమ్మం జిల్లా మహాసభలు రాజకీయ చైతన్యం కలిగిన గొప్ప గొప్ప నేతలను అందించిన వైరాలో నిర్వహించాలని సంఘం నిర్ణయించిందన్నారు. రాష్ట్ర డిప్యూటీ చీఫ్ మినిస్టర్ సొంత పట్టణమైన వైరాలు జరగబోతున్న మహాసభలు గొప్పగా నిర్వహించాలని ఆయన సంఘ నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొంతమంది జర్నలిస్టుల పేరుతో అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని నిజమైన జర్నలిస్టులను జర్నలిస్టు సంఘాలు గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడం ద్వారా నిర్ధారించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తమ సంఘం బలపరుస్తుందని రామనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామ్ నారాయణ జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు ఇంకా రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులతో కలిసి జిల్లాలోని నియోజకవర్గ ఇన్చార్జిలకు సభ్యత నమోదు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మాటేటి వేణుగోపాల్, ఖాదర్ , ఖమ్మం నగర అధ్యక్షులు మైస పాపారావు, జిల్లా ఉపాధ్యక్షులు మొహిద్దిన్, తాతా శ్రీనివాసరావు, తాళ్లూరి మురళీకృష్ణ జనార్ధన చారి , పి సత్యనారాయణ ఖమ్మం నగర కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

## గ్రూప్ -1లో ఎస్సై సందీప్ కుమార్ ర్యాంక్

విశాలాంధ్ర-ఇల్లందు : ఇల్లందు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సందీప్ కుమార్ ఇటీవలే విడుదల చేసిన గ్రూప్ 1 ఫలితాలలో 502 మార్కులు సాధించారు. మెరుగైన ర్యాంకు తెచ్చుకున్నందుకుగాను ఇల్లందు డిఎస్పి ఎన్. చంద్రభాను, ఇల్లందు సీఐ బత్తుల సత్యనారాయణలు మంగళవారం ఎస్సైను సన్మానించి అభినందనలు తెలిపారు. డిఎస్పి మాట్లాడుతూ పట్టుదల, కృషి, క్రమశిక్షణతో మనిషి తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చని ఎస్సై సందీప్ నిరూపించారన్నారు. ఉన్నత విద్యావంతులైన ఉద్యోగులు ఇది చాలు అనుకోకుండా ఒక లక్ష్యంతో కృషిచేస్తే ఇంకా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని డిఎస్పి తెలిపారు. పోలీసు ఉద్యోగం చేస్తూ కూడా పోటీ పరీక్షలకు ప్రిపేరై గ్రూప్ వన్ లో అత్యధిక మార్కులు సాధించడం చాలా అభినందించ తగిన విషయమని కొనియాడారు.

# పల్లెవాసులకు తాగునీటి కష్టాలు

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : వేసవికాలం మొదలవుతూనే భూగర్భ జిల్లాల శాఖ నిర్లక్ష్యంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి భూగర్భ జిల్లాలు అడుగంటి పోవడానికి అధికారుల చోద్యం అక్రమ తవ్వకాలే కారణం. ఖానాపూర్ నియోజకవర్గంలో అదిలాబాద్ జిల్లా పరిధిలో ఉన్న అల్లం పెల్లి , మండలం మామిగూడ వంటి గ్రామాలు నిర్మల్ జిల్లా పరిధిలో ఉన్న పెంబి మండలం తోయగూడా పోచంపల్లి రాయదారి వంటి మారుమూల గ్రామాలకు మంచినీటి కొరత మంచినీళ్లకు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి వాగుల్లో ఉన్నటువంటి చిల్మెలు ఊటా బావిలు, మోట బావిలో నుంచి తోడుకొని దాహార్తిని తీర్చుకుంటున్న పల్లె వాసులు ఏ పాపం చేశారని ప్రభుత్వ పథకాలు ఎన్ని ప్రవేశపెట్టిన అందడం లేదు. మారుమూల పల్లెలకు అనడానికి ఆనవాళ్లుగా మిగిలిన పల్లెలు భారతదేశం ధనిక దేశాల సరసాన నిలబడుతుంది అనడంలో గొప్పగా చెప్పుకోవడం తప్పులేదు అనే పదం ఎంత నిజమో. అదే మాటగా పల్లె వాసులకు ప్రభుత్వ పథకాలు అందడం లేదు అనేది అంతే నిజం. గత ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రం మొత్తం నాలుగు కోట్ల పైచిలుకు ఉన్న జనాభాకు రాష్ట్రవ్యాప్తంగా భగీరథ అనే పథకాన్ని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశపెట్టి ప్రతి గ్రామానికి సురక్షితమైన తాగునీరు అందించే విధంగా రూ.43,791 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశపెట్టిన పథకంలో కుటుంబాల లెక్కన లెక్క కడితే ప్రతి పేద కుటుంబానికి రూ.10 లక్షలు అందించిన ఎన్నో కోట్లు మిగులు నేమో అని మేధావి వర్గాలు వ్యాఖ్యానించుకుంటున్నాయి. ఆ పది లక్షలతో కుటుంబాలు సురక్షితమైన ఫిల్టర్ వాటర్ తాగుతూ సొంత ఇంటిలో ఆనందంగా గడిపేవారు అని అంటూ మేధావి వర్గాలు వాపోతున్నారు. నాలుగు కోట్ల జనాభాలో భగీరథ పథకానికి నోచుకోని పల్లెలు ఎన్నో. అందులో కన్నులకు కొట్టచినట్టుగా కనబడుతున్న ఖానాపూర్ నియోజకవర్గంలోని మూడు జిల్లాలలో ముడిపడి ఉన్న ఈ నియోజకవర్గ మంచిర్యాల ఆదిలాబాద్ నిర్మల్ మూడు జిల్లాల కలయికతో కలగలిపి ఉన్న నియోజకవర్గంలో గుక్కెడు మంచినీళ్ల కొరకు వేసవికాలం వచ్చిందంటే కిలోమీటర్ల పొడున వెళ్లి వాగుల్లో ఊట బావిలో వ్యవసాయ భూముల్లో ఉన్న మోటాబావిల్లు నుంచి కిలోమీటర్ల నడుచుకుంటూ కాలినడకన వెళ్లి తెచ్చుకొని దార్తి తీర్చుకునే దౌర్భాగ్యపు పరిస్థితుల్లో పట్టుకొమ్మల్లా పిలవబడే పల్లెలు వేలవేల బోతున్నాయి. కోట్లతో ప్రవేశపెట్టిన పథకాలు పల్లెలకు ఎందుకు అందడం లేదు. అది అధికారులకే తెలవాలి అని మేధావి వర్గాలు వాపోతున్నారు.

సంపాదకీయం

# కాషాయ మూకల విధ్వంసం

కరసేవకులు రేపిన కార్చిచ్చు మహారాష్ట్రలోని నాగపూర్‌ను అతలాకుతలం చేస్తోంది. కాషాయ శ్రేణుల నిరసనతో మొదలైన అల్లర్లు మతగ్రంథాన్ని కాల్చివేశారన్న వదంతులతో వికృత రూపందాల్చి రాళ్లదాడి, బాష్పవాయు ప్రయోగం, ఆస్తుల విధ్వంసం, దగ్ధానికి దారితీసింది. ఔరంగజేబ్ సమాధిని తొలగించాలన్న హిందూ సంఘాలు, విశ్వహిందూ పరిషత్ (వీహెచ్ పీ) కార్యకర్తల మంకుపట్టుతో పరిస్థితి అదుపుతప్పింది. నాగపూర్ అతలాకుతలమైనది. ఇటీవల విడుదలైన ఛావా చిత్రమే అల్లర్లకు కారణమని పాలక కాషాయ కూటమి నిస్సిగ్గుగా ప్రకటించడం అత్యంత విచారకరం. ఈ అల్లర్లు ప్రణాళికాబద్ధమైన కుట్రలో భాగమే. చరిత్రను తవ్వి సమాజాన్ని విభజించే ప్రయత్నం అనడంలో ఏ మాత్రం అతిశయోక్తిలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవిస్ స్వస్థలంలో, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి నివాసానికి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకోవడం అత్యంత విచారకరం. మొఘలు చక్రవర్తి ఔరంగజేబ్ సమాధిని తొలగించాలన్న వివాదం మహారాష్ట్రను కొద్ది రోజులుగా కుదిపేస్తున్న విషయం తెలిసిందే. సోమవారం సాయంత్రం నాగపూర్‌లో భజరంగ్ దళ్ కార్యకర్తలు చేపట్టిన ఆందోళనతో మహారాష్ట్ర అల్లర్లతో అట్టుడికిపోతోంది. ఛత్రపతి శంభాజీనగర్ (గతంలో ఔరంగాబాద్)లోని ఖుల్దాబాద్‌లో ఉన్న మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ సమాధి ప్రధాన రాజకీయ, మతపరమైన ఘర్షణ కేంద్రంగా మారింది. ఔరంగజేబ్ సమాధిని తొలగించాలన్న డిమాండ్ ఈ దారుణానికి కారణమైనది. సోమవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో మహల్ ప్రాంతంలోని సెంట్రల్ నాగ్‌పూర్‌లోని చిట్నిస్ పార్క్‌లో హింస చెలరేగింది. ఒక వర్గానికి చెందిన పవిత్ర గ్రంథాన్ని తగలబెట్టారనే వదంతుల నడుమ పోలీసులపై దుండగులు రాళ్లు రువ్వారు. ఓల్డ్ భండారా రోడ్డు సమీపంలోని హన్సపురి ప్రాంతంలో రాత్రి అంతా విడతల వారీగా ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. హింసాత్మక గుంపు అనేక వాహనాలను తగలబెట్టింది. అల్లరి మూకలను చెదరగొట్టేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. లాఠీచార్జ్ చేసి బాష్పవాయువు ప్రయోగించడంతో పరిస్థితి కొంత అదుపులోకి వచ్చింది. నాగపూర్‌లోని అనేక ప్రాంతాలు ఇప్పుడు కర్ఫ్యూ నీడలో ఉన్నాయి. అల్లర్లు జరిగినప్పుడు సాధారణంగా పిలుపునిచ్చే విధంగానే వదంతులు నమ్మొద్దని, శాంతియుతంగా ఉండాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నాగపూర్ ప్రజలను కోరారు. మరోపక్క ఈ వివాదంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'ఛావా' సినిమా చూసి మొఘలు చక్రవర్తి ఔరంగజేబ్‌పై మరాఠా ప్రజలు కోపం పెంచుకున్నారని ఫడ్నవీస్ శాసన సభలో మంగళవారం మాట్లాడుతూ ఆరోపించారు. ఈ హింసాత్మక ఘటనలు, అల్లర్లు పథకం ప్రకారం జరిగినట్లు కనిపిస్తున్నాయని ఎప్పటిలానే చెప్పారు. 'ఛావా' సినిమా ఔరంగజేబ్‌పై ప్రజల ఆగ్రహించేలా రెచ్చగొట్టిందన్న ఫడ్నవిస్ వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమౌతున్నాయి. సినిమా చూసి హింసకు పథకం పన్నడం ఏమిటీ?... మహారాష్ట్రలో బీజేపీ మళ్లీ అధికారంలోకి రాగానే మత ఘర్షణలు చెలరేగుతున్నాయని సామాజిక మాధ్యమాలలో వ్యాఖ్యలు వెల్లువెత్తుతున్నాయి. నాగ్‌పూర్‌లో, మొత్తం మహారాష్ట్రలో విద్వేషాన్ని వ్యాప్తి చేయడానికి బీజేపీ చాలా కాలంగా ప్రయత్నిస్తోందన్న ఆరోపణలు లేకపోలేదు. బీజేపీ ఉన్నంత కాలం దేశంలో శాంతి ఉండదనడంలో ఎటువంటి అనుమానం లేదు. హోలీకి ముందు ఉత్తరప్రదేశ్‌లో శాంతిని దెబ్బతీయడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ప్రజలు కుప్పకూలుతున్న షేర్ మార్కెట్ గురించి, పెరుగుతున్న ధరలు, ద్రవ్యోల్బణం గురించి మాట్లాడకూడదు. శతాబ్ద కాలంలో అత్యధిక స్థాయిలో ఉన్న ఆర్థిక అసమానత, ముందెన్నడూలేని విధంగా ఉన్న నిరుద్యోగం వంటి సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇటువంటి నీచానికి దిగజారడం బీజేపీకి బాగా అలవాటైంది. ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు శంభాజీ మహారాజ్ జీవిత కథ ఆధారంగా ఛావా సినిమా తెరకెక్కించారు. హీరో విక్కీ కౌశల్ శంభాజీ మహారాజ్‌గా నటించగా... అతడి భార్య యేసుబాయి పాత్రలో రష్మిక మందన్నా నటించారు. మొగల్ చక్రవర్తి ఔరంగజేబ్‌గా అక్షయ్ ఖన్నా నటించారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించారు.

ఔరంగజేబ్ సమాధిని తొలగించాలనే డిమాండ్‌ను కాషాయ సంస్థలు లేవనెత్తినప్పుడే ఫడ్నవిస్ ప్రభుత్వం తగువిధంగా స్పందించి వుంటే పరిస్థితి ఇంతగా దిగజారివుండేది కాదు. ఈ సమాధిని అధికారులు తొలగించకపోతే బాబ్రీ మసీదు కూల్చివేత వంటి చర్య తీసుకుంటామని హిందూ సంస్థలు బెదిరిస్తుంటే 'ప్రతి ఒక్కరూ సమాధి తొలగించాలని కోరుకుంటున్నారు' అని అంటూ ఫడ్నవిస్ చూస్తూ కూర్చోవడం క్షమించరాని నేరం. బజరంగ్ దళ్ నాయకుడు నితిన్ మహాజన్ 'ప్రభుత్వం సమాధిని తొలగించకపోతే మేము కరసేవ చేస్తాం. బాబ్రీ నిర్మాణాన్ని తొలగించడానికి అయోధ్యలో ఏమి జరిగిందో మనమందరం చూశాం' అని తీవ్ర హెచ్చరికలు చేసినప్పుడు అయినా ఫడ్నవిస్ ప్రభుత్వం మేల్కొని ఉండాల్సింది. శివాజీ మహారాజ్ కుమారుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్‌ను ఉరి తీయడం సహా హిందువులపై జరిగిన దారుణాలకు కారకుడైన ఔరంగజేబ్ ఒక 'నిరంకుశుడు' అని వాదిస్తూ బజరంగ్ దళ్, వీహెచ్‌పీ వంటి మితవాద సంస్థలు ఔరంగజేబ్ సమాధి కూల్చివేతకు డిమాండ్ చేస్తున్నాయి. 'నేను మరాఠాల మనోభావాలను గౌరవిస్తాను. ఔరంగజేబు శంభాజీ మహారాజ్‌ను హింసించాడు. ఔరంగజేబ్‌ను కీర్తించకూడదు. ఔరంగజేబుకు ఎవరూ మద్దతు ఇవ్వకూడదు. అతను మహారాష్ట్రకు శత్రువు. దేశద్రోహి. ఔరంగజేబ్ అవశేషాలు మనకు అవసరమా అన్న ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వ్యాఖ్యలు కాషాయ మూకలు మరింత రెచ్చిపోవడానికి నిస్సందేహంగా దారి తీశాయి. ఇటీవలి వారాల్లో ముఖ్యమంత్రి, మంత్రులు చేసిన ప్రకటనలు పరిశీలిస్తే ప్రస్తుత పరిస్థితికి వారే కారణమని అర్థమవుతుంది. ప్రభుత్వ పెద్దలు బాధ్యతాయుతంగా వ్యవహరించకుండా రెచ్చగొట్టే చర్యలకు పూనుకోవడం తగదు. ఒక చక్రవర్తి చిత్రాలను తగలబెట్టినా, ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్య తీసుకోకపోవడమే ప్రస్తుత పరిస్థితికి కారణం. ఇది ఒక పార్టీకి సంబంధించిన విషయం కాదు. చరిత్రకు సంబంధించిన అంశం. రాజకీయ నాయకులు ఇందులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదు. నిపుణులు నిర్ణయం తీసుకుంటారు, దాని గురించి చరిత్రకారులు మాట్లాడుతారు. మరో గత్యంతరం లేకపోవడంతో హిందూ సంఘాలు ఈ అంశాన్ని లేవనెత్తుకున్నాయనడంలో ఎటువంటి పొరపాటులేదు. బీజేపీ కూటమి పాలనలో విద్యుత్, నీరు అందక రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. నిరుద్యోగం పెరిగింది. ఈ సమస్యలన్నింటినీ దాచడానికి బీజేపీ హిందువులు, ముస్లింల కొత్త సమస్యలను తెర పైకి తెస్తోంది. కూటమి ఐదు నెలల పాలనలో పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ప్రజలలో ప్రభుత్వంపై ఆగ్రహం పెరుగుతోంది. ఆ ఆగ్రహం నుంచి తప్పించుకునేందుకు ఇలాంటి గిమ్మిక్కులతో ప్రజల దృష్టి మళ్లించేందుకు కాషాయ కూటమి ఇటువంటి దుష్టపన్నాగాలు పన్నుతోంది. ప్రభుత్వానికి చిత్తశుద్ధివుంటే ఇటువంటి నీచమైన ఎత్తుగడులు మాని ప్రజల నిజమైన సమస్యలపై చర్చించాలి. రాష్ట్ర ఆర్థిక వినాశనం, పెరిగిన రుణ భారం, పెరుగుతున్న నిరుద్యోగం, రైతు ఆత్మహత్యలపై ప్రజల దృష్టి మళ్లించడానికే హింసను ప్రేరేపించడం, రాష్టంలో అస్థిరతను సృష్టించడం, గత చరిత్రతో పౌరులను గందరగోళపరచడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. మతతత్వ శక్తులు డిమాండ్ చేశాయని సమాధిని దెబ్బతీయడం లేదా విచ్ఛిన్నం చేయడం సరి కాదు. అటువంటి చర్య పరస్పర సోదరభావం, శాంతి, సామరస్యాన్ని చెడగొడుతుందనడంలో ఎటువంటి అనుమానంలేదు. ఇటువంటి హింస హిందువులు, ముస్లింల దైనందిన జీవితాన్ని దెబ్బతీస్తుంది. అయితే, దాని నుంచి రాజకీయ ప్రయోజనాలను పొందాలని ప్రభుత్వం కోరుకోవడం తగనిపని. 21వ శతాబ్దపు భారతదేశంలో 17వ, 18వ శతాబ్దాల చరిత్రపై ప్రజలు ఆందోళన చేయడం అత్యంత విచారకరం.

# ట్రంప్ దూకుడు ఫలించేనా...!

పతకమూరు దామోదర్ ప్రసాద్

డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడుగా రెండో సారి ఎన్నికైన నాటి నుండీ దూకుడుగా వ్యవహరిస్తూ వాణిజ్య భాగస్వామ్య దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులు, పరికరాలపై భారీగా సుంకాలు విధిస్తూ బీభత్సం సృష్టిస్తున్నారు. అదే సమయంలో చైనా, యూరప్ దేశాలు అమెరికాపైన కూడా సుంకాలు విధించాయి. అమెరికాను మళ్లీ గొప్పదేశంగా, ప్రబల ఆర్థిక శక్తిగా రూపొందిస్తామని ట్రంప్ చెప్పడం శ్వేత జాతీయులకు, ఎలాన్ మస్క్ వంటి ఆయన మద్దతుదారులకు శ్రవణ పేయంగా ఉన్నా సుంకాలపోరు వాణిజ్య యుద్ధాలకు దారితీస్తున్నది. ఇప్పటికే ట్రిలియన్ డాలర్ల ద్రవ్యలోటులో ఉన్న అమెరికా పారిశ్రామిక రంగం కూడా సమస్యలతో సతమతమవుతున్నది. సుంకాలయుద్ధం, ప్రభుత్వ ఉద్యోగులను యథేచ్ఛగా తొలగించడం వల్ల అమెరికాలో ఆర్థిక అనిశ్చితి నెలకొంది. ట్రంప్ సుంకాలపై చేస్తున్న ప్రకటనల వల్ల అమెరికా స్టాక్ మార్కెట్లకు 4 లక్షల కోట్ల డాలర్ల నష్టం వాటిల్లింది. ఇది భారత వార్షిక బడ్జెట్ రూ50.65 లక్షల కోట్ల కంటే ఏడు రెట్లు అధికం. అమెరికాలో ఆదాయపు పన్ను శాఖను అంతర్గత రెవెన్యూ శాఖగా వ్యవహరిస్తారు. ఎగుమతులు చేస్తున్న అన్ని దేశాలకు అమెరికా అతిపెద్ద వినియోగదారుల మార్కెట్‌గా వుంది. ఇలా ఎగుమతులు చేస్తున్న దేశాలు అమెరికా నుంచి వచ్చే వస్తువులపై భారీగా దిగుమతి సుంకాలు విధిస్తూ ఆదాయం పొందుతూ లాభపడుతూ సొంత పరిశ్రమలను కాపాడుకుంటూ అమెరికాకు ఆర్థిక నష్టం కలిగిస్తున్నాయని, అమెరికా ఎగుమతిదార్ల ప్రయోజనాలను దెబ్బ తీస్తున్నాయని ట్రంప్ ధ్వజమెత్తుతున్నారు. వివిధ దేశాల నుంచి వచ్చే వివిధ రకాల వస్తువులపై వేర్వేరు సుంకాలు విధించడం ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధమే అయినా ట్రంప్ ఖాతరు చేయడం లేదు.

దిగుమతి సుంకాలు పెంచడం వల్ల వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణం పెరిగినా ట్రంప్ పట్టించుకోవడం లేదు. భారత్ వంటి అభివృద్ధి చెందు తున్న దేశాలు సంపన్న దేశాల ఉత్పత్తులపై అధిక దిగుమతి సుంకాలు విధించడం ద్వారా తమ సొంత పరిశ్రమలను రక్షించుకునే వెసులుబాటు ఉండేది. ఆదిలో ధనికదేశాలు వీటిని అంతగా పట్టించుకోలేదు. వర్ధమాన దేశాలలో విద్యుత్ చార్జీలు అధికంగా ఉండటం, మౌలిక వసతుల కల్పనకు ఎక్కువ ఖర్చు చేయాల్సి రావడం, రుణసౌకర్యాలలేమి, వడ్డీ రేట్లు అధికంగా ఉండటం, కార్మికుల ఉత్పాదక సామర్థ్యం తక్కువగా ఉండటం వల్ల వస్తూత్పత్తి వ్యయం ఎక్కువగా ఉండి సంపన్న దేశాలతో పోటీ పడలేవు. అందుకే గతంలో గాట్, ప్రపంచవాణిజ్య సంస్థ చర్చల్లో బడుగు దేశాలకు అధిక దిగుమతి సుంకాలు విధించుకునే వెసులుబాటు కల్పించాయి. యాంత్రికీకరణ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం వల్ల సంపన్న దేశాల వస్తూత్పత్తి వ్యయం తక్కువ గనుక ధనిక దేశాలతో పేదదేశాలు పోటీపడలేకున్నాయి. వ్యవసాయేతర వస్తువులపై దిగుమతి సుంకాలు భారీగా తగ్గించాలని, లేదంటే ఆయా దేశాలపై అధికంగా సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరిస్తున్నారు. ద్వైపాక్షిక వాణిజ్యంలో భారత్‌కే మిగులు ఉన్నందున మన దేశం అమెరికాకు అవసరమైన మరిన్ని వస్తువులను ఎగుమతి చేయడం ద్వారా ఆలోటును భర్తీ చేయవలసి వుంది. ఎగుమతులు పెరగాలంటే అమెరికా సుంకాలు సముచితంగా ఉండాలి. భారత్ దిగుమతి సుంకాలు ఎక్కువగా విధిస్తున్నందున దానికి దీటుగా సుంకాలు పెంచుతామని ట్రంప్ హెచ్చరిస్తున్నారు. అందువల్ల ఇప్పుడు ఎగుమతి దిగుమతులలో ఉభయ తారకమైన రీతిలో సంస్కరణలు చేపట్టి ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చేసుకోవలసిన అవసరం ఏర్పడింది. 2015 నుంచి నాలుగైదు శాతం, వ్యవసాయేతర ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు 15శాతం పెరిగాయి. భారత్, యూరోపియన్ యూనియన్, కెనడా, మెక్సికో అమెరికా అతి పెద్దవాణిజ్య భాగస్వాములు. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో 5.6శాతం వాణిజ్యం పెరిగింది. ఏప్రిల్ - డిసెంబర్లో 45బిలియన్ల వాణిజ్యం జరిగింది. భారత్ కు 60బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులుంది. సమాచార సాంకేతిక విజ్ఞానం, ఐటి సేవల ఎగుమతులు పెరిగాయి. భారత్ 17శాతం దిగుమతి సుంకాలు విధిస్తుండగా, అమెరికా విధిస్తు న్నది 3.3శాతం. 60 బిలియన్ డాలర్ల వాణిజ్యంలో అమెరికా తదితర దేశాలకు 30బిలియన్ స్మార్ట్ ఫోన్‌లే ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. అమెరికా గనుక భారత ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు పెంచితే మందులు, ఔషధాలు, ఎలక్ట్రానిక్, ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తుల ధరలు పెరిగి పోటీకి నిలవలేక పోవడం, దేశీయంగా ఉత్పత్తి తగ్గించవల సిరావడం, లేఆఫ్‌లు, పాక్షిక నిరుద్యోగానికి దారితీయవచ్చు. సానబట్టిన వజ్రాలు, శుద్ధి చేసిన చమురు ఉత్పత్తులు, వాటిలో వాడేందుకు దిగుమతులు ఎక్కువ గనుక పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చు. అమెరికా నుంచి మరింత ముడిచమురు కొనుగోలుపై చర్చలు జరుగుతున్నాయి. ఖరీదైన హార్లీ డేవిడ్సన్ మోటార్ సైకిళ్లు, బోర్బన్ విస్కీ దిగుమతులపై ప్రధాని మోదీ పర్యటనకు ముందే మన దేశం సుంకాలు తగ్గించి అమెరికాను ప్రసన్నం చేసుకుంది. అమెరికాకు భారత్ సాఫ్ట్‌వేర్ ఎగుమ తులు ఎక్కువ గనుక వాటిపై దిగుమతి సుంకాలు పెంచితే భారత్‌కు నష్టం. అమెరికా పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలైన ఈవై, ఆక్సెంచర్, ఐబీఎం, గూగుల్, మైక్రోసాఫ్ట్, జెన్ ప్యాక్ట్ తదితర కంపెనీలలో వేలాదిమంది భారతీయులు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పుణె నగరాల్లో, అమెరికాలోని వివిధ నగరాలలో పనిచేస్తున్నారు. భారత్ ఐటి ఇంజినీర్ల సామర్థ్యంపై అమెరికా కంపెనీలకు కొండంత నమ్మకముంది. న్యూయార్క్, న్యూజెర్సీ, టెక్సాస్, వర్జీనియా సహా వివిధ రాష్ట్రాలు, నగరాలలో వేలాది మంది భారతీయులు పనిచేస్తూ అమెరికా ఆర్థిక వ్యవస్థ మెరుగు దలకు ఎంతో దోహద పడుతున్నారు. ట్రంప్‌నకు అత్యంత సన్నిహితుడు, సూపర్ అధ్యక్షుడిగా పేరొందిన అమెరికా పారిశ్రామిక దిగ్గజం ఎలాన్ మస్క్ భారత్‌లో వాణిజ్య విస్తరణకు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రపంచంలో ఎక్కువ వస్తువులను దిగుమతి చేసుకునే దేశాలలో 3.3 ట్రిలియన్లతో అమెరికా అగ్రస్థానంలో ఉంది. చైనా 2.6 ట్రిలియన్లు, జర్మనీ 1.5 ట్రిలియన్ల వస్తువులు దిగుమతి చేసుకుంటున్నాయి. నెద ర్లాండ్స్, బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్, భారత్, హాంకాంగ్, దక్షిణ కొరియాలది ఆ తర్వాత స్థానం. వాటికి కస్టమ్స్ సుంకాలను పెంచే శక్తి వుంది.

– సీనియర్ జర్నలిస్టు, 9440990381

# కోకో దిగుమతి... దేశీయ రైతుల కష్టాలు

పి.జమలయ్య

ఈ ఏడాది అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు దక్కని విధంగానే కోకో పంట కూడా ధరలు పడిపోయి కోకో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి పడిపోయారు. అవసరాల మేరకు దిగుమతి కాకుండా చౌకగా కోకో గింజలు వస్తున్నాయని ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకొని స్థానిక రైతులకు నష్టం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోంది. రాష్ట్ర కూటమి ప్రభుత్వం చూస్తూ ఉంది తప్ప జోక్యం చేసుకున్న పరిస్థితి లేదు. అందువల్ల కోకో రైతులకు మంచి ధర లేక ఆయిన కాడికి మధ్య దళారులకు అమ్ముకొని నష్టపోతున్నారు. ఇచ్చింది తీసుకో లేకపోతే లేదని దళారులు రైతులను బెదిరించే పరిస్థితికి వచ్చిందంటే రాష్ట్ర ప్రభుత్వం కుంభకర్ణుడిలాగా నిద్రపోతున్నదని తెలుస్తున్నది. పైగా ఇటీవల కాలంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అసెంబ్లీలో మాట్లాడుతూ అన్ని పంటలకు మంచి ధరలు వస్తున్నాయని, మా ప్రభుత్వం కృషి ఫలితంగానే రైతులు ఆనందంగా ఉన్నారని చెప్పటం హాస్యాస్పదంగా ఉంది. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో గమనించకుండా మాటలు చెప్పడం అచ్చెన్నాయుడుకు వెన్నతో పెట్టిన విద్య.

కోకోపంటను మన రాష్ట్రంలో ఏలూరు, శ్రీకాకుళం, కాకినాడ,కృష్ణా, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, పార్వతీపురం మన్యం తదితర జిల్లాల్లో సుమారు 75 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఏటా 12 వేల టన్నులు దిగుబడి వస్తుంది. ప్రధానంగా ఉభయ గోదావరి జిల్లాల్లోని కొబ్బరి తోటల్లోనూ, ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటగా సాగు చేస్తున్నారు. కోకో గింజలను చాక్లెట్, కేక్ తయారీలో కీలకంగా ఉపయోగిస్తారు. కోకో సాగులో దేశంలోనే మన రాష్ట్రం తొలి స్థానంలో ఉన్నప్పటికీ రైతులకు గిట్టుబాటు ధర కోసం దిక్కులు చూడటం తప్పడం లేదు.

కోకో సాధారణంగా సంవత్సరానికి రెండు ప్రధాన పంటలను ఇస్తుంది. నవంబర్ నుంచి జూన్, జూలై నుంచి అక్టోబర్ నెలలో వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో కోకో విత్తనాలు ధర కిలో రూ. 900 నుంచి 550కి పడిపోయింది. కిలోకు 4 వందలు కోల్పోతున్నారు. కౌలురైతులు మరింత నష్టపోతున్నారు. కోకో పంటల సాగులో కౌలురైతులు గణనీయంగా ఉన్నారు. ఆయిల్ పామ్ తోటలలో సాగు చేసే కోకో పంటకు ఎకరానికి కౌలు రూ. 25 వేలు, కొబ్బరి తోటలో కోకో సాగుకు రూ. 30 వేలు కౌలు చెల్లించి సాగిస్తున్నారు. ఆయిల్ పామ్ తోటలో కోకో పంట దిగుబడి రెండు క్వింటాలు లోపు, కొబ్బరితోటలో సాగు చేసే కోకో పంట నాలుగు నుంచి ఐదు క్వింటాలు లోపు మాత్రమే దిగుబడి వస్తుంది. కౌలు కాక ప్రతి ఎకరానికి పెట్టుబడి రూ. 25 నుంచి 30 వేలు దాకా అవుతుంది. గత సంవత్సరం కోకో గింజలకు మంచి రేటు ఉందని ఎకరానికి 50వేల నుంచి లక్ష రూపాయలు వరకు కౌలు చెల్లించి ఈ సంవత్సరం సాగు చేసిన కౌలురైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. ప్రతి ఏడాది ఖర్చులు పెరగడంతో కనీసం పండిన పంటకు గిట్టుబాటు ధర కాదు కదా ఖర్చులు కూడా రావటం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

కిలో కోకో గింజలకు రూ. 550 నుండి 600లోపు మాత్రమే ప్రస్తుతం ధర దక్కుతున్నది. కంపెనీల గుత్తాధిపత్యం కారణంగా అంతర్జాతీయ మార్కెట్ ధరల మాయజాలంలో రైతులు చిత్తవుతున్నారు. దేశీయంగా 1.10 లక్షలు టన్నులు కోకో గింజలు అవసరం ఉండగా మన దేశంలో ఉత్పత్తి అవుతున్నది కేవలం 35వేల టన్నులు (32 శాతం) మాత్రమే. 68 శాతం దిగుమతి చేసుకుంటున్నాము. మనదేశంలో ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటకలో కోకో సాగు అధికంగా ఉంది. దేశ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ వాటా 35శాతం వరకు ఉంటుంది. కోకో ఉత్పత్తిలో ఐవర్ కోస్ట్, ఘనా, ఇండోనేషియా, రూమెరూన్, డొమిన్ రిపబ్లిక్ అగ్రస్థానంలో ఉన్నాయి. గతేడాదిలో రూ. 950ల నుంచి 1200ల వరకు ధర లభించగా క్రమంగా దళారులు సిండికేట్‌గా మారి రైతుల కష్టార్జితాన్ని కాజేస్తున్నారని తెలుస్తోంది. దేశీయంగా చాక్లెట్ వినియోగం పెరిగింది. డార్క్ చాక్లెట్ డిమాండ్ అధికమైంది. రైతులకు ఇచ్చే ధర మాత్రం పెరగటం లేదు. నాణ్యత లేదని వ్యాపారస్తులు తక్కువ ధరలకు కొనుగోలు చేసి అధిక లాభాలు గడిస్తున్నారు. కోకోలో ప్రధానమైన నాణ్యత సమస్య పులియబెట్టడం, ఎండబెట్టడంలో ఉంది. ఎండబెట్టడంలో తేడా ఉంటే గింజలు నల్లగా మారుతాయి. చాక్లెట్ పొడికి సంబంధించిన మంచి వాసన,రుచి సరిగ్గా రాదు. పరిశుభ్రమైన వాతావరణంలో ఎండబెట్టకపోతే మార్కెట్ లో అమ్ముకోవడం కష్టంగా ఉంటుంది. నాణ్యత ప్రమాణాలు పాటిస్తే వెంటనే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండదు. నిలువ చేసుకొని ఆ తర్వాత మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చు. నిలవ ఉంచుకోవటానికి తగిన నాణ్యత ప్రమాణాలతో కూడిన వసతులు కూడా అవసరం ఉంటుంది. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రభుత్వం ఎప్పటికప్పుడే అంతర్జాతీయ మార్కెట్ ధరలను రైతులకు తెలియపరచాలి. కౌలుసాగు ఖర్చులను దృష్టిలో పెట్టుకొని మద్దతు ధర ప్రకటించి ఆ ధరల ప్రకారమే వ్యాపారస్తులు కొనుగోలు చేసే విధంగా చట్టబద్ధత కల్పించాలి. తక్షణమే కేజీ కోకో గింజలకు రూ. 900 ధర నిర్ణయించి కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలి. వ్యాపారస్తులు ముందుకు రాకపోతే రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సేకరించాలి. సిండికేట్‌గా ఏర్పడి రైతులను నష్టపరుస్తూ కోకో గింజలు కొనుగోలు చేసే కంపెనీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని కోకో గింజల విదేశీ దిగుమతులు నిలుపుదల చేసి స్వదేశీ రైతులవద్దనున్న గింజలను వెంటనే కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. కోకో గింజలు కొనుగోలు చేసే కంపెనీల ప్రతినిధులతోనూ, రైతు ప్రతినిధులతోను, సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలి. అంతే గాకుండా స్థానిక మార్కెట్ అవకాశాలను పెంచడానికి కృషి చేయాలి. కోకో

> కోకో సాధారణంగా సంవత్సరానికి రెండు ప్రధాన పంటలను ఇస్తుంది. నవంబర్ నుంచి జూన్, జూలై నుంచి అక్టోబర్ నెలలో వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో కోకో విత్తనాలు ధర కిలో రూ. 900 నుంచి 550కి పడిపోయింది. కిలోకు 4 వందలు కోల్పోతున్నారు. కౌలురైతులు మరింత నష్టపోతున్నారు. కోకో పంటల సాగులో కౌలురైతులు గణనీయంగా ఉన్నారు. ఆయిల్ పామ్ తోటలలో సాగు చేసే కోకో పంటకు ఎకరానికి కౌలు రూ. 25 వేలు, కొబ్బరి తోటలో కోకో సాగుకు రూ. 30 వేలు కౌలు చెల్లించి సాగిస్తున్నారు. ఆయిల్ పామ్ తోటలో కోకో పంట దిగుబడి రెండు క్వింటాలు లోపు, కొబ్బరితోటలో సాగు చేసే కోకో పంట నాలుగు నుంచి ఐదు క్వింటాలు లోపు మాత్రమే దిగుబడి వస్తుంది. కౌలు కాక ప్రతి ఎకరానికి పెట్టుబడి రూ. 25 నుంచి 30 వేలు దాకా అవుతుంది.

ఉత్పత్తుల పరిశ్రమల్ని ఏర్పాటు చేస్తే ఇటు రైతుల ఆదాయం పెరగడానికి ఆటు నిరుద్యోగ సమస్యకి పరిష్కారం దొరుకుతుంది.గ్రామీణ ప్రాంతాల్లోనే ఉపాధి పెంచేందుకు ఇంట్లోనే చాక్లెట్ తయారు దిశగా పొదుపు సంఘాలను, మహిళా సంఘాలను ప్రోత్సహించే మహిళలకు శిక్షణ ఇవ్వడానికి చర్యలు చేపట్టి జీవనోపాధులు కల్పించవచ్చు. కోకో గింజల పులియబెట్టడం, ఎండబెట్టడంపై రైతులకు శిక్షణ ఇచ్చి నాణ్యతను పెంచడానికి కృషి చేయాలి. విలువ ఆధారిత ఉత్పత్తులను తయారుచేయడానికి కావలసిన చిన్న పరిశ్రమలను ప్రోత్సహించాలి. గింజల నుంచి పొడిచేసి అమ్ముకునేలా అవకాశాలు పరిశీలించాలి.ఉద్యానవన శాఖ బాధ్యత తీసుకొని కోకో రైతులను ఆదుకోవడానికి నిర్దిష్టమైన ప్రణాళికలను ఏర్పాటు చేసి అమలకు కృషి చేయాలి. కోకో పంటను ప్రోత్సహించడానికి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి అవసరమైన కో కో బోర్డుని ఏర్పాటు చేయాల్సిన ప్రాధాన్యత గురించి పరిశీలించాలి.

ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ప్రధాన కార్యదర్శి,

# తొలి కమ్యూనిస్టు ప్రభుత్వం

ఆర్వీ రామారావ్

ప్రపంచవ్యాప్తంగా చూసినా మొదటి సారి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఖ్యాతి భారత కమ్యూనిస్టు పార్టీదే. 1957లో జరిగిన కేరళ శాసనసభ ఎన్నికలలో మొత్తం 126 స్థానాలలో కమ్యూనిస్టు పార్టీ 60 సీట్లు సంపాదించింది. కేరళలో 1939లో కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుల్లో ప్రధాన పాత్రధారి ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ ముఖ్యమంత్రి అయ్యారు. అంతకు ముందు సాన్ మరినోలో 1942-1947 మధ్య ఎన్నికల ద్వారా కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చిన ఉదంతం ఉంది. అయితే నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని పూర్తి కాలం అధికారంలో ఉండనివ్వలేదు. అప్పుడు కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న ఇందిరా గాంధీ, కాంగ్రెస్‌లోని మితవాద వర్గం ఒత్తిడివల్ల కేంద్ర ప్రభుత్వం నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని గద్దె దించింది.




అప్పటి ప్రధానమంత్రి పండిత్ నెహ్రూకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని తొలగించడం ఇష్టం లేదు. కానీ చివరకు ఒత్తిడికి లొంగిపోక తప్పలేదు. రాజ్యాంగంలోని 356వ అధికరణం కింద ఉన్న వెసులుబాటును వినియోగించి నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని తొలగించారు. అసలు నంబూద్రిపాద్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచే అమెరికాలో ఆందోళన వ్యక్తం అయింది. కేరళ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయడంలో అమెరికా గూఢచార సంస్థ సీఐఏ పాత్ర కూడా ఉందంటారు.

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌తో పాటే 1956 నవంబర్ 1న కేరళ రాష్ట్రం ఏర్పడింది. అంతవరకు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉన్న ట్రావంకోర్-కొచ్చిన్, మలబార్ ప్రాంతాలు కలిపి కేరళ రాష్ట్రం ఏర్పాటైంది. రాష్ట్రం ఏర్పడిన తరవాత జరిగిన తొలి ఎన్నికలలోనే 1957లో కమ్యూనిస్టులు అతి పెద్ద పార్టీగా అవతరించారు. 126 స్థానాలలో సీపీఐకి 60 స్థానాలు దక్కాయి. అయిదుగురు ఇండిపెండెంట్ల మద్దతుతో నంబూద్రిపాద్ ప్రభుత్వం ఏర్పడింది.

ప్రజాస్వామ్య పద్ధతిలో కమ్యూనిస్టులు కేరళలో అధికారంలోకి రావడాన్ని సామాజిక-రాజకీయ అద్భుతంగా పరిగణించారు. కేరళలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడక ముందు నుంచే ఆ రాష్ట్ర ప్రజలకు మార్క్సిస్టు సిద్ధాంతంతో పరిచయం ఉంది. ఆ రోజుల్లో కేరళ ప్రజలు గాంధీ సిద్ధాంతం వేపు కన్నా కమ్యూనిస్టు సిద్ధాంతం వేపే మొగ్గారు. అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హోవర్ కేరళ ప్రభుత్వాన్ని పడదోయడానికి ఇందిరా గాంధీకి సహకరించారు. అమెరికా గూఢచార సంస్థ సీఐఎ కేరళలో కమ్యూనిస్టు వ్యతిరేక ఉద్యమానికి సకలవిధ సహాయం అందజేసింది. కేరళ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ఇందిరా గాంధీ చేసిన ప్రయత్నాలకు అమెరికా వారి మద్దతు ఉందని 1956 నుంచి 1961 దాకా మన దేశంలో అమెరికా రాయబారిగా ఉన్న ఎల్స్వర్త్ బంకర్ చెప్పారు. కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూల్చడానికి సీఐఎ ఇందిరా గాంధీకి ధన సహాయం చేసిందని 1973 నుంచి 1975వరకు అమెరికా రాయబారిగా ఉన్న డేనియల్ పాట్రిక్ మ్యొయినిహన్ అంగీకరించారు. ఈ అంశంపై 1979లో పార్లమెంటులో రభస జరిగినప్పుడు ఇందిరా గాంధీ ఈ ఆరోపణలను ఖండించారు.



నంబూద్రిపాద్

కేరళ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయడం నెహ్రూ రాజకీయ జీవితంలో మాయని మచ్చ. ఈ వ్యవహారం ఇందిరాగాంధీ రాజకీయ జీవితంలో పెద్ద మలుపు. ఆ దశలోనే ఇందిరాగాంధీకి ఉన్న నిరంకుశ ధోరణికి ప్రతీక. ఇందిరా గాంధీ భర్త ఫెరోజ్ గాంధీ కేరళ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయడాన్ని ఫాసిస్టు చర్య అని విమర్శించారు. ఆయన ఈ విమర్శ నెహ్రూ ఎదుటే చేశారు. ఈ విషయంపై ఇందిరా గాంధీకి, ఫెరోజ్ గాంధీకి మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. ఇందిరా గాంధీ కాంగ్రెస్ అధ్యక్షురాలు అయినప్పటి నుంచే ఫెరోజ్ విమర్శలు పెరిగిపోయాయి. నంబూద్రిపాద్ అధికారంలో ఉన్న సమయంలో కుల మత వర్గాలు కుమ్మక్కై అల్లకల్లోల పరిస్థితులు సృష్టించాయి. ఇందిరా గాంధీ ఒత్తిడికి లొంగకూడదనుకున్న నెహ్రూ స్వయంగా కేరళ వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. అక్కడి స్థితి ఇందిరాగాంధీ చెప్తున్న దానికన్నా హీనంగా ఉందన్న నిర్ధారణకు వచ్చారట. అప్రజాస్వామిక విధానాలను వ్యతిరేకించే తత్వం ఉన్న నెహ్రూ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయడానికి వెనుకాడారు. అందుకని నంబూద్రిపాద్‌ను రాజీనామా చేయమని కోరారు. మరో సందర్భంలో కూడా ఈ ప్రతిపాదనే చేశారు. కానీ నంబూద్రిపాద్ తలొగ్గలేదు. 356వ అధికరణం ఆధారంగా నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయడానికి నెహ్రూకు ఇష్టం లేకపోయినా చివరకు ఒత్తిడికి లొంగవలసి వచ్చింది. ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయడానికి ముందు కేరళలో కాంగ్రెస్ చాలా హీనమైన పాత్ర నిర్వర్తించింది. కులోన్మాద, మతోన్మాద శక్తులతో ఏకమైంది. ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయడమే ఇందిరా గాంధీ పట్టుదల కనక అప్పుడు కేరళ గవర్నరుగా ఉన్న బూర్గుల రామకృష్ణారావు దానికి అనుకూలమైన నివేదికే సిద్ధం చేసి ఉంచారు. కానీ ఆ రోజుల్లో తిరువనంతపురం నుంచి దిల్లీకి నేరుగా విమానాలు లేవు. మద్రాసు ద్వారా వెళ్లాల్సిందే. అంటే ఒక రోజు జాప్యం తప్పదు. అప్పుడు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఎలాగైనా నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలనుకుంది కనక గవర్నర్ నివేదికను ఫోన్‌లో చదివి వినిపించమని ఆదేశించిందని అంటారు. 1959 జులై 31న ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించారు.

అధికారం చేపట్టిన తరవాత నంబూద్రిపాద్ ఎన్నికల ప్రణాళికలో చేసిన వాగ్దానాలను నెరవేర్చడం ప్రారంభించారు. వేలాది చౌక దుకాణాలు ఏర్పాటు చేశారు. ఆహార పదార్థాల వ్యవస్థను చక్కదిద్దారు. వ్యవసాయ సంబంధ బిల్లు తీసుకొచ్చారు. మిగులు భూమి పంపిణీ చేశారు. భూ పరిమితి చట్టం తెచ్చారు. వ్యవసాయ కూలీల వేతనాలు పెంచారు. నంబూద్రిపాద్ ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలు కేంద్రంలో నెహ్రూ ప్రభుత్వం అమలు చేసే విధానాలకు భిన్నమైనవి కాదు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కొన్ని రాష్ట్రాలలో కూడా ఇవే విధానాలు అమలయ్యేవి. కానీ కమ్యూనిస్టు ప్రభుత్వం అవే విధానాలను అమలు చేయడం కంటగింపు అయింది. విద్యా సంస్కరణ బిల్లు ప్రవేశ పెట్టడంతో కేరళ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగింది. ఈ బిల్లు ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయుల పరిస్థితి మెరుగుపరచి వారి వేతనాలు పెంచాలనుకున్నారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాల ఆటలు కట్టడి చేయాలన్న ఉద్దేశంతో ఈ బిల్లు సిద్ధం చేశారు.

అప్పట్లో కేరళలో ప్రైవేటు విద్య పెద్ద వ్యాపారం. కుల, మత ఆధారిత సంస్థలు విద్యాలయాలు నిర్వహించేవి. నాయర్ సేవా సంఘ, చర్చి, శ్రీ నారాయణ ధర్మ పరిపాలనా యోగం లాంటివి పాఠశాలలు నిర్వహించేవి. ఈ సంస్థ అధీనంలో విస్తారమైన భూములు కూడా ఉండేవి. నంబూద్రిపాద్ ప్రభుత్వం పాఠ్య ప్రణాళికను సంస్కరించడానికి ప్రయత్నించడం కూడా విద్యా వ్యాపారం చేసే వారికి మింగుడు పడలేదు. విద్యా సంస్కరణలకు వ్యతిరేక ఉద్యమానికి క్రైస్తవ సంఘాలు నాయకత్వం వహించాయి. తరవాత ముస్లిం లీగ్ కూడా అదే పని చేసింది. అంటే హిందూ సంస్థలు, క్రైస్తవ సంఘాలు, ముస్లిం వర్గాలు కలిసికట్టుగా విద్యా సంస్కరణలను తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ ఉద్యమం ఊపందుకున్న తరవాత కాంగ్రెస్ అందులో మిలాఖత్ అయిపోయింది. రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి ఆజ్యం పోసింది. సర్వత్రా నిరసనలు కొనసాగాయి. పోలీసులు కాల్పుల్లో 28 మంది మరణించారు. కేరళ విద్యా బిల్లు వ్యవహారం సుప్రీంకోర్టుకు ఎక్కింది. అయితే సుప్రీంకోర్టు ఈ పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఇది నంబూద్రిపాద్ ప్రభుత్వ విజయమే. కానీ ప్రభుత్వం కొనసాగడానికి అవకాశం దక్కలేదు.

## బోర్డులపై తమిళ పేర్లు ఉండాల్సిందే పుదుచ్చేరి సీఎం

**పుదుచ్చేరి:** తమిళనాడులో అధికార డీఎంకే పార్టీ, కేంద్రం మధ్య కొంతకాలంగా హిందీ భాష విషయంలో వివాదం కొనసాగుతున్న వేళ పుదుచ్చేరి ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. తమిళం మాట్లాడే ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఉన్న కేంద్రపాలిత రాష్ట్రంలో దుకాణాలు, వ్యాపార సముదాయాల సైన్‌బోర్డులపై పేర్లు తమిళంలో ఉండాల్సిందేనని ముఖ్యమంత్రి రంగస్వామి అన్నారు. ఈ మేరకు సూచనలు చేస్తూ సర్క్యులర్ జారీ చేస్తామని చెప్పారు. పుదుచ్చేరిలో తమిళం, తెలుగు, మలయాళం, ఇంగ్లిష్, ఫ్రెంచ్ అధికారిక భాషలు. అయితే ఇక్కడ తమిళభాష మాట్లాడేవారి సంఖ్యే ఎక్కువగా ఉన్న విషయం విదితమే.

## నాలుగు నిషేధిత సంస్థల నేతల అరెస్ట్

**ఇంఫాల్:** మణిపూర్‌లో గడిచిన 24 గంటల్లో నిషేధిత సంస్థలకు చెందిన నలుగురు ఉన్నతస్థాయి నాయకులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. ఇంఫాల్ వెస్ట్, బిష్ణుపూర్ జిల్లాల నుండి వారిని అదుపులోకి తీసుకున్నామని అన్నారు. ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని లాంగోల్ గేమ్ విలేజ్ జోన్ 11 నుండి నిషేధిత పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన లౌరెంబమ్ బ్రోజెన్ సింగ్ (50)ని అరెస్ట్ చేసినట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అదే జిల్లా నుండి నిషేధిత ప్రేపాక్ /ఉప్క్ సభ్యుడు రోమియో సింగ్, కాంగ్లీపాక్ కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడు లైష్రామ్ టోంబాలను అరెస్ట్ చేశామని అన్నారు. బిష్ణుపూర్ జిల్లా నుండి పీడబ్ల్యూజీకి చెందిన మరో నాయకుడు ఖుంద్రక్‌పామ్ మైఖేల్‌ను అరెస్ట్ చేశామని అన్నారు. వారి నుంచి 9 ఎంఎం పిస్టల్, ఖాళీ మేగజైన్, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## అహ్మదాబాద్‌లో 100 కిలోల బంగారం పట్టివేత

**అహ్మదాబాద్:** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో భారీగా బంగారం పట్టుబడింది. ఏటీఎస్ పోలీసులు, డీఆర్‌ఐ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో అహ్మదాబాద్‌లోని పాల్డి ప్రాంతంలో గల ఓ ఇంట్లో దాదాపు 100 కిలోలకుపైగా బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బంగారం అక్రమ రవాణాపై నిఘా పెట్టిన పోలీసులు... పక్కా సమాచారంతో దాడులు నిర్వహించారు. స్మగ్లింగ్ చేసిన పసిడిని పాల్డి ప్రాంతంలో గల అవిష్కార్ అపార్ట్‌మెంట్‌లో దాచిపెట్టినట్లు గుర్తించారు. ఈ మేరకు దాడులు చేసి 107 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అందులో 88 కేజీల బంగారు కడ్డీలు, 19.66 కిలలో ఆభరణాలు ఉన్నాయి. పట్టుబడిన ఈ బంగారం విలువ మార్కెట్లో రూ.100 కోట్లకుపైమాటేనని అధికారుల అంచనా. బంగారంతోపాటు రూ.2 కోట్ల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వేల మంది ఏడుస్తున్నారు

### గృహ యజమానుల సమస్యలపై సుప్రీం కోర్టు

### సీబీఐ దర్యాప్తునకు హామీ

**న్యూదిల్లీ :** బ్యాంకులు, బిల్డర్ల మధ్య ఉన్న సంబంధం గురించి సుప్రీం కోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇంటి యజమానుల ఫిర్యాదులపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారణ నిర్వహిస్తామని హామీ ఇచ్చింది. బిల్డర్లు, డెవలపర్లు ఆలస్యం చేయడం వల్ల ఫ్లాట్‌లను స్వాధీనం చేసుకోకుండా బ్యాంకులు నెలవారీ చెల్లింపులు (ఈఎంఐలు) చెల్లించమని బలవంతం చేస్తున్నాయని పేర్కొంటూ ఇంటి యజమానుల బృందం కోర్టును ఆశ్రయించింది. 'మేము ఏ సంస్థను చెడ్డదిగా లేదా మంచిగా ధ్రువీకరించబోము' అని ఈ కేసును విచారించిన ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనంలో భాగమైన జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. 'మేము కచ్చితంగా సీబీఐ దర్యాప్తు చేస్తాము. అది స్పష్టంగా ఉంది. వేలాది మంది ప్రజలు ఏడుస్తున్నారు. మేము వారి కన్నీళ్లను తుడవలేము కానీ మేము వారి సమస్యలను పరిష్కరించగలము. చాలా ప్రభావవంతమైనది. ఏదైనా సమయానికి అనుగుణంగా చేయాలి' అని వ్యాఖ్యానించారు. జులై 2024లో సుప్రీం కోర్టు ఒక మైలురాయి తీర్పులో జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) లో తమ ఫ్లాట్‌లను స్వాధీనం చేసుకోని గృహ కొనుగోలుదారులపై ఈఎంఐ రికవరీతో సహా ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని ఆదేశించింది.

# మోదీ ప్రకటనపై దద్దరిల్లిన లోక్‌సభ

- ప్రతిపక్షాల నిరసన హోరు
- 'మహాకుంభ్'పై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్

**న్యూదిల్లీ:** ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా విజయవంతంగా జరిగిందంటూ ప్రధాని నరేంద్రమోదీ చేసిన ప్రకటనపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. మోదీ ప్రకటనపై ప్రశ్నలు లేవనెత్తేందుకు స్పీకర్ ఓంబిర్లా అనుమతించకపోవడంతో ప్రతిపక్ష సభ్యులు తీవ్ర నిరసన తెలిపారు. తొలుత సభా కార్యక్రమాలు మధ్యాహ్నం ఒంటిగంటకు వాయిదా పడగా... కొద్దిసేపు విరామం తర్వాత సభ మళ్లీ ప్రారంభమైంది. అప్పుడు కూడా సభలో ప్రతిపక్ష సభ్యులు నిరసన కొనసాగించడంతో స్పీకర్ సభను బుధవారానికి వాయిదా వేశారు. తొలుత మహాకుంభ్‌పై ప్రధాని మోదీ ప్రకటన చేసిన వెంటనే ప్రతిపక్ష సభ్యులు తమ సీట్లలో లేచి నిరసన తెలిపారు. మహాకుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటన...మరణాలను కూడా ప్రకటనలో పొందుపరచాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సభలో తీవ్ర గందరగోళం నెలకొనడంతో సభ వాయిదాపడింది. సభ తిరిగి సమావేశమైనప్పుడు... ప్రతిపక్షాల నిరసనల నడుమ రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తన మంత్రిత్వ శాఖ మంజూరు డిమాండ్లపై చర్చకు సమాధానమిచ్చారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖ అంశంపై సభ చర్చను ప్రారంభించగా... ప్రతిపక్ష సభ్యులు స్పీకర్ వెల్‌లో నిరసన కొనసాగించారు. దీంతో సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

## నవభారతంలో ఎల్‌ఓపీకి మాట్లాడే అనుమతి లేదు: రాహుల్

ప్రజాస్వామ్యం విలువలు పాటించేట్లయితే లోక్‌సభలో ప్రతిపక్షనాయకుడికి మాట్లాడే అవకాశం కల్పించాల్సి ఉందని... బీజేపీ పాలనలో ఆ పరిస్థితి లేదని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. లోక్‌సభ వాయిదా అనంతరం పార్లమెంటు వెలుపల ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను కూడా ఈ మహాకుంభ్‌పై సభలో మాట్లాడాలనుకున్నానని, జనవరి 29న ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రధాని మోదీ నివాళులు అర్పించి ఉండాల్సిందని రాహుల్ అభిప్రాయపడ్డారు. 'ప్రధాని చెప్పేదానికి నేను మద్దతు ఇవ్వాలనుకున్నాను. కుంభం అనేది మన సంప్రదాయం, చరిత్ర, సంస్కృతి. అయితే ప్రధాని ప్రాణాలు కోల్పోయిన (మహాకుంభ్‌లో తొక్కిసలాటలో) వారికి నివాళులర్పించలేదన్న ఫిర్యాదు కూడా ఉంది' అని రాహుల్ చెప్పారు. 'నేను చెప్పదలుచుకున్న మరో విషయం ఏమిటంటే, కుంభమేళాకు వెళ్లిన యువతకు ప్రధాని నుండి మరొక విషయం కావాలి. వారికి ఉపాధి కావాలి. ఉపాధిపై ప్రధాని మాట్లాడాలి' అని రాహుల్ అన్నారు. కాంగ్రెస్ నేత, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా మాట్లాడుతూ సభలో మాట్లాడేందుకు ప్రతిపక్షాలను అనుమతించి ఉండాల్సిందన్నారు. "ప్రతిపక్షం కూడా దాని (మహాకుంభ్)పై తన భావాలను కలిగి ఉంది. అధికార పక్షానికి తమ అభిప్రాయాలను ప్రసారం చేయడానికి అభ్యంతరం ఏమిటి?" అని ఆమె అన్నారు.

## డీఎంకే వాకౌట్

**న్యూదిల్లీ:** డీలిమిటేషన్ అంశంపై చర్చకు అనుమతించకపోవడంతో మంగళవారం లోక్‌సభ నుండి డీఎంకే వాకౌట్ చేసింది. సభ సమావేశమైన వెంటనే ప్రశ్నోత్తరాల సమయంలో డీలిమిటేషన్ అంశాన్ని లేవనెత్తడానికి డీఎంకే సభ్యులు ప్రయత్నించారు. ప్రశ్నోత్తరాల సమయం తర్వాత మాట్లాడటానికి అనుమతిస్తామని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అన్నారు. అయితే ఆ అంశాన్ని లేవనెత్తేందుకు సమయం ఇవ్వలేదని డీఎంకే ఎంపీ కనిమొళి చెప్పారు. తమిళనాడు ఆందోళనలపై కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నియోజకవర్గాల స్థానాలు తగ్గే డీలిమిటేషన్‌ను అంగీకరించేది లేదని తేల్చిచెప్పారు. చివరికి చర్చకు అనుమతించకపోవడంతో డీఎంకే ఎంపీలు లోక్‌సభ నుండి వాకౌట్ చేశారు. డీలిమిటేషన్, త్రిభాషా విధానంపై డీఎంకే కొంతకాలంగా మోదీ సర్కారుపై విమర్శలు గుప్పిస్తున్న విషయం విదితమే. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజనతో ఎంపీ స్థానాల సంఖ్య తగ్గుతుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వాదిస్తున్నారు. అలాగే ఆరునూరైనా తమిళనాడులో హిందీని బలవంతంగా రుద్దితే అంగీకరించేది లేదని స్పష్టంచేస్తున్నారు.

## మహాకుంభ్‌తో ఐక్యతా స్ఫూర్తి బలోపేతం: మోదీ

**న్యూదిల్లీ:** మహాకుంభ్ దేశంలో ఐక్యతా స్ఫూర్తిని బలోపేతం చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇంత పెద్ద క్రతువు నిర్వహించగలగడంపై భారతదేశ సామర్థ్యాన్ని ప్రశ్నించిన వారికి మహాకుంభ్ విజయవంతం కావడం తగిన సమాధానం ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ విషయమై మంగళవారం ఆయన లోక్‌సభలో ప్రకటన చేస్తూ... ప్రభుత్వం, వివిధ సంస్థలతో పాటు అసంఖ్యాక ప్రజల సహకారం ఫలితంగా మహాకుంభ్ విజయవంతమైందని మోదీ అన్నారు.

"భారతదేశంలో సుమారు ఒకటిన్నర నెలల పాటు మహాకుంభ్ మేళా ఉత్సాహాన్ని మనం చూశాం. లక్షలాది మంది భక్తులు సౌలభ్యం, అసౌకర్యం యొక్క ఆందోళనలను అధిగమించి భక్తితో తరలివచ్చిన మార్గం మన గొప్ప బలం" అని మోదీ అన్నారు. దేశంలోని ప్రతి ప్రాంతం, ప్రతి మూలకు చెందిన ప్రజలు తమ అహంభావాలను పక్కనపెట్టి 'మేము' అనే భావనతో ప్రయాగ్‌రాజ్ త్రివేణిసంగమంలా కలిపోయారన్నారు. ముఖ్యంగా ప్రపంచ పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్న తరుణంలో మహాకుంభ్‌లో ఐక్యతను ప్రదర్శించడం భారతదేశానికి బలమని మోదీ అన్నారు. "ఐక్యత యొక్క స్ఫూర్తి చాలా బలంగా ఉంది, దానిని విచ్ఛిన్నం చేసే ఏ ప్రయత్నాలనైనా అది విచ్ఛిన్నం చేస్తుంది" అని చెప్పారు. 'భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ ప్రత్యేకత అని మనం ఎప్పుడూ చెబుతూనే ఉన్నాం. ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్‌లో మనం దాని గొప్ప రూపాన్ని అనుభవించాము. భిన్నత్వంలో ఏకత్వం యొక్క ఈ లక్షణాన్ని సుసంపన్నం చేయడం మన బాధ్యత' అని ప్రధాని మోదీ అన్నారు. వివిధ భాషలు, మాండలికాలు మాట్లాడే ప్రజలు సంగం ఒడ్డున 'హర హర గంగే' అని పఠించడం 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' సంగ్రహావలోకనం ఇచ్చిందని, ఇది ఐక్యతా భావాన్ని పెంచిందని మోదీ చెప్పుకొచ్చారు. స్వాతంత్ర్య పోరాటంలో ముఖ్యమైన మైలురాళ్లతో మహాకుంభ్‌ను ప్రధాని పోల్చారు. 1857లో స్వాతంత్ర్య సంగ్రామమైనా, భగత్ సింగ్ బలిదానం, నేతాజీ సుభాష్ బాబు ఇచ్చిన చలో ఢిల్లీ పిలుపు , మహాత్మాగాంధీ దండి మార్చ్ అయినా... ఇలాంటి మైలురాళ్ల నుంచి స్ఫూర్తి పొంది భారతదేశం స్వాతంత్ర్యం సాధించిందని మోదీ అన్నారు. ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్ కూడా మేల్కొన్న దేశం యొక్క స్ఫూర్తిని ప్రతిబింబించే ఒక ముఖ్యమైన మైలురాయి అని ఆయన అన్నారు.

## మోదీతో భేటీ మరువలేను: ఇళయరాజా

**న్యూదిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీని ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ఫొటోలను ఇళయరాజా సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు.

'మోదీజీతో ఎప్పటికీ మర్చిపోలేని సమావేశమిది. నా 'సింఫొనీ- వాలియంట్' సహా అనేక అంశాలపై చర్చించాం. ఆయన ప్రశంసలు, మద్దతుకు కృతజ్ఞుడిని' అని ఆయన పేర్కొన్నారు. లండన్‌లో ఇటీవల ఇళయరాజా 'వాలియంట్' పేరిట మ్యూజికల్ ఈవెంట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. లండన్‌లో వెస్ట్రన్ క్లాసికల్ సింఫొనీ నిర్వహించిన తొలి ఆసియా మ్యూజిక్ కంపోజర్‌గా ఇళయరాజా రికార్డు సృష్టించారు. కొన్నిరోజుల క్రితం చెన్నై తిరిగొచ్చిన ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సంగీతానికి వయసుతో సంబంధం లేదన్నారు. భవిష్యత్తులో 13 దేశాల్లో 'వాలియంట్' నిర్వహించనున్నారు.

## పాక్ దురాక్రమణపై ఐరాస తప్పుడు సంకేతం

### కేంద్రమంత్రి జైశంకర్ మండిపాటు

**న్యూదిల్లీ:** కశ్మీర్ అంశంపై విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ ఐక్యరాజ్య సమితిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 'కశ్మీర్ అంశంపై మేం ఐక్యరాజ్య సమితిని ఆశ్రయించాం. అప్పుడు వారు పాక్ దురాక్రమణను రెండు దేశాల వివాదంగా మార్చేశారు. అందులో కొన్ని పాశ్చాత్య దేశాల పాత్ర ఉంది' అని ఆరోపణలు చేశారు. దాంతో భారత సార్వభౌమత్వాన్ని ప్రపంచం చూసే దృష్టిపై దీని ప్రభావం పడిందని మండిపడ్డారు. ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై చర్చించేందుకు 10వ 'రైసీనా డైలాగ్' సమావేశం దిల్లీలో జరుగుతోంది. సమావేశంలో మాట్లాడుతూ మంత్రి జైశంకర్ స్పందించారు. కశ్మీర్ సమస్య విషయంలో తప్పుడు కథనాలు రూపొందించడంలో బ్రిటన్, కెనడా, బెల్జియం, ఆస్ట్రేలియా, అమెరికా కారణమని పరోక్షంగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దాంతో భారత్ ఈ సమస్యను దౌత్యపరంగా పరిష్కరించుకోవడం క్లిష్టతరంగా మారిందన్నారు. పాశ్చాత్య దేశాలు అనుసరించే ద్వంద్వ ప్రమాణాలను ఆయన ఎండగట్టారు. భారత చరిత్రను అర్థం చేసుకోవాల్సిన ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. కశ్మీర్ సమస్యతో పాటు భారత స్వాతంత్ర్య పోరాటం, అంతర్జాతీయ సంబంధాల విషయంలో తమ విధానాన్ని ప్రభావితం చేసిందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా 1940ల్లో ప్రజాస్వామ్య దేశంగా ఉండాలని భారత్ నిర్ణయించుకుందని గుర్తుచేశారు. ప్రపంచ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించాలనే తమ ఆశయానికి అది నిదర్శనమన్నారు. భారతదేశం తన సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలనే దృఢసంకల్పం, ప్రపంచశక్తిగా ఎదగాలనే లక్ష్యాన్ని ప్రతిబింబించేలా ఆయన ప్రసంగించారు.

## ఉపాధి కూలీల వేతనం, పని దినాలు పెంచండి: సోనియా

**న్యూదిల్లీ:** మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఇచ్చే కనీస వేతనాన్ని, పని దినాల సంఖ్యను పెంచాలని కాంగ్రెస్ నేత సోనియాగాంధీ డిమాండ్ చేశారు. రాజ్యసభ జీరో అవర్‌లో ఈ అంశాన్ని సోనియా మంగళవారం ప్రస్తావించారు. ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ సర్కారు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పేదలకు అన్నం పెట్టే ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈ పథకానికి బడ్జెట్ కేటాయింపులు భారీగా తగ్గించినట్లు ఆరోపించారు. ఉపాధి పథకాన్ని సజావుగా నడిపేందుకు అదనపు నిధులు కేటాయించాలని ఆమె కోరారు. రోజువారీ కనీస వేతనాన్ని 400కు పెంచాలని ఆమె డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిదినాలను 100 నుంచి 150 రోజులకు పెంచాలని సోనియా గాంధీ ప్రభుత్వాన్ని కోరారు. ఈ పథకం ద్వారా ఉద్యోగం, ఆర్థిక భద్రత కల్పించేందుకు ఈ చర్యలు అవసరమని ఆమె తెలిపారు.

## మోదీ, ట్రంప్ బాట ఒక్కటే: తులసీ గబ్బర్డ్

**న్యూదిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'అమెరికాకు తొలి ప్రాధాన్యం' విధానాన్ని కేవలం తమ దేశం మాత్రమే ఎదగాలనే ఉద్దేశంగా అపార్థం చేసుకోవద్దని ఆ దేశ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబ్బర్డ్ చెప్పారు. దిల్లీ వేదికగా జరుగుతోన్న 10వ 'రైసీనా డైలాగ్' కార్యక్రమంలో పాల్గొన్న తులసీ గబ్బర్డ్ మంగళవారం కీలక వ్యాఖ్యలు చేశారు. భారత ప్రధాని మోదీతో ట్రంప్ స్నేహబంధం గురించి ఆమె ప్రస్తావించారు. 'డొనాల్డ్ ట్రంప్ ఎల్లప్పుడూ శాంతిని కాంక్షిస్తూ... ఐక్యత సాధించాలనే తాపత్రయం కలిగిన వ్యక్తి. ఆయన మాదిరిగానే ఇక్కడి ప్రధాని మోదీ కూడా శాంతి పునరుద్ధరణ కోసం కట్టుబడి ఉంటారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన కొన్ని రోజులకే మోదీ వాషింగ్టన్ పర్యటన చేపట్టడం వారి మధ్య ఉన్న స్నేహబంధంతో పాటు వారి ప్రాధాన్యాలను చాటిచెబుతోంది. రెండుదేశాల ప్రయోజనాల కోసం ఉత్తమ సేవలు అందించాలని నేతలిద్దరూ కృతనిశ్చయంతో ఉన్నారు' అని గబ్బర్డ్ ప్రశంసలు కురిపించారు. ట్రంప్ 'అమెరికా ఫస్ట్' విధానంపై ఆమె స్పందించారు. 'ఆయన ఒంటరివాది అని తప్పుగా అర్థం చేసుకోవద్దు. ట్రంప్ విధానాలను కొందరు తప్పుగా ఊహించుకుంటున్నారు. ఇతర దేశాలతో ఘర్షణలు పెంచుకోవాలని చూస్తున్నట్లు అభిప్రాయపడుతున్నారు. కానీ, ఆయన అలాంటి వ్యక్తి కాదు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకునేందుకు ఆయన ప్రాధాన్యమిస్తారు' అని తులసీ గబ్బర్డ్ వెల్లడించారు. రైసీనా డైలాగ్ కార్యక్రమం కోసం భారత్‌కు విచ్చేసిన తులసి... నిన్న మోదీతో భేటీ అయిన సంగతి తెలిసిందే. ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై చర్చించడానికి మూడు రోజులపాటు నిర్వహించే 10వ 'రైసీనా డైలాగ్'ను మోదీ సోమవారం ప్రారంభించారు. న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సాన్, ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆంద్రీ సైబిహాతో పాటు 125 దేశాలకు చెందిన 3,500 మంది ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు.

ఔరంగజేబ్ సమాధి

# కరసేవకులు రేపిన కార్చిచ్చు

- నాగపూర్‌లో మత ఘర్షణలు చెలరేగిన వైనం
- కాషాయ శ్రేణుల నిరసనలతో ఆరంభం
- మత గ్రంథం తగలబెట్టారని వదంతులు
- ఒక్కసారిగా చెలరేగిన అల్లర్లు... ఆస్తుల దహనాలు
- 33 మంది పోలీసులతో సహా వందలాది మందికి గాయాలు
- కర్ఫ్యూ విధింపు... 50 మంది అరెస్ట్
- అధికార, విపక్షాల పరస్పర విమర్శలు

**నాగపూర్/ముంబై :** బీజేపీ పాలిత మహారాష్ట్ర అల్లర్లతో అట్టుడికిపోతోంది. ఛత్రపతి శంభాజీనగర్‌లోని మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ సమాధిని తొలగించాలని డిమాండ్ మత ఘర్షణలకు దారితీసింది. సోమవారం కాషాయ సంస్థ బజరంగ్ దళ్ చేపట్టిన నిరసనలతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. సోమవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో మహల్ ప్రాంతంలోని సెంట్రల్ నాగ్‌పూర్‌లోని చిట్నిస్ పార్క్‌లో హింస చెలరేగింది. ఔరంగజేబు సమాధిని తొలగించాలని ఒక మితవాద సంస్థ చేపట్టిన ఆందోళన సందర్భంగా ఒక వర్గానికి చెందిన పవిత్ర గ్రంథాన్ని తగలబెట్టారనే వదంతుల నడుమ పోలీసులపై రాళ్లు రువ్వారని అధికారులు తెలిపారు. ఓల్డ్ భండారా రోడ్డు సమీపంలోని హన్సపురి ప్రాంతంలో రాత్రి 10.30 నుంచి 11.30 గంటల మధ్య మరో ఘర్షణ జరిగింది. హింసాత్మక గుంపు అనేక వాహనాలను తగలబెట్టింది. ఆ ప్రాంతంలోని ఇళ్లు, ఒక క్లినిక్‌ను ధ్వంసం చేసింది. హింసకు సంబంధించి ఐదు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు నాగ్‌పూర్ పోలీసు కమిషనర్ రవీందర్ కుమార్ సింగల్ తెలిపారు. మత గ్రంథం తగలబెట్టారనే వదంతులతో సోమవారం మధ్యాహ్నమే కొత్వాలి, గణేశ్‌పేట్ ప్రాంతాల్లో ఘర్షణలు ప్రారంభమయ్యాయి. అటుతర్వాత అర్ధరాత్రి నాగ్‌పూర్‌లోని అనేక ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. హంసపురి ప్రాంతంలో రెండు వర్గాల మధ్య అర్ధరాత్రి ఘర్షణలు జరిగాయి. కొందరు దుండగులు వాహనాలకు నిప్పంటించడంతోపాటు ఆ ప్రాంతంలోని నివాసాలు, షాపులను ధ్వంసం చేశారు. ఈ ఘటనల్లో వందల మంది గాయపడగా, వారిలో 33 మంది పోలీసు సిబ్బంది ఉన్నారు. ఇప్పటి వరకు ఘర్షణకు కారకులైన 50 మందిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని తెలిపారు. అల్లర్లను అదుపు చేసేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నిస్తుంది. నాగ్‌పూర్‌లోని అనేక ప్రాంతాల్లో పోలీసులు కర్ఫ్యూ విధిస్తూ స్థానిక పోలీస్ కమిషనర్ రవీందర్‌కుమార్ సింగల్ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్వాలి, గణేశ్‌పేట్, లకడ్‌గంజ్, పచ్పావలి, శాంతినగర్, సక్కర్‌దర, నందన్‌వన్, ఇమామ్వాడ, యశోధర నగర్, కపిల్‌నగర్‌లలో కర్ఫ్యూ విధించారు. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని వెల్లడించారు. ఎవరైనా కర్ఫ్యూ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలాఉండగా, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ హింస ముందస్తు ప్రణాళికతో జరిగిందని చెప్పుకొచ్చారు. శంభాజీ మహారాజ్‌పై ఔరంగజేబ్ చేసిన క్రూరమైన దురాగతాలను చిత్రీకరించిన 'చావా' సినిమా విడుదల 'తీవ్రమైన భావోద్వేగాలకు' కారణమని ఫడ్నవీస్ పేర్కొన్నారు.

నాగ్‌పూర్‌లో మతపరమైన అల్లర్లు చోటుచేసుకోవడంపై విపక్ష పార్టీల నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బీఎస్‌పీ అధ్యక్షురాలు మాయావతి 'ఎక్స్' లో చేసిన ఒక పోస్ట్‌లో... 'మహారాష్ట్రలో ఎవరి సమాధి లేదా సమాధిని దెబ్బతీయడం లేదా విచ్ఛిన్నం చేయడం సరికాదు. ఎందుకంటే, అది అక్కడ పరస్పర సోదరభావం, శాంతి, సామరస్యాన్ని చెడగొడుతోంది. ప్రభుత్వం అటువంటి వికృత శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా నాగపూర్‌లో, లేకపోతే పరిస్థితి మరింత దిగజారిపోతుందని ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి పేర్కొన్నారు. శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది 'ఎక్స్' పోస్ట్‌లో... హింసను ప్రేరేపించడం, రాష్ట్రంలో అస్థిరతను సృష్టించడం, పౌరులను గత చరిత్రతో గందరగోళపరచడం, రాష్ట్ర ఆర్థిక వినాశనం, పెరిగిన రుణ భారం, పెరుగుతున్న నిరుద్యోగం, రైతు ఆత్మహత్యలపై కఠినమైన ప్రశ్నలతో తప్పించుకోవడమే అవుతుంది' అని తెలిపారు. 'షిండే పాలనలో అన్ని వ్యాపారాలు రాష్ట్రాన్ని పణంగా పెట్టి గుజరాత్‌కు తరలించుకుపోయారు. ప్రస్తుత ముఖ్యమంత్రి పాలనలో రాష్ట్రం పెట్టుబడులకు అనుకూలంగా లేకుండా పోయింది. వ్యాపారాలు తరలివెళ్లేలా చేసింది. సిగ్గుచేటు' అని రాజ్యసభ సభ్యుడు అన్నారు. ముఖ్యమంత్రి స్వస్థలం అయిన నాగ్‌పూర్‌లో జరిగిన హింసకు ఫడ్నవీస్, ఆయన ప్రభుత్వమే కారణమని రాష్ట్ర శాసన మండలిలో ప్రతిపక్ష నాయకుడు అంబదాస్ దన్వే ఆరోపించారు. 'ఈ ప్రభుత్వం రాష్ట్రంలో హిందూ-ముస్లిం హింసను రెచ్చగొట్టడానికి నెల రోజులుగా ప్రయత్నాలు చేస్తోంది. ఇటువంటి హింస హిందువులు ముస్లింల దైనందిన జీవితాన్ని దెబ్బతీస్తుంది. కానీ ప్రభుత్వం దాని నుంచి రాజకీయ ప్రయోజనాలను పొందాలని కోరుకుంటోంది. బీజేపీ దాని అనుబంధ సంస్థలు రాష్ట్రంలో సామరస్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నాయి' అని విమర్శించారు. విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నాయకుడు వినోద్ బన్సాల్ మాట్లాడుతూ నాగ్‌పూర్ హింస కుట్రలో భాగమని అన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఇందులో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకుంటుందని తాము విశ్వసిస్తున్నట్లు చెప్పారు. ఫడ్నవీస్, ఆయన మంత్రులను ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. ఇటీవలి వారాల్లో ముఖ్యమంత్రి, మంత్రులు చేసిన ప్రకటనలను మనం పరిశీలించాలి' అని అన్నారు. 'ప్రభుత్వం నుంచి అతిపెద్ద రెచ్చగొట్టడం జరుగుతోంది. వారు బాధ్యత వహించడం లేదు. ఒక చక్రవర్తి చిత్రాలను తగలబెట్టారు. ఫిర్యాదులు ఉన్నప్పటికీ, ఎటువంటి చర్య తీసుకోలేదు. నేను హింసను ఖండిస్తున్నాను' అని అన్నారు. ఈ సంఘటన ముఖ్యమంత్రి స్వస్థలంలో, కేంద్ర మంత్రి నివాసానికి సమీపంలో జరిగింది' అని అన్నారు. నాగ్‌పూర్ హింస మతపరమైన అశాంతిని వ్యాప్తి చేయడానికి ఉద్దేశించిన ముందస్తు ప్రణాళికతో జరిగిన దాడి అని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అన్నారు. వారు సామాన్య ప్రజలపై మాత్రమే కాకుండా పోలీసు అధికారులపై కూడా దాడి చేశారని తెలిపారు. ఈ వ్యక్తులు మతపరమైన హింసను వ్యాప్తి చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

### మా శ్రేణుల ఇళ్లపై దాడులు చేశారు : వీహెచ్‌పీ

వీహెచ్‌పీ ప్రధాన కార్యదర్శి (సంస్థ) మిలింద్ పరాండే ఈ సంఘటనను ఖండించారు. ఒక నిర్దిష్ట సమాజంలోని 'ఒక వర్గం' దాడులు, దహనాలకు పాల్పడిందని ఆరోపించారు. 'మా యువజన విభాగం బజరంగ్ దళ్ కార్యకర్తల ఇళ్లపై దాడి జరిగింది. వారు అనేక ఇళ్లను లక్ష్యంగా చేసుకున్నారు. విశ్వ హిందూ పరిషత్ వీటన్నింటినీ తీవ్రంగా ఖండిస్తోంది' అని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీహెచ్‌పీ సీనియర్ కార్యకర్త ఒకరు మాట్లాడుతూ ఔరంగజేబ్‌ను కీర్తించకూడదని అన్నారు. 'బదులుగా, ఔరంగజేబ్‌ను ఓడించిన ధనాజీ జాదవ్, శాంతాజీ ఘోర్పడే ఛత్రపతి రాజారాంజీ మహారాజ్ - 'విజయ స్మారక్ (విజయ స్మారక చిహ్నం)' అక్కడ నిర్మించాలి' అని అన్నారు.

# విశాలాంధ్ర హైదరాబాద్

## ఇంద్రజిత్ గుప్తాకు నివాళి

విశాలాంధ్ర, హైదరాబాద్ : మాజీ కేంద్ర హోం మంత్రి, సీపీఐ అగ్ర నాయకులు కామ్రేడ్ ఇంద్రజిత్తు గుప్తా జయంతి సందర్భంగా మంగళవారం హైదరాబాదులోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం, మఖ్దూం భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంద్రజిత్తు గుప్తా దేశానికి, పార్టీకి చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ కార్యదర్శి గోవిందరావు, అంజయ్య, సురేష్, కృష్ణ, హరీష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీల సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీసీల సంక్షేమాన్ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో విస్మరించిందని టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం రూ.20,69,588 కోట్ల బడ్జెట్లో బీసీల సంక్షేమం కోసం కేవలం 2శాతం అనగా కేటాయించిన రూ.41,484 కోట్లలో ఖర్చు చేసింది రూ.25,419 కోట్లు మాత్రమేనని విమర్శించారు. రూ.100లో 2 రూపాయల 22 పైసలు ఖర్చు చేశారన్నారు. మొత్తం బడ్జెట్లో పదేళ్లలో రైతుబంధు, ఇతర పథకాలకు సంబంధించి రూ.81.668 కోట్లు కేటాయించి తమ పాలనలో 3.95 శాతం ఖర్చు చేశారని అన్నారు. దీనిబట్టి బీసీల పట్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. ఎంబీసీలకు సంబంధించి బీసీ కులాల కార్పొరేషన్కు రూ.3850 కోట్లు కేటాయించి ఖర్చు చేసింది రూ.20 కోట్లు మాత్రమేనని ఎద్దేవాచేశారు. ఇదే తరహాలో అన్ని కార్పొరేషన్లకు నిధులు కేటాయించి ఖర్చు చేసింది నామమాత్రమేనని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో బీసీలకు స్వర్ణయుగమని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. ఎంత జనాభా ఉంటే అంతే రిజర్వేషన్లు కల్పించాలన్న రాహుల్ గాంధీ ఆలోచనల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు తెలిపారు. కులగణన సర్వే ను తప్పు అని కేటీఆర్ అనడం సరికాదన్నారు. బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ ఆమోదించే బాధ్యతను బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎంపీలపై ఉందన్నారు. ఈ బిల్లుకు రాహుల్ గాంధీ నేతృత్వంలో పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. సమావేశంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షులు చంద్రకుమార్ గౌడ్, మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు బెక్కరి మధుసూదన్ రెడ్డి, అజ్మత్‌అలీ, రాములు యాదవ్ పాల్గొన్నారు.

## బీసీలకు రూ.31 వేలకోట్లు కేటాయించాలి: ఆళ్ల

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : 2025 - 26 రాష్ట్ర బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 31 వేలకోట్లు కేటాయించాలని జాతీయ ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు, విశ్రాంత చీఫ్ ఇంజనీర్ ఆళ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీలో బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు అసెంబ్లీలో ఆమోదించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బడ్జెట్‌లో బీసీలకు 27 శాతం తగ్గకుండా కేటాయించాలని కోరారు. గత బడ్జెట్‌లో బీసీలకు తక్కువ నిధులు కేటాయించిందని, గత ఏడాది బడ్జెట్‌కి సంబంధించిన రూ.11 వేల కోట్లు రాబోయే బడ్జెట్ రూ.20 వేల కోట్లు మొత్తం 31 వేల కోట్లు కేటాయించాలని కోరారు. ఆల్ ఇండియా తూర్పు కాపు సంక్షేమ సంఘం జనరల్ సెక్రెటరీ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

## బీసీల బిల్లు ఆమోదించడంపై హర్షం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును రాష్ట్ర శాసనసభ ఆమోదించడం పట్ల అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐ.ఎన్.టి.యు.సి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీసుకువచ్చిన బీసీ రిజర్వేషన్ బిల్లు దేశానికే ఆదర్శమన్నారు. బడుగు బలహీనవర్గాల సంక్షేమం, అభ్యున్నతి కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు బిసి రిజర్వేషన్ బిల్లు ఒక నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. 'జనాభాలో బిసిలు ఎంత శాతమో అధికారంలో అంత భాగం' అనే కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్‌గాంధీ ఆశయానికి అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో చర్యలు చేపట్టారని, అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర ఇంటింటి కులగణన సర్వేను ( విద్యా, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ) చేపట్టిందని, ఈ సర్వే లెక్కల ఆధారంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించి బీసీ రిజర్వేషన్ బిల్లును తీసుకురావడాన్ని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం స్వాగతిస్తుందన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలలో అభివృద్ధి పనుల కొరకు నిధుల మంజూరు చేయాలని జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డిని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్ గౌడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం వి.జగదీశ్వర్ గౌడ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డిని వారి కార్యాలయంలో కలిశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశనిర్దేశంలో, ఇంచార్జ్ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబ నేతృత్వంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధి పనులు చెప్పటడం జరిగుతుందని,శేరిలింగంపల్లి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యంగా హాఫీజ్ పెట్/మాదాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో సరైన లైట్లు లేనందువల్ల పాదచారులు, వాహనదారులు రాత్రి పూట చాలా ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని అన్నారు

## 'రాజీవ్ యువ వికాసం పథకం' సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర, హైదరాబాద్ : వెనుకబడిన తరగతుల కులాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక పురోగతిని పెంపొందించాలనే ఉద్దేశముతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము 'రాజీవ్ యువ వికాసము పథకం' ప్రకటించింది. ఈ పథకం క్రింద బీసీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించడానికి ప్రణాళికను రూపొందించింది. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 17 నుంచి ఏప్రిల్ 5 వరకు https://tgobmmsnew.cgg.gov.in ద్వారా అప్లై చేసుకోగలరు. అర్హత ప్రమాణాలు, పథకాలు, ఇతర వివరములు లవెబ్‌సైట్‌లో పొందు పరిచారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగము చేసుకుని ఆర్థిక పురోగతిని సాధించగలరని ఆశించడం జరిగినది. మరిన్ని వివరాలకు జిల్లా వెనుకబడిన తరగతుల సేవ సహకార సంఘాల సంస్థ, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయములో సంప్రదించవలసిందిగా సంబంధిత అధికారులు తెలిపారు.

# హైడ్రా పేరిట లావాదేవీలు చేస్తే చర్యలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైడ్రా పేరు చెప్పి లావాదేవీలకు, అవకతవకలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలుంటాయని హైడ్రా హెచ్చరించింది. ఈ మేరకు గతేడాది సెప్టెంబరు 3న హైడ్రా స్పష్టమైన ప్రకటన చేసింది. అవకతవకలు జరిగినట్టు ఆధారాలుంటే వెంటనే తన దృష్టికి తీసుకు రావాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కోరారు. లేని పక్షంలో ఏసీబీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ విభాగానికి, స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అవకతవకలు నిజమైన పక్షంలో హైడ్రా ఉద్యోగులైతే సస్పెండ్ చేయడంతో పాటు.. కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ స్పష్టం చేశారు. ప్రత్యక్షంగా కానీ.. పరోక్షంగా హైడ్రా పేరును వినియోగించుకుని వసూళ్లకు పాల్పడినా, అవకతవకలు చేసినా వారిపైనా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ క్రమంలోనే ఇప్పటికే పలువురిపై కేసులు పెట్టామన్నారు. నోటీసులు ఇచ్చి హైడ్రా లావాదేవీలు చేస్తున్నట్టు ఏవైనా ఫిర్యాదులుంటే జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తమ దృష్టికి కాని, ఏసీబీ, విజిలెన్స్, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లవచ్చన్నారు.

**వంశీరాం బిల్డర్లపై ఎమ్మెల్యే ఫిర్యాదు అందలేదు**

గత సంవత్సరం ఆగస్టు 18, 2024న, డిసెంబర్ 21 2024 తేదీల్లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి నుంచి హైడ్రాకు రెండు ఫిర్యాదులు అందాయి. ఖాజాగూడలోని తౌతానికుంటలో నీరు నిలిచిపోవడం వల్ల గ్రీన్‌గ్రేస్ అపార్టు మెంట్ సెల్లార్‌లోకి నీరు చేరుతోందనేది ఒకటి కాగా తౌతానికుంట నిండిన తర్వాత వరద నీరు భగీరథమ్మచెరువుకు వెళ్లడంలేదనేది రెండోది. ఈ రెండు ఫిర్యాదులపైన నేరుగా తానే రెండు సార్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను తెలుసుకున్న విషయాన్ని కమిషనర్ గుర్తు చేశారు. పైనుంచి వచ్చిన వరదను తౌతానికుంటకు తర్వాత భగీరథమ్మ చెరువులోకి వెళ్లే అవకాశాలను పరిశీలించారు. భగీరథమ్మ చెరువులో ఆక్రమణలు గత ఏడాది డిసెంబరు చివరి వారంలో హైడ్రా తొలగించింది. వంశీరాం మ్యాన్‌హట్టన్ ప్రాజెక్టుపై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ఈ విషయంలో వారి వద్ద ఏమైనా ఫిర్యాదు ఉంటే వాట్సప్‌లో అయినా పంపితే పరిశీలిస్తాం. గతంలో ఎమ్మెల్యే వాట్సాప్‌లో సమస్యను చెబితే స్పందించాం కూడా. ప్రజాప్రతినిధుల ఫిర్యాదులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు.

**ఫిర్యాదులపై సమీక్ష.....**

ప్రతి సోమవారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకూ నిర్వహించే ప్రజావాణిలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా ఫిర్యాదులను పరిశీలిస్తారు. ఫిర్యాదు దారుల ముందే.. గూగుల్ మ్యాప్స్, శాటిలైట్ ఇమేజెస్, సర్వే ఆఫ్ ఇండియా మ్యాపుల ఆధారంగా.. అప్పటికప్పుడే సమస్యపై చర్చించి.. సంబంధిత అధికారులకు వాటి పరిష్కార బాధ్యతలను అప్పగిస్తారు. అక్కడితో ఆగకుండా.. ఫిర్యాదుల పరిష్కారం ఎంతవరకు వచ్చిందనేది వారంలో రెండు రోజులు కమిషనర్ సమీక్షిస్తారు. కొన్ని పిర్యాదులపై నేరుగా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలిస్తారు.

# తెలుగు యూనివర్సిటీకి సురవరం పేరు తెలంగాణ సమాజానికి దక్కిన గౌరవం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలుగు యూనివర్సిటీకి తెలంగాణ వైతాళీకుడు, సామాజిక పరిశోధకుడు సురవరం ప్రతాప్ రెడ్డి నామకరణం చేయడం తెలంగాణ సమాజానికి దక్కిన గౌరవమని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ అన్నారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో సురవరం ప్రతాప్ రెడ్డి కుటుంబ సభ్యులు మరియు సురవరం సాహితీ వైజయంతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టడమంటే ఓ వ్యక్తిని ఆదరించడం కాదని, తెలంగాణ సాంస్కృతిక, సాహిత్య రంగాలను, జర్నలిజం చరిత్రను విశ్వవ్యాప్తి చేయడమేనని విరాహత్ స్పష్టం చేశారు. గోల్కొండ పత్రికలో తన వార్తలతో ప్రజల్లో ఎనలేని చైతన్యం తెచ్చిన ఘనత ప్రతాప్ రెడ్డికే దక్కిందన్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా దేశంలో తెలుగు భాషకు గౌరవం తెచ్చిన మహనీయుడు సురవరం ప్రతాప్ రెడ్డియే అని ఆయన తెలిపారు. పొట్టి శ్రీ రాములుపై ఎవరికీ ఎలాంటి వ్యతిరేకత లేదని, అయితే రాష్ట్ర విభజన జరిగిన నేపథ్యంలో ఆయా సంస్థలకు ఈ ప్రాంత మహనీయుల నామకరణం చేసినట్లు తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టడం సముచితమేనన్నారు. ఈ ఆకాంక్ష ఇప్పటిది కాదని, పదేళ్ల నుండి ఈ ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిన్న అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ ప్రజల ఈ ఆకాంక్షను తీర్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డికి, సభలో బిల్లు ప్రవేశ పెట్టిన మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అలాగే బిల్లును ఆమోదించిన ప్రతిపక్ష పార్టీలకు, శాసన సభ్యులకు, ఈ ప్రక్రియ కోసం నిరంతరం కృషి చేసిన సిపిఐ పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డికి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు విరాహత్ అలీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సురవరం ప్రతాప్ రెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం తెలుగు సాహిత్య, జర్నలిజం రంగాలలో విశేష సేవలు అందిస్తున్న వారికి అందజేస్తున్న ఒక అవార్డుతో పాటు, ఈ రంగాలలో అధ్యయనం చేస్తున్న ప్రతిభావంతులకు ఒక స్కాలర్‌షిప్‌ను "సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం" తరపున ఇవ్వాలని ట్రస్ట్ భావిస్తున్నదని, దీనిపై ట్రస్ట్ కమిటీ త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందన్నారు. ట్రస్ట్ కార్యదర్శి ఆచార్య చెన్నయ్య మాట్లాడుతూ, చీకటిలో మగ్గుతున్న తెలుగు ప్రజల స్వాభిమాన ప్రతీకగా సురవరం ప్రతాప రెడ్డి నిలిచారని, తెలుగు యూనివర్సిటికి ఆయన పేరు పెట్టడం ద్వారా తెలుగు సాహిత్య రంగానికి స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారని పేర్కొన్నారు. ఇంకా ఈ సమావేశంలో ట్రస్టీలు సురవరం పుష్పలత, డాక్టర్ కృష్ణవర్ధన్ రెడ్డి, డాక్టర్ కొండా లక్ష్మీకాంత రెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి మనుమలు సురవరం అనిల్‌రెడ్డి, సురవరం కపిల్, సుధీర్ తదితరులు పాల్గొని ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# దశలవారీగా అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదుబండలో గల సీఎంసీ ఎనక్లేవ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీలో నెలకొన్న పలు సమస్యల, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు మంగళవారం ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు ఆరెకపూడి గాంధీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా సీఎంసీ ఎనక్లేవ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతులు కలిపించినదుకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నామని, అదేవిధంగా కాలనీలో అంపూర్తిగా మిగిలిపోయిన సీసీ రోడ్లను వేయాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన యుజీడీ పనులు చేపట్టాలని, మంచి నీటి వ్యవస్థను మెరుగుపర్చలని, విధి దీపాల వ్యవస్థను ఏర్పాటు చేయాలని, వాటర్ ట్యాంకర్లతో కాలనీలో ఏర్పడిన ట్రాఫిక్ సమస్య ను పరిష్కరించాలని గాంధీకి వినతి పత్రం ద్వారా కోరారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సీఎంసీ ఎనక్లేవ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు పర్యటించడం జరిగినదని, కాలనీలో నెలకొన్న అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులు కలిపించామని, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను, పనులు అతి త్వరలో చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, ప్రజలకు ఇబ్బంది లేకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని అన్ని రోడ్లను దశల వారిగా చెప్పటి పూర్తి స్థాయిలో రోడ్ల నిర్మాణం పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులో కి తీసుకువస్తామని, డ్రైనేజి వ్యవస్థను, మంచి నీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. కాలనీ లో నిత్యం తిరుగుతున్న ట్యాంకర్ల వలన ఏర్పడిన ట్రాఫిక్ సమస్య ను పరిష్కరిస్తామని, రోడ్ల పై నిలిపి కాలనీ వాసులకు, పాదచారులకు ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, రోడ్ల ను ఆక్రమించి కాలనీ వాసులకు ఇబ్బందులకు గురిచేయవద్దు అని, ఒక క్రమ పద్ధతిలో మంచి నీటి ట్యాంకర్ల ను నడపాలని, ఇష్టారీతిన వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గాంధీ తెలియచేశారు. కాలనీ లో ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మరబోయిన రాజు యాదవ్, మల్లేష్ యాదవ్, మహేష్, కాలనీ వాసులు సాంబశివరావు, రామ్మోహన్, మురళి కృష్ణ, మూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ భద్రత కల్పించాలి : రాజేష్ ఖన్నా

విశాలాంధ్ర, హైదరాబాద్ : నేషనల్ హెల్త్ మిషన్‌లో మూడు సంవత్సరాల నుండి ప్రైమరీ హెల్త్ సెంటర్ స్థాయిలో ప్రజా నీకానికి వైద్య సేవలు అందిస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎం.ఎల్.హెచ్.పి.)లకు రూ.44 వేల వేతనం, ఉద్యోగ భద్రతను కల్పించాలని నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ జనగాం జిల్లా స్థాయి సమావేశం గబ్బేట గోపాలరెడ్డి భవన్‌లో జ్యోతి అధ్యక్షతన వహించారు. ఈ సమావేశానికి రామ రాజేష్ ఖన్నా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... కనీస వేతన చట్టం ప్రకారం జీతాలు అమలు చేయకుండా అతి తక్కువ జీతాలతో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. డ్యూటీ చార్ట్ ప్రకారం విధులు చేయించకుండా అనేక రకాల క్రింది స్థాయి పనులను వారిపై రుద్దుతూ పని భారాన్ని పెంచటం అన్యాయమని ఆయన తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. బి.ఎస్సీ.నర్సింగ్, జనరల్ నర్సింగ్, విద్యార్హతతో, డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ ద్వారా ఎన్నిక చేయబడినటువంటి ఎం.ఎల్‌హెచ్.పి ఉద్యోగులకు కనీస వేతనం రూ.44 వేలు ఇవ్వవలసి ఉండగా కేవలం 29 వేల 900 జీతం మాత్రమే చెల్లిస్తూ అధిక పని భారాన్ని వారిపై మోపుతున్నారన్నారు. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకూ ఏఐటియుసి అండగా ఉండి పోరాటం నిర్వహిస్తుందని తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు సి.హెచ్ రాజారెడ్డి పాల్గొని మాట్లాడాడుతూ సుప్రీంకోర్టు గైడెన్స్ ప్రకారం ఉద్యోగులందరికీ సమాన పనికి, సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశం అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా కేతవత్ మహేష్ నాయక్, ఉపాధ్యక్షులుగా పులి లావణ్య, ఉపాధ్యక్షులుగా బొల్లం జెస్సికా, ప్రధాన కార్యదర్శి కీర్తన, ప్రవళిక సహాయ కార్యదర్శిగా ప్రశాంత్ కోశాధికారిగా శిరీష, మమత, ముఖ్య సలహాదారులుగా గంగరబోయిన జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.లిఖిత రాణి తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జనగాం జిల్లా అధ్యక్షురాలు గంగరబోయిన జ్యోతి, ప్రధాన కార్యదర్శి ఏ.గణేష్, ఎమ్.ఎల్.హెచ్.పి.లు పాల్గొన్నారు.

## జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: గత అసెబ్లీ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో జనగామ జిల్లాకు పాపన్న గౌడ్ పేరును పెట్టుతామని, ట్యాంక్ బండ్ పై పాపన్న విగ్రహాన్ని పెట్టుతామని, గీత కార్మిక బీమాను రూ.10 లక్షలకు పెంచి ఇస్తామని, ఖిలశాపూర్‌లోని పాపన్న గౌడ్ కొటలను అభివృద్ధి చేస్తామని, కల్లు గీత వృత్తిపై కల్తీ పేరిట దాడులు లేకుండా చేసి గీత వృత్తిని అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అమలనీ చేయాలని తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్, జాతీయ నాయకులు రాగుల సిద్దిరాములు గౌడ్, బాలసాని సురేష్ గౌడ్, ఏవీ బాలేషం గౌడ్ లు డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యాలయంలో మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యం నర్సింలు గౌడ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోనికి వచ్చి యాడాది గడిచిన అమలు చేయకపోవడం సరైంది కాదని బీసీ సంక్షేమ, రాష్ట్ర రోడ్డు రావాణ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చొరువ చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీప్రకారం జనగామ జిల్లాకు పాపన్న జనగామ జిల్లాగా మార్చి ట్యాంక్ బండ్ పై గత ప్రభుత్వం సాంక్షన్ చేసిన పాపన్న విగ్రహం పెట్టి కొకపేటలో గౌడ భవనానికి పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. గీత కార్మిక ప్రమాద బీమాను 5, లక్షల నుండి 10 లక్షలకు పెంచి సరతులు లేకుండా ఇవ్వాలన్నారు. పెండింగ్ బీమాలకు నిధులు కేటాయించి పంపిణి చేయాలి, కల్లు గీత కార్పొరేషన్ కు చైర్మన్ తో పాటు పూర్తి కమిటీని ఎన్నుకొని 5, వేల కోట్ల రూపాయలు కేటాయించి కల్లు గీత వృత్తిని అభివృద్ధి చేయాలని, నీర ప్రాజెక్టు ను అన్ని జిల్లాలకు విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేకుంటే మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా దసల వారి ఆందోళనలు చేయడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధికార ప్రతినిధి హైకోర్ట్ సీనియర్ న్యాయవాది బాలసాని సురేష్ గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంతుల రమేష్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగుల కిరణ్ కుమార్ గౌడ్, రాష్ట్ర నాయకులు పచ్చిమడ్ల స్వామి గౌడ్, కొండగోని రవీందర్ గౌడ్, బండి నాగేశ్వర్ రావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దేశానికి ఆదర్శంగా తెలంగాణా : ఎంపీ చామల

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ కులగణన చేసి అసెంబ్లీలో 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టడాన్ని పట్టి చూస్తేనే దేశానికి తెలంగాణ ఆదర్శం అని అర్థమవుతుందని ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఒక మాట ఇస్తే మా ముఖ్యమంత్రి మా మంత్రులు మా ప్రభుత్వం పట్టుదలతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా తెలంగాణలో కులగణన చేశారు, గతంలో జనగణన చేశారు. కానీ కులవారీగా జనగణన కాలేదు ఇప్పుడు కులగణనను శాస్త్రీయ పద్ధతులు చేసి అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టారని వివరించారు. భారతదేశంలో ఢబులు ఇంజన్ సర్కార్ అని చెబుతూ, దేశవ్యాప్తంగా ఢబులు ఇంజన్ సర్కారు వస్తేనే బాగుపడుతుందని అంటున్నారని కానీ ఈరోజు మహారాష్ట్రలో చూస్తే కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం అభివృద్ధి వైపు చూడకుండా ఔరంగజేబు టుబ్‌ను తీద్దామా క్రిమినల్ రైడ్స్ చేద్దామా అనే ఆలోచనతోటి ముందుకు పోతున్నటువంటిది ఈ డబ్బులు ఇంజన్ సర్కార్ అంటూ విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితు బాగా లేనందువల్ల మా ముఖ్యమంత్రి 30, 40 సార్లు కేంద్ర మంత్రులను కలవడానికి పోయాడు అంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బాగుపరచడానికి అని తెలంగాణ ప్రజలు గమనించాలన్నారు. పక్క రాష్ట్రంలో పథకాలను అమలు చేయలేక చేతులెత్తేస్తూ క్రిమినల్ రైడ్స్ తీసుకొస్తున్నారు. తెలంగాణలో పట్టుదలతో 42 శాతం రిజర్వేషన్ సాధించుకునే దిశగా అసెంబ్లీలో బిల్లు ఆమోదింపజేసారని చెప్పారు. తెలంగాణలోని ఎనిమిది మంది బిజెపి ఎంపీలు ప్రధానమంత్రి గారి అపాయింట్మెంట్ తీసుకుని అసెంబ్లీలో 42 శాతం ఆమోదం పొందిన ఈ బిల్లును పార్లమెంట్లో 2/3 వంతు ఆమోదింప చేయడానికి కృషి చేయాలన్నారు. తెలంగాణను ఆదర్శంగా తీసుకొని దేశవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లను ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ ఏబిసిడి ప్లాన్లను కూడా అమలు చేయాలని కోరుతున్నామన్నారు. ఇదే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా బడుగు బలహీన వర్గాల కోసం కొట్లాడుతూ వారిపై అభివృద్ధి కొరకు కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు.

## సుధీర్‌రెడ్డి వ్యాఖ్యలపై మహిళా కమిషన్ సీరియస్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మహిళా కార్పొరేటర్ పై చేసిన వ్యాఖ్యల పై రాష్ట్ర మహిళా కమిషన్ మండిపడింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి మహిళా కమిషన్ సమన్లు జారి చేసింది. వివరాల ప్రకారం ఎస్టీ మహిళా కార్పొరేటర్ సుజాత నాయక్ పై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అసభ్యకర వ్యాఖ్యలకు మహిళా కమిషన్ లో ఫిర్యాదు చేశారు. జి.హెచ్.యం.సి ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ళ శారదని కలిసి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పై కాంగ్రెస్ కార్పొరేటర్లు ఫిర్యాదు చేశారు. మహిళా కార్పొరేటర్ సుజాత నాయక్ మధు యాష్కి తో హనీమూన్ కి వెళ్లారు అని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మహిళా కమిషన్ సీరియస్ గా తీసుకుంది. కమిషన్ ముందు హాజరు కావాలంటూ బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి మహిళా కమిషన్ సమన్లు చేసింది. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న మహిళా కార్పొరేటర్ పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అంటే మహిళా లోకాన్ని అగౌరవ పరచడమే అంటూ మహిళా కమీషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

## ఘనంగా గ్లోబల్ రిసైక్లింగ్ దినోత్సవం

విశాలాంధ్ర, హైదరాబాద్ : తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వ్యర్థాలను రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడానికి విల్లా మేరీ డిగ్రీ కళాశాల ఫర్ ఉమెన్‌లో గ్లోబల్ రీసైక్లింగ్ దినోత్సవాన్ని నిర్వహించారు. వ్యర్థాలను తగ్గించడంలో, సహజ వనరులను పరిరక్షించడంలో వాతావరణ మార్పులను తగ్గించడంలో రీసైక్లింగ్ యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు మరియు పిసిబి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.దయానంద్ సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పి.సి.బి.వ్యర్థాలను తగ్గించడంలో రీసైక్లింగ్ అవసరాన్ని గురించి చెప్పారు. రీసైక్లింగ్ అనేది వ్యర్థాలను తగ్గించడానికి, సహజ వనరులను పరిరక్షించడానికి గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడానికి సహాయపడే ఒక ముఖ్యమైన పద్ధతి అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన వ్యర్థాల నిర్వహణ పద్ధతులను అవలంబించాలన్నారు. ఈ-వ్యర్థాల నిర్వహణపై పవర్ పాయింట్‌ను ప్రదర్శించారు. పీసీబీ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.నాగేశ్వరరావు షార్ట్ ఫిల్మ్‌ను ప్రదర్శించారు. సోమాజిగూడ హైదరాబాద్‌లోని మహిళా సోమాజిగూడలోని విల్లా మేరీ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.భవానీ, అధ్యాపక సభ్యులు ప్రసంగించారు.

## ప్రజల సౌకర్యార్థం పవర్ బోర్లు: జగదీష్ గౌడ్

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఓల్డ్ మల్కాజిగిరి, గాంధీ పార్క్‌లో నూతన పవర్ బోర్ ఎమ్మెల్యే సహకారంతో మంజూరు చేశారు. ఈ పవర్ బోర్‌ను ప్రజల సౌకర్యార్థం, పార్కులు అభివృద్ధి చేయడానికి ప్రారంభించడం జరిగిందని మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమం బస్తీ వాసులు మానెమ్మ, సువర్ణ, రాధిక, శోభ, అనురాధ, లలిత, జైలు, వసంత, కృష్ణవేణి, పద్మ, కేతన, నాగమణి, భాగ్య, పండన్న, నర్సింహ, సుదర్శన్ గౌడ్, మల్లేశం, శ్రీనివాస్, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు సుధాకర్ పాల్గొన్నారు.

## హరిప్రసాద్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి

**విశాలాంధ్ర-బషీర్ బాగ్:** నేరస్థులకు అండగా ఉంటూ, అరచకాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిన పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్ రెడ్డి తెలంగాణ పోలీస్ శాఖకు మాయని మచ్చ అని, అతనిని వెంటనే సస్పెండ్ చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ ఛైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్ రెడ్డి ఖాకీ డ్రస్ వేసుకొని క్రిమినల్ పనులు చేస్తున్నాడని, ఆయన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని, దొంగల ముఠాను ఏర్పాటు చేసుకొని దొంగతనాలు చేయించి అందులో వాటాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఓ చోరీ కేసులో రికవరీ చేసిన బంగారాన్ని కోర్టులో డిపాజిట్ చేయకుండా బాధితులకు ఫోన్ పే ద్వారా డబ్బులు వేసిందని, కోర్టులో అన్నీ డిపాజిట్ చేయము.. కొన్నే చేస్తాము అని బాధితులను బెదిరించి వారి వద్ద నుంచి డబ్బులు తీసుకుంటున్నాడని, దీనికి సంబంధించి కాల్ రికార్డింగ్స్ కూడా ఉన్నాయన్నారు. అదేవిధంగా నిందితుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు మా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. ఇలాంటి ఘటనల దృష్ట్యా తెలంగాణ డీజీపీ పెబ్బేరు ఎస్సై అరాచకాలు, అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఈ నెల 12 న ఫిర్యాదు చేశామన్నారు. ఈ నెల 13న పెబ్బేరులో ప్రజా సమస్యల కోసం మార్నింగ్ వార్నింగ్ నిర్వహించిన సమయంలో కొందరు ప్లాట్లు కొన్న బీసీ బాధితులు నా దగ్గరికి వచ్చారని, సర్వే నం. 455, 456లలో ప్రస్తుతం భూమే లేని కొందరు వ్యక్తులు ప్లాట్లు కొన్న బాధితులను ఇబ్బందులకు గురి చేసి వారి ప్లాట్ల రాళ్లను తొలగించారని, ఈవిషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని తమకు చెప్పగా, అక్కడికి వెళ్లి చూశామని,. దాన్ని ఆసరాగా తీసుకొని అక్రమార్కులతో పెబ్బేరు ఎస్సై కుమ్మక్కై బాధితులపై తనపై, అనుచరుల మీద మొత్తం 11 మందిపై ఎఫ్ఐఆర్ పెట్టి క్రిమినల్ కేసులు నమోదు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, వనపర్తి పట్టణ అధ్యక్షులు దేవర శివ, బాధితులు ఎల్లయ్య, శ్రీశైలం యాదవ్, రాజ గౌడ్, విష్ణు వర్ధన్, మధుసూదన్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అంజిరెడ్డికి రవికుమార్ యాదవ్ అభినందనలు

**విశాలాంధ్ర-శేరిలింగంపల్లి:** కరీంనగర్- నిజామాబాద్ - మెదక్-ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలుపొందిన శాసన మండలి సభ్యులు చిన్నమైల్ అంజిరెడ్డిని, వారి సతీమణి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డిని రామచంద్రపురంలోని వారి నివాసంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇంచార్జి రవికుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో భారతీయ జనతా పార్టీకి ప్రజలు మద్దతు గణనీయంగా పెరుగుతుందని, అందుకు నిదర్శనం మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో అంజిరెడ్డి, కొమరయ్య గెలుపెనని అన్నారు. రాష్ట్రంలో ప్రజాసమస్యలపై గళం విప్పేందుకు మరో రెండు గొంతుకలు కలిసాయన్నారు, అంజిరెడ్డి ఎప్పుడు పోరాటయోదులేనని, యువత తరఫున పోరాటం చేసి వారికి రావల్సిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చేలా చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో చందానగర్ డివిజన్ అధ్యక్షులు రాంరెడ్డి, భోపాల్ రెడ్డి, మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి సీతారామరాజు, మియాపూర్ డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్, సీనియర్ నాయకులు రాజిరెడ్డి,గణేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**విశాలాంధ్ర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా 2025 కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డులను ప్రదానం చేయుటకుగాను చేనేత కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. చేనేత కళాకారులు డిసెంబర్ 31,2024 నాటికి 30 సం. వయసు నిండి 10 సం. అనుభవం ఉండాలి. చేనేత డిజైనర్లు డిసెంబర్ 31,2024 నాటికి 25 సం. వయసు నిండి 5 సం. అనుభవం ఉండాలి. దరఖాస్తులు ఏప్రిల్ 15 లోగా ఆయా జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులకు సమర్పించాలి. మిగతా వివరాలకు www.handtex.telangana.gov.in లో పొందవచ్చని చేనేత, జౌళి శాఖ సంచాలకులు శైలజా రామయ్యర్ తెలిపారు.

## విద్యార్థులకు కళ్ల అద్దాల పంపిణీ

**విశాలాంధ్ర- అమనగల్లు :** అన్ని అవయవాల కంటే కళ్లు ప్రధానమని అందుకే సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్నారని, కళ్లను సంరక్షించుకోవాలని కందుకూర్ డివిజన్ డిప్యూటీ డిహెచ్ఓ డాక్టర్ గీత అన్నారు. మంగళవారం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పూనమ్ తో కలిసి పట్టణ కేంద్రంలోని కస్తూర్బా గాంధీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థులకు వైద్యారోగ్య శాఖ డాక్టర్ శ్రీకాంత్, సుజల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం కంటి సమస్య ఉన్న విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గీత మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని వివిధ పాఠశాలల్లో 5వ తరగతి నుంచి 12వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 350 మంది విద్యార్థులు కంటి సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించి విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. పిల్లలు ఎక్కువ మొబైల్ ఫోను, టీవీలో చూడడం బయట ఆడకపోవడం వల్ల దృష్టి బలహీనమవుతుందన్నారు. పౌష్టికాహారం సరిగ్గా తీసుకోవాలని, పరిశుభ్రత సరిగ్గా పాటించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులందరూ చదువుపై శ్రద్ధవహించి కష్టపడి చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఎంఎంఓ చంద్రశేఖర్, పాఠశాల ఎస్ఓ పద్మజ, సిబ్బంది అనిత, రహీం మరియు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బొగ్గు ఉత్పత్తి, రవాణా పెరగాలి : సీఎండీ

**విశాలాంధ్ర హైదరాబాద్ :** తెలంగాణ తోపాటు దేశ వ్యాప్తంగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని థర్మల్ విద్యుత్ కేంద్రాల డిమాండ్ మేరకు బొగ్గు ఉత్పత్తి, రవాణా పెంచాలని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అందరూ జీఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సింగరేణితో ఇంధన ఒప్పందం ఉన్న అన్ని విద్యుత్ కేంద్రాలకు రోజుకు కనీసం 50 రేకుల వరకు బొగ్గును రవాణా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రక్షణతో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిని పెంచాలని సూచించారు. అలాగే ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అన్ని గనుల్లోనూ వేసవి జాగ్రత్త చర్యలను పాటించాలన్నారు. ముఖ్యంగా చల్లటి నీటిని అందుబాటులో ఉంచడం, మజ్జిగ సరఫరాకు ఏర్పాట్లు చేసుకోవడం, రెస్టు షెల్టర్ల వద్ద కూలర్లను , అన్ని యంత్రాల్లో ఏసీ సరిగా పనిచేస్తుందా? లేదా? పరిశీలించాలన్నారు. రానున్న మూడు నెలల్లోనూ విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తి, రవాణాకు విఘాతం కలగకుండా అన్ని కాంట్రాక్టులను ఆమోదం తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఏడాది నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను ముందే చేరుకున్న కిష్టారం ఓసీ, పీకే ఓసీ-4, జీడీకే-5 ఓసీ, ఆర్జీ ఓసీ-2, ఆర్ కే -6 ఇంక్లైన్, ఆర్కే న్యూటెక్, ఎస్సార్పీ ఓసీ-2 గనుల అధికారులు, కార్మికులకు అభినందనలు తెలిపారు. కంపెనీ ఆస్తుల పరిరక్షణకు ఎస్టేట్స్, రక్షణ విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆక్రమణలు చేస్తున్న వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కంపెనీలో పనిచేస్తున్న ప్రతీ ఉద్యోగి కూడా భోజన విరామం మినహా మిగిలిన 8 గంటల సమయాన్ని పూర్తిగా కంపెనీ అభివృద్ధికి, ఉత్పత్తి లక్ష్యాల సాధనకు కృషి చేసేలా ప్రతీ ఒక్క అధికారి చైతన్య పరచాలని పునరుద్ఘాటించారు. డ్యూటీల విషయంలో నిర్లక్ష్యంగా ఉన్నా, మస్టర్ పడి బయట తిరుగుతున్నట్లు తెలిసినా వారిపై వెంటనే క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వాళ్లు ఎవరైనా సరే ఉపేక్షించొద్దన్నారు. కంపెనీ మరో వందేళ్లు మనుగడ సాగించాలంటే పని సంస్కృతి మరింత మెరుగవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్టీపీపీలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన కార్బన్ డై యాక్సైడ్ నుంచి మిథనాల్ తయారీ ట్రయల్ రన్ విజయవంతం అవడం పట్ల సీఎండీ హర్షం వ్యక్తం చేశారు. కొద్ది రోజుల్లోనే పూర్తిస్థాయిలో మిథనాల్ ఉత్పత్తి చేసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎం), ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు (పా, పి అండ్ పి), ఈడీ (కోల్ మూమెంట్) ఎస్ డి ఎం.సుభానీ, జీఎం(సీపీపీ) మనోహర్, జీఎం(మార్కెటింగ్) ఎస్.వి.రాజశేఖరరావు, అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.

## టీపీసీసీ లేబర్ సెల్ కార్యదర్శిగా నర్సింగ్‌రావు నియామకం

**విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్:** పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, చైర్మన్ రాంబాగ్ ప్రకాశ్ గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డికి టీపీసీసీ లేబర్ సెల్ కార్యదర్శిగా శరగడం నర్సింగ్‌రావుని నియమించిన సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కొలను హన్మంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ నర్సింగ్‌రావుని శాలువాతో సత్కరించి శు

భాకాంక్షలు తెలిపారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**విశాలాంధ్ర-దుండిగల్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు డా ఎస్ మల్లారెడ్డి, బిజెపి దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మండలం పరిధి బౌరంపేట్ గ్రామ రైతుల ఆవేదన మేరకు బౌరంపేట్‌లో భూములకు కంజర్వేషన్ జోన్ తొలగించాలని తెలంగాణ ప్రభుత్వానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు డా ఎస్ మల్లారెడ్డి సూచన మేరకు బిజెపి దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం దరఖాస్తులను వర్తింపజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు డా ఎస్ మల్లారెడ్డి మాట్లాడుతూ 2012 సంవత్సరంలో కిరణ్ కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి పాలనలో జోన్‌లు ఏర్పాటు చేసి రైతులకు వ్యతిరేకంగా నిర్ధారణ చేయడం జరిగిందని, రైతులకు అనుకూలంగా జోన్లు ఏర్పాటు చేయాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ 10 ఏండ్ల పాలనలో కేవలం డబ్బులు దండుకోవడం తప్ప ఈ సమస్యకు ఎలాంటి పరిష్కారం చూపకుండనే ముగిసిందని, రైతుల పంట పొలాల పక్కనే ఉన్న జోన్‌లో లేని బడా సంస్థలు, పెద్ద పెద్ద హై రైస్ అపార్ట్మెంట్లు నిర్మిస్తుంటే కంజర్వేషన్ జోన్ రైతులు వాటిని చూసి బిత్తరపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.అమ్ముకుంటే తగిన ధర రాకపోవడం, భవన నిర్మాణాలకు అనుమతులు రాక, ప్రభుత్వం నుండి పరిహారం లేక ఆవేదన చెందుతున్నరని వెల్లడించారు.అనంతరం మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కంజర్వేషన్ జోన్ తొలగించడానికి దరఖాస్తులు ఇవ్వమని చిన్న పిలుపు ఇవ్వడంతో ఒకే రోజు 200 కి పైగా దరఖాస్తులు రావడం జరిగిందని తెలిపారు.రేవంత్ రెడ్డి సర్కార్ కూడా మేడ్చల్ జిల్లా పరిధిలో అన్ని గ్రామాలలో రైతులకు రుణ మాఫీ, రైతు భరోసా ఇవ్వకుండా రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వెంటనే రైతు రుణమాఫీ, రైతు భరోసా కల్పించి బౌరంపేట్ గ్రామంతో పాటు మిగతా గ్రామాలు ఆర్ 1 జోన్‌లోకి మార్చాలని మేడ్చల్ బిజెపి తరపున తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు గోనె మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేశ్వర్,నల్ల రామచంద్రరెడ్డి, మల్లేష్ యాదవ్,సర్గారి సత్తిరెడ్డి,మాజీ ఎంపీటీసీ జంగారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి :రాంచందర్

**విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను ఉపయోగించుకొని ఎస్సీ వర్గ ప్రజలు సమాజంలో మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించు కొనెందుకు, ఆర్థిక ప్రయోజనాన్ని పొందే విధంగా అవగాహన కల్పించాలని షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు విచ్చేసిన షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్‌కు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వీసీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి జాతీయ కమీషన్ డైరెక్టరు జి.సునీల్ కుమార్‌తో కలిసి కమీషన్ సభ్యులు వడ్డెపల్లి రాంచందర్ హాజరయ్యారు. షెడ్యూల్డ్ కులాలకు హక్కుల పరిరక్షణ చట్టం, ఎస్సీలు నిరాదరణకు గురైన సందర్భంలో అనుసరించాల్సిన విధివిధానాలు, బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం కోసం రూపొందించిన చట్టాల అమలు తీరును కమీషన్ సభ్యులు శాఖల వారిగా సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీ, వడ్డీ లేని రుణాల పథకాలు ఎస్సీ వర్గాలకు అందేలా ప్రజలలో అవగాహన కల్పించే విధంగా ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళలకు ప్రభుత్వం అందించే ఎక్కువ సబ్సిడిరుణాల గురించి ఎస్సీ మహిళలకు అవగాహన కల్పించి పారదృకత పాటిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. పరిశ్రమల శాఖ ద్వారా స్వయం ఉపాధికై చిన్న కుటీర పరిశ్రమలు నెలకొలిపేందుకు ఔత్సాహిక యువతను ప్రేరేపించాలని సభ్యులు సూచించారు. ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ హాస్టళ్లలో విద్యార్థులకు మెను చార్ట్ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారా అని సభ్యులు అడిగి తెలుసుకున్నారు. సభ్యులు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందించే పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిపుల ద్వారా జిల్లాలో ఎంత మంది విద్యార్థులు చదువుకుం టున్నారని ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మెడిసిన్, ఇంజనీరింగ్ విద్యార్థులకు అందించే స్కాలర్ షిప్పులు ఆలస్యమైనట్లయితే విద్యార్థుల అడ్మిషన్‌లలో ఇబ్బంది కలుగకుండా కాలేజీల యాజమాన్యానికి, స్కాలర్ షిప్ ద్వారా ఫీజు చెల్లిస్తామని లిఖితపూర్వకంగా లేఖలను అందజేయాలని ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారికి సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలపై ప్రజలలో అవగాహన లేకుండా పోతుందని,ఈ పథకాలపై ప్రజలలో అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సభ్యులు సూచించారు. అట్రాసిటి కేసులలో ఎఫ్ఐఆర్ బుక్ చేసి బాధితులకు అందించే ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించి వారికి న్యాయం జరిగేలా చూడాలని పోలీసు అధికారులను సూచించారు. ఎక్సైజ్ శాఖ ద్వారా మద్యం దుకాణాలు ఎస్సీ వర్గాలకు కేటాయించిన వాటిని ఎస్సీలకు మాత్రమే అందించాలని, వారు ఇతరులకు అమ్ముకుంటే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు జిల్లాలో అమలవుతున్న పథకాలలో ఎస్సీలకు అందించే వివరాల శాతాలను జాబితాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు కమీషన్ సభ్యులు వడ్డెపల్లి రాంచందర్‌కు వివరించారు. ముందుగా కమీషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ పోలీసు వందనం స్వీకరించారు. అనంతరం షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్, జాతీయ కమీషన్ డైరెక్టరు జి.సునిల్ కుమార్లను జిల్లా కలెక్టరు గౌతం శాలువ, మెమెంటోలతో సత్కరించారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి, మెడ్చల్ డి.సి పిలు పద్మజ, కోటిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, ఆర్డిఓలు శ్యాంప్రకాష్, ఉపేందర్ రెడ్డి, ఏసిపిలు, పోలీసు శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని వినతి

**విశాలాంధ్ర, హైదరాబాద్ :** జాబ్ క్యాలెండర్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయకుండా తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ), రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నిరుద్యోగులను మోసం చేయడాన్ని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర తెలిపారు. జాబ్ క్యాలెండర్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయంలో చైర్మన్ బుర్రా వెంకటేశంకు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన ఏఐవైఎఫ్ నేతలను లోపలికి అనుమతించ లేదు, పోలీసులతో వాగ్వాదం జరగగా, చివరకు ఇన్వార్డ్‌లో ఇవ్వడం జరుగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లక్కంటి శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ రూపంలో ఒక అభయాన్ని ఇచ్చిందన్నారు. కానీ, ఆచరణలో రకరకాల కారణాలతో జాబ్ క్యాలెండర్ అమలును కాలయాపన ద్వారా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. నిండు అసెంబ్లీలో గత ఏడాది ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయలేదని, పరీక్షలు నిర్వహించలేదన్నారు. ల్యాబ్ టెక్నీషియన్లు-సెప్టెంబర్ 2024, ట్రాన్స్‌కో, జెన్కో ఉద్యోగాలు అక్టోబర్-2024, గెజిటెడ్ క్యాటగిరి ఇంజనీరింగ్ సర్వీసెస్ అక్టోబర్-2024, ఫారెస్ట్ ఆఫీసర్స్ అక్టోబర్ 2024, గెజిటెడ్ స్కేల్ అదర్ సర్వీసెస్ జనవరి-2025, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ ఫిబ్రవరి-2025, ఎస్సై, కానిస్టేబుల్స్ పరీక్షలు నిర్వహణ చేయలేదన్నారు. ఒకవైపు ఎస్సీ వర్గీకరణ, మరోవైపు బీసీ రిజర్వేషన్ల పెంపు ఈ రెండింటిని కారణంగా చూపడం అసలు సరైంది కాదన్నారు. వాస్తవానికి టీజీపీఎస్సీకి ఇవి రెండూ కూడా అసలు అడ్డంకులే కావని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఒకవైపు పోటీ పరీక్షల కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల లక్షలాది మంది నిరుద్యోగులు హైదరాబాద్‌కు తరలివచ్చి కోచింగ్ కోసం ఎదురుచూస్తున్నా, టీజీపీఎస్సి స్పష్టమైన వైఖరి కనబర్చడంలేదన్నారు. మరోవైపు ఉన్నతమైన ఉద్యోగాలను సాధించేందుకు ప్రభుత్వ ఉద్యోగులు సెలవులు పెట్టుకొని కొత్త నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగుల కోసం కనీసం జాబు క్యాలెండర్ ప్రకారం ఏ తేదీన ఏ నోటిఫికేషన్ ఇస్తారో అనే విషయాన్ని ప్రభుత్వం , టీజీపీఎస్సీ ఏది కూడా ప్రకటించడం లేదని ఆరోపించారు. ఎంతో ఆశతో ఎదురుచూసే నిరుద్యోగులకు ప్రభుత్వం టీజీపీఎస్సీ ఇచ్చిన జాబ్ క్యాలెండర్ ప్రకారం తప్పకుండా నోటిఫికేషన్ వివరాలను ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరుద్యోగులను సమీకరించి ఉద్యమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. టీజీపీఎస్సి సమస్యల వినతికి ప్రాధాన్యత ఇవ్వాలని గత ప్రభుత్వపు అప్రజాస్వామిక పోకడలను అనుసరించొద్దని, ఆంక్షలతో ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్య ప్రసాద్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్. బాలక్రిష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, కార్యవర్గ సభ్యులు మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, వంశి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకంతో యువతకు ఉపాధి

**విశాలాంధ్ర- అమనగల్లు:** కడ్తాల్ మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అర్హులైన అన్ని వర్గాల నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పన కొరకు రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన లబ్దిదారులకు లక్ష నుంచి 4 లక్షల వరకు రుణం పొందవచ్చన్నారు. గత ప్రభుత్వంలో పది సంవత్సరాలుగా బిఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క వర్గానికి మేలు చేయలేదని విమర్శించారు. ఈ పథకం ద్వారా అన్ని వర్గాల నిరుద్యోగులకు అనేక విధాలుగా మేలు జరుగుతుందని నిరుద్యోగిత శాతం కూడా తగ్గుతుందన్నారు. ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. రాష్ట్రంలోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రజా సంక్షేమ పాలన నడుస్తుందని అన్నారు.ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, మండల అధ్యక్షులు బోసు రవి, టౌన్ అధ్యక్షులు భానుకిరణ్, నాయకులు ఎర్రోళ్ల శ్రీకాంత్, సాయి గౌడ్, గంట నరేష్, ఆకాశ్ గౌడ్, రమేష్ నాయక్, మొగిళ్ళ మహేష్, తులసిరాం, శ్రీకాంత్ రెడ్డి, కర్రోల్ల రమేష్, గురిగల్ల రామకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## క్వార్టర్ భోజనం అందిస్తున్న పావ్వా

**విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ :** హైదరాబాద్‌లోని భోజన ప్రియులకి ప్రత్యేక ఆహార పానీయాలు అందించే పావ్వా తమ నూతన ఆలోచనతో 'క్వార్టర్ కల్చర్' అనే భోజనం తీసుకురావడం జరిగింది. దీనివల్ల భోజన ప్రియులు అధిక మోతాదులు, అలాగే అధిక ఖర్చులు కాకుండా నూతన భోజనంని ఆస్వాదించడం అలాగే తక్కువ తినే వారు తక్కువ పానీయాలు స్వీకరించే వారికి ఈ ఆలోచనతో ప్రవేశ పెట్టడం జరిగింది అని అందుకే క్వార్టర్ కల్చర్ అందుబాటు ధరలో ఉండడం ఓ ప్రత్యేకం అని పావ్వా వ్యవస్థాపకుడు సంజయ్ కుమార్ రెడ్డి మూల అన్నారు. ఇందులో అందించే ఆహారం క్వార్టర్, ఆఫ్, ఫుల్ మెనూలో శాఖాహారం, మాంసాహారం ఇంకా వివిధ రకాల మెనూలో అందించడం ముఖ్యంగా ఒకరు, ఇద్దరుకి సరిపడ్డ తినేవారికి క్వార్టర్‌తో అమితమైన, విశిష్టమైన ఆహారాన్ని ఆస్వాదించవచ్చని అన్నారు. కొంపని హాస్పిటాలిటీ సహ వ్యవస్థాపకుడు సోంబీర్ మాట్లాడుతూ తాము ప్రవేశపెడుతున్న కొత్త మెనూ అందరికీ నచ్చుతుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పావ్వా ఎగ్జిక్యూటివ్ చెఫ్ కేతావత్ గోవింద్ మాట్లాడుతూ అన్ని రకాల ఆహారమని, పానీయాలని అందించడం మా ప్రత్యేకతని మార్చి 21 నుంచి ఈ కొత్త మెనూని ప్రవేశపెడుతున్నామని భోజన ప్రియులు తమ ప్రవేశపెడుతున్న ఆహారం ఆస్వాదించవచ్చని అన్నారు.

## వాహనాలు తనిఖీ

**విశాలాంధ్ర- హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంకటగిరి వాటర్ ట్యాంక్ ఆఫీస్‌లో వాటర్ ట్యాంకర్ మేనేజర్ వెంకటేష్ అలాగే జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్సై గోపి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇందులో ముఖ్యంగా వాటర్ ట్యాంకర్ డ్రైవర్స్ వాహనాల ఫిట్నెస్, డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు ఇన్సూరెన్స్ పత్రాలు తనిఖీ చేశారు. ట్యాంకర్ అసోసియేషన్ అధ్యక్షుడు టిడిపి ఇన్చార్జ్ జీవిజి నాయుడు ఈ కార్యక్రమంలో హాజరై వాటర్ ట్యాంకర్స్ డ్రైవర్ ఎదుర్కొంటున్న సమస్యలను మేనేజర్ కి వివరించడం జరిగింది. ముఖ్యంగా వాటర్ ట్యాంకర్స్ వల్ల తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్న ప్రజలు రోడ్ నెంబర్ 10 నుంచి వచ్చే న్యారో రోడ్డు పావని ఈక్వినాక్స్ దగ్గర మలుపులో రాకుండా గట్టిగా డ్రైవర్స్‌కి హెచ్చరించడం జరిగిందని ఈ సందర్భంగా జూబ్లీహిల్స్, వాటర్ ట్యాంక్ మేనేజర్ వెంకటేష్ అన్నారు. గతంలో ఇక్కడ మైనర్లు వాటర్ ట్యాంక్ నడిపే వారని, తాను వచ్చాక ఈ సమస్యని శాశ్వతంగా పరిష్కరించడం, ఇప్పుడు వాటర్ ట్యాంకర్ల కదిలికపైన ప్రత్యేకంగా నిఘా పెట్టడం జరిగిందన్నారు. ఎవరైనా అడ్డదారిలో వాహనాలు నడిపి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వాటర్ ట్యాంకర్స్ ఫిల్లింగ్ ఇంచార్జ్ జి. దేవేందర్, వాటర్ ట్యాంకర్ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు మొదలైన వారు పాల్గొన్నారు.

## హౌసింగ్ సొసైటీ కమిటీ పై ఛార్జ్ షీట్ దాఖలు చేయడంపై హర్షం



**విశాలాంధ్ర, హైదరాబాద్ :** చిత్రపురిలో దాదాపుగా రూ.300 కోట్ల భూముల కుంభకోణం, ఫ్లాట్ల కుంభకోణం, 449 సభ్యత్వాల టాంపరింగ్, 189 మార్ఫింగ్ ఆలోట్మెంట్స్, ఫోటోలు లేని 220 సభ్యులు, 336 అక్రమ రిజిస్ట్రేషన్‌లు జరిగినట్టుగా ప్రభుత్వమే ధ్రువీకరించిన నేపథ్యంలో ఆర్థిక నేరాల విభాగానికి (ఎకనామిక్ ఆఫెన్స్ వింగ్) చెందిన సైబరాబాద్ పోలీసులు ఇప్పటికే 12 ఛార్జ్ షీట్‌లు ఎల్.బి.నగర్ కోర్టులో సి.సి.నెం/ 1061/2025, 1060/25, 129 /25, 723/25, 712/25, 709/25 తదితర కేసులు నమోదు చేసి చిత్రపురి హౌసింగ్ సొసైటీ కమిటీపై 12 కేసులు ఛార్జ్ షీట్ దాఖలు చేయడంపై చిత్రపురి సాధన సమితి అధ్యక్షులు కస్తూరి శ్రీనివాస్, ప్రజానాట్యమండలి సినిమా శాఖ కార్యదర్శి మద్దినేని రమేష్‌లు హర్షం వ్యక్తం చేశారు. బెయిల్ కండిషన్స్ దిక్కరణ విషయంలో సుప్రీం కోర్ట్ స్పెషల్ లీవ్ పిటీషన్‌ని తిరస్కరించిన తర్వాత, ఇప్పటికే చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్ గత 20 రోజుల నుండీ చర్లపల్లి జైలులో ఉన్నాడని, ఈ సమయంలో మరో 12 కేసులు ఛార్జ్ షీట్ కావటం, చిత్రపురి అక్రమార్కులు చేసిన అన్నీ కుట్రలు వెలుగులోకి వస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వల్లభనేని అనిల్ కుమార్‌పై ఇంకా కఠిన చర్యలు తీసుకొని సినీ రంగానికి చెందిన అర్హులైనవారికి ఫ్లాట్‌లు, ఫ్లాట్‌లు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ఖనిజ సంపద కార్పొరేట్ల పరం

## 'ఆపరేషన్ కగార్' లక్ష్యం అదే
### సామాజికవేత్త హరగోపాల్

**విశాలాంధ్ర – విశాఖ:** అడవుల్లో ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టేందుకే 'ఆపరేషన్ కగార్' అని ప్రముఖ సామాజికవేత్త ఆచార్య జి.హరగోపాల్ అన్నారు. ఆదివాసీలపై జరుగుతున్న దమనకాండను నిలుపుదల చెయ్యాలని డిమాండ్ చేస్తూ... సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యాన విశాఖ పౌర గ్రంథాలయంలో మంగళవారం "ఆపరేషన్ కగార్ లోగుట్టు..."పేరుతో సదస్సు జరిగింది. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగిన సదస్సులో హరగోపాల్ మాట్లాడుతూ ఎవరు వ్యతిరేకించినా రాష్ట్రంలోని ఖనిజాల తవ్వకాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తామని చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి ఒక ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారని, దీన్ని బట్టి ప్రభుత్వాల ఆంతర్యం అర్థమవుతోందని తెలిపారు. మావోయిస్టుల ఏరివేత పేరుతో బస్తర్ ప్రాంతంలో పోలీసు దళాలు దమనకాండ సాగిస్తున్నాయన్నారు. ఆపరేషన్ కగార్ ఒక్క బస్తర్ ప్రాంత సమస్య కాదని దేశం మొత్తానికి సంబంధించిందని చెప్పారు. దేశంలో అభివృద్ధి నమూనా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు. సంపద కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమవుతోందని, అభివృద్ధిలో సమానత్వం లేదని తెలిపారు. ఆదివాసీ ప్రాంతాల్లో కొన్ని ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, ఆ మేరకు ఆదివాసీల వ్యతిరేకతతో వేదాంత కంపెనీ వెనక్కి వెళ్ళిపోయిందని గుర్తు చేశారు. తమ సంస్కృతిని ధ్వంసం చేయడాన్ని ఆదివాసీలు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించరన్నారు. స్వాతంత్రోద్యమంతో పాటు అనేక పోరాటాల్లో పాల్గొన్న చరిత్ర ఆదివాసీలకు ఉందన్నారు.

**పోలీస్ అకృత్యాలపై న్యాయవిచారణ జరపాలి: వీఎస్ కృష్ణ**

మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు వీఎస్ కృష్ణ మాట్లాడుతూ మావోయిస్టు ఉద్యమం విషయంలో రాజకీయ పరిష్కారంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టడం లేదన్నారు. రాజ్యాంగంలో సక్రమించిన హక్కులు, ప్రభుత్వాలు చేసిన భూ సంస్కరణల వంటి చట్టాలను అమలు చేస్తే మావోయిస్టుల సమస్య ఉత్పన్నం కాదన్నారు. మావోయిస్టులపై ప్రజల హక్కులకు లోబడి పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. 2005లో సల్వాజుడుంని తీసుకొచ్చి విధ్వంసానికి పాల్పడ్డారని, హక్కుల సంఘాల పోరాటంతో 2011లో కోర్టు సల్వాజుడుం రాజ్యాంగ విరుద్ధమని ఇచ్చిన తీర్పుతో దాన్ని రద్దు చేశారన్నారు. ఆ తరువాత గ్రీన్ హంట్, ప్రస్తుతం ఆపరేషన్ కగార్ ల పేరుతో మావోయిస్టులను బూటకపు ఎన్ కౌంటర్లు చేస్తున్నారన్నారు. 2009లో గిరిజనులతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డిఆర్జీ) ఏర్పాటు చేశారని, తాజాగా మహిళా విభాగాన్ని కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. పోలీసుల చేతుల్లో అనేకమంది సామాన్య ఆదివాసి ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ఛత్తీస్‌గఢ్ బస్తర్ ప్రాంతంలో విలువైన ఎన్నో ఖనిజాలు ఉన్నాయని వాటిని కొల్లగొట్టడమే ప్రభుత్వాల లక్ష్యమన్నారు. ప్రజల హక్కులకు విఘాతం కలుగుతోందని దీనికోసం జాతీయ స్థాయిలో సివిల్ సొసైటీ అవసరమని అభిప్రాయపడ్డారు. పోలీసుల అకృత్యాలపై న్యాయవ్యవస్థ పర్యవేక్షణలో విచారణ జరపాలన్నారు. బస్తర్ ప్రాంతంలో ఖనిజాల తవ్వకాలకు కుదుర్చుకున్న అన్ని ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

**వనరుల దోపిడీకే రహదారుల నిర్మాణం: జేవీఎస్ మూర్తి**

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా పెద్ద ఎత్తున రహదారులు నిర్మిస్తున్నారని, వనరుల దోపిడీకి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రాజమండ్రి నుంచి విజయనగరం వరకు ఆదివాసీ ప్రాంతాల మీదుగా నాలుగు లైన్ ల రహదారిని నిర్మించబోతున్నారని చెప్పారు. కనీస మౌలిక వసతులు కల్పించకుండా భారీ రహదారులు ఎందుకని ప్రశ్నించారు? జమ్మూ కశ్మీర్లో ఆర్టికల్ 370 రద్దు తరువాత 2.40 లక్షల ఎకరాలు భూములు అన్యాక్రాంతమైనట్టు ముఖ్యమంత్రి ప్రకటించారని... వాటిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారన్నారు.. మణిపూర్ లో 30 వేల ఎకరాలను అదానీకి కట్టబెట్టారని, జాతుల మధ్య ఘర్షణ సృష్టించి ఒక తెగను అక్కడి నుంచి తరిమేయాలని చూస్తున్నారన్నారు. ఈ సదస్సులో పర్యావరణవేత్త గంజివరపు శ్రీనివాస్, ఆదివాసీ హక్కులనేత రామారావు దొర తదితరులు ప్రసంగించారు. సీపీఐ సీనియర్ నాయకుడు, పూర్వ శాసనసభ్యులు మానం ఆంజనేయులు, ప్రముఖ న్యాయవాది కల్యాణ రామారావు, వామపక్ష నేతలు ఎం పైడిరాజు, వై కొండయ్య, డీ లలిత, ఎ విమల, పద్మ, ఎం లక్ష్మి, ఎం.వెంకటేశ్వర్లు, జీఎస్‌జే అచ్యుతరావు, కే సత్యనారాయణ, ఎస్కే రెహమాన్, పి.చంద్రశేఖర్, ఎం.మన్మథరావు, సీఎస్ క్షేత్రపాల్ రెడ్డి, జి.రాంబాబు తదితరులతో పాటు వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభ్యుదయ వాదులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమాలకు భద్రాద్రి ఆదర్శం: రాజా

**విశాలాంధ్ర బ్యూరో-కొత్తగూడెం:** నిరంతరం ప్రజా ఉద్యమాలతో ప్రజల్లో మోమేకమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆదర్శనీయమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే పార్టీలకు, నాయకులకు ఆదరణ ఎప్పుడూ ఉంటుందన్నారు. రాజా మంగళవారం జగదల్పూరు నుంచి కొత్తగూడెం మీదుగా విజయవాడ వెళ్లే క్రమంలో భద్రాద్రి జిల్లాలోని సీపీఐ కార్యాలయం శేషగిరి భవన్‌ను సందర్శించారు. జిల్లాలోని రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబిర్ పాషా నాయకత్వంలో సీపీఐకి ప్రజాదరణ మెండుగా ఉండటం హర్షణీయమన్నారు. కమ్యూనిస్టు పార్టీకి అనేక మంది జాతీయ స్థాయి నాయకులను ఉమ్మడి ఖమ్మం జిల్లా అందించిందని అన్నారు. ప్రజా గొంతుకను వినిపించే నేతలను చట్టసభలకు పంపిందని తెలిపారు. కూనంనేని సాంబశివరావు పార్టీ విస్తరణకు దశబ్దాలుగా కృషి అభినందనీయమన్నారు. ప్రజా ప్రతినిధిగా ఆయన ప్రజల సమస్యల పరిస్కారం కోసం నిబద్ధతతో పనిచేస్తారని ప్రశంసించారు. జిల్లాలోని పోడుభూముల సమస్యపై, పేదలకు ఇళ్ల స్థలాలు... రైతాంగ, కార్మిక సమస్యల కోసం సీపీఐ బలమైన ఉద్యమాల ఫలితంగానే కూనంనేని భారీ మెజారిటీతో ఎమ్మెల్యే కాగలిగారని రాజా అన్నారు. సీపీఐ శత వసంతులు పూర్తి చేసుకున్న క్రమంలో డిసెంబర్ 26వ తేదీ వరకు దేశవ్యాప్తంగా ఉత్సవాలు జరుపుతామని, జాతీయ, రాష్ట్ర స్థాయి సభలు, సమావేశాలు నిర్వహిస్తామని రాజా తెలిపారు. ఆయన వెంట సీపీఐ కార్యదర్శి రామకృష్ణ పాండా ఉన్నారు.

# మోదీ హయాంలో పెరిగిన నిరుద్యోగం

### వైఎఫ్ జాతీయ మహాసభల లోగో ఆవిష్కరణలో నారాయణ

**విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్):** అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జాతీయ మహాసభలు మే 15 నుండి 18 వరకు తిరుపతిలో జరగబోతున్నాయని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ కార్యదర్శి, ఆహ్వానసంఘం చైర్మన్ డాక్టర్ కె.నారాయణ పిలుపునిచ్చారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ మహాసభల లోగోను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ ఆది నుంచీ అటుపోట్లు ఎదుర్కొన్న ఏఐవైఎఫ్ వయోజనులకు ఓటు హక్కు సాధించిందని గుర్తుచేశారు. 'జాబ్ ఆర్ జైల్', 'సేవ్ ఇండియా... ఛేంజ్ ఇండియా' నినాదాలతో ఉద్యమాలు కొనసాగించిందని చెప్పారు. అవినీతి, అరాచకం, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడుతోందని. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం, ప్రకృతి సంపద ప్రజలకే దక్కాలనే సమున్నత ఆశయాలతో సమరశంఖం పూరించిందని నారాయణ చెప్పారు. యువతను నిర్వీర్యం చేస్తోన్న మద్యం, మాదక ద్రవ్యాలు, ఇతర సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు సాగించిందన్నారు. సామాజిక చైతన్యం, శాస్త్రీయ దృక్పథం వంటి ఉన్నత ఆలోచనా విధానాలతో ముందుకు సాగుతోందన్నారు. మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చి దశాబ్దకాలం గడిచినా ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగం హామీ అమలు చేయలేదని నారాయణ విమర్శించారు. పైగా దేశంలో నిరుద్యోగం తీవ్రమైందన్నారు. దేశంలో ఐదు కోట్ల మంది నిరుద్యోగులుండగా, మరో ఐదు కోట్ల మంది చాలీచాలని వేతనాలతో బతుకీడుస్తున్నారన్నారు. ప్రభుత్వరంగ సంస్థల్లో 45 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉండగా, ఒక్క రైల్వేలోనే నాలుగు లక్షల ఖాళీలున్నాయని చెప్పారు. బ్యాంకింగ్ రంగంలో రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య మాట్లాడుతూ పేదరికం, నిరుద్యోగ నిర్మూలన హామీలకే పరిమితమయ్యాయని విమర్శించారు. దళిత, గిరిజన ప్రజల్లో అభద్రతా భావం పెరిగిందన్నారు. మతం పేరుతో దేశంలో అల్లర్లు సృష్టిస్తున్నారన్నారు. ఓ వైపు దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెడుతూ వికసిత్ భారత్–2047 అంటూ మోదీ సర్కారు ప్రచారం చేసుకుంటుందని ఆరోపించారు. ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్, ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర బాబు, వైఎఫ్ నాయకులు వై.బాబి, ఎస్‌కే సుభానీ, చర్ల గీత, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి, నాయకులు లంకా గోవిందరాజులు, సింగంశెట్టి మోహన్‌ప్రసాద్, గాడి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## 146 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో 146 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ మంగళవారం నోటిఫికేషన్ జారీజేసింది. డీఎంఈ పరిధిలో డైరెక్ట్, లేటరల్ ఎంట్రీ ద్వారా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఈనెల 26న వాకిన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అర్హతలు, ఇతర వివరాల కోసం https://dme.ap.nic.in వెబ్ సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

## గత జన్మలో మోదీ ఛత్రపతి శివాజీ
### బీజేపీ ఎంపీ ఉన్మాదం

**న్యూఢిల్లీ:** మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ మహారాజ్, మొఘల్ పాలకుడు ఔరంగజేబు అంశంపై వివాదాలు నడుస్తున్న వేళ బీజేపీ ఎంపీ ఒకరు దీనికి ఆజ్యం పోసేలా వ్యాఖ్యలు చేశారు. ఒడిశాలోని బార్‌గఢ్‌కు చెందిన బీజేపీ ఎంపీ ప్రదీప్ పురోహిత్ మంగళవారం లోక్‌సభలో మాట్లాడుతూ ప్రధాని మోదీ గత జన్మలో మరాఠా చక్రవర్తి ఛత్రపతి శివాజీ మహారాజ్ అని అన్నారు. ఎంపీ చేసిన ఈ ప్రకటన కలకలం సృష్టించింది. ఎంపీ ప్రదీప్ పురోహిత్ మాట్లాడుతూ తాను ఇటీవల ఒక సాధువును కలిశానని, ఆయన గత జన్మలో మోదీ ఛత్రపతి శివాజీ మహారాజ్ అని తనకు చెప్పారని ఆయన పేర్కొన్నారు. మోదీ మహారాష్ట్ర సహా మొత్తం దేశాన్నంతటినీ పురోగతి వైపు తీసుకెళ్లడానికి పునర్జన్మ తీసుకున్నారని ప్రదీప్ పురోహిత్ అన్నారు. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ సహా ప్రతిపక్ష సభ్యులు వ్యతిరేకించారు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్య కారణంగా ఎవరి మనోభావాలైనా దెబ్బతిన్నట్లయితే... దానిని రికార్డుల నుండి తొలగించినట్లుగా పరిగణించాలని కోరారు. కాంగ్రెస్ ఎంపీ వర్ష గైక్వాడ్... ప్రదీప్ పురోహిత్ ప్రకటనను విమర్శిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.. ఇలాంటివారు నరేంద్ర మోదీ తలపై ఛత్రపతి శివాజీ మహారాజ్ కిరీటాన్ని ఉంచడం ద్వారా శివాజీ మహారాజ్‌ను తీవ్రంగా అవమానించారన్నారు. అవిభక్త భారతదేశ పూజ్య దైవం, ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను పదేపదే అవమానించడానికి ప్రయత్నిస్తూ, శివాజీ మహరాజ్ గుర్తింపును దెబ్బతీసేందుకు బీజేపీ నాయకత్వం ప్రణాళికాబద్ధంగా ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు.

# క్రీడలకు పునర్వైభవం

### శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు
### ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్రీడా పోటీలు ప్రారంభం



**విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్:** శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులకు ఆటవిడుపు కల్పించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం క్రీడా పోటీలను నిర్వహిస్తోందని రాష్ట్ర శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్రీడా పోటీలను విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మంగళవారం మంత్రులు, ఉపసభాపతి కె.రఘురామ కృష్ణరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు రోజూ బిజీగా ఫోన్ మాట్లాడుకుంటారని, కనీసం ఈ 3 రోజులైనా మొబైల్ ఫోన్‌ను పక్కనపెట్టి క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. ప్రజాప్రతినిధులకు ఈ క్రీడా పోటీలు కొత్త సంప్రదాయం కాదని, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హయాంలోనే ఎమ్మెల్యేల క్రీడలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో ప్రజాప్రతినిధుల క్రీడలు మరుగున పడిపోయాయని అన్నారు. ప్రజాప్రతినిధుల క్రీడలతో ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం కోలాహలంగా మారిందని తెలిపారు. రాష్ట్రంలో క్రీడలకు పూర్వవైభవం చేకూరేలా అందరూ సహకరించాలన్నారు. అసెంబ్లీ మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించి, 2 గంటల తరువాత క్రీడల్లో పాల్గొంటామని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల్లో కూడా ఎంతో మంది జాతీయ క్రీడాకారులు ఉన్నారని అన్నారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో కృషి చేయాలని కోరారు. క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడా ప్రోత్సాహకాలు పెంచిందన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రంలో క్రీడాకారులకు మంచి అవకాశాలు వచ్చాయని తెలిపారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో ప్రతిష్ఠాత్మకంగా ప్రజాప్రతినిధుల క్రీడల నిర్వహణ చేపట్టామని, పాత సాంప్రదాయానికి నాంది పలికినట్లు తెలిపారు. క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, క్రీడల కమిటీ సహకారంతో పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పోటీలను శాప్ అధ్వర్యంలో చేపట్టడం సంతోషంగా ఉందని తెలిపారు. తొలుత మంత్రులు, చీఫ్ విప్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు క్రీడా జ్యోతిని వెలిగించి మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. కాగా, మంత్రి సంధ్యారాణి-మంత్రి అనిత టీమ్ మధ్య టగ్ ఆఫ్ వార్ పోటీ జరిగింది. ఈ పోటీలో సంధ్యారాణి టీమ్ గెలిచింది. అలాగే మహిళా-పురుష ప్రజాప్రతినిధుల మధ్య నిర్వహించిన టగ్ ఆఫ్ వార్ పోటీలో మహిళా ప్రజాప్రతినిధుల టీమ్ విజయం సాధించింది. క్రికెట్‌లో సీఎం, స్పీకర్ టీమ్‌లు పోటీ పడ్డాయి. వాలీబాల్, షటిల్ తదితర పోటీలు కూడా నిర్వహించారు.

## ఏపీ అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఫోటో సెషన్

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఏపీ అసెంబ్లీ ఆవరణలో మంగళవారం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వేరువేరుగా ఫోటో సెషన్ నిర్వహించారు. మొదటి వరుసలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు,మంత్రులు పాల్గొన్నారు. సీనియారిటీ ప్రకారం ఎమ్మెల్యేలు 2,3,4 వరుసల్లో కూర్చున్నారు. అనంతరం ఎమ్మెల్సీల ఫోటో సెషన్ జరిగింది. ఇందులో సీఎం, డిప్యూటి సీఎం, మండలి చైర్మన్ మోషేన్ రాజు, డిప్యూటి చైర్మన్, ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మంత్రులు పాల్గొన్నారు. కాగా, అసెంబ్లీ వద్ద డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పలకరించారు. ఎమ్మెల్యేలు ఫోటో సెషన్ ముగించుకుని వెళుతున్న సమయంలో వైసీపీ ఎమ్మెల్సీలు ఎదురొచ్చారు. ఈ క్రమంలో పవన్‌ను ఎలా ఉన్నారు... బాగున్నారా అని బొత్స పలకరించారు. ఈ సందర్భంగా నేతలు ఇద్దరూ కరచాలనం చేసుకున్నారు.

# కార్మిక కోడ్లు, ప్రైవేటీకరణ వద్దు

### కేంద్ర కార్మిక సంఘాల డిమాండ్
### రెండు నెలల ప్రచారోద్యమం - మే 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపు

**న్యూఢిల్లీ:** కార్పొరేట్ అనుకూల, కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ, నిరుద్యోగం, పేదరికం, అసమానతలను పెంచేసిన కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటానికి కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. శ్రామికుల కష్టాలను పట్టని సర్కార్ మెడలు వంటి తమ డిమాండ్లు సాధించుకోవాలని సంకల్పించాయి. నాలుగు కార్మిక కోడ్‌లను బేషరతుగా ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు అప్పగించడంపై వెనక్కు తగ్గాలని ఉమ్మడిగా డిమాండ్ చేశాయి. న్యూఢిల్లీలోని ప్యారే లాల్ భవన్‌లో జరిగిన కార్మిక జాతీయ సదస్సు సందర్భంగా ప్రజలు, కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను తిప్పికొట్టాలని ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, ఎస్‌ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీ తీర్మానించాయి. ఉమ్మడి పోరాటానికి సంకల్పిస్తూ మే 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. అంతకుముందు రెండు నెలల పాటు ప్రచారోద్యమాన్ని చేపట్టేలా నిర్ణయించాయి. సదస్సులో అమర్‌జీత్ కౌర్ (ఏఐటీయూసీ), అశోక్ సింగ్ (ఐఎన్‌టీయూసీ), హర్భజన్ సింగ్ (హెచ్‌ఎంఎస్), తపన్ సేన్ (సీఐటీయూ), హరీశ్ త్యాగి (ఏఐయూటీయూసీ), కె.ఇందు ప్రకాశ్ మెనన్ (టీయూసీసీ), లతా బేన్ (ఎస్‌ఈడబ్ల్యూఏ), రాజీవ్ దిమ్రీ (ఏఐసీసీటీయూ), జవహర్ ప్రసాద్ (ఎల్‌పీఎఫ్), అశోక్ ఘోష్ (యూటీయూసీ) ప్రసంగించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ఇక చాలు అంటూ ఐక్యంగా గళం వినిపిద్దాం.. మే 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం అని నాయకులు పిలుపునిచ్చారు. కార్మిక కోడ్‌లను రద్దు విషయంలో రాజీ లేని పోరాటం చేద్దామన్నారు. నయా ఉదారవాద వినాశకార విధానాలకు ప్రత్యామ్నాయంగా 17 అంశాల డిమాండ్ల పట్టికకు కట్టుబడాలని నాయకులు పునరుద్ఘాటించారు. సదస్సుకు దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా కంపెనీలు, బొగ్గు, ఉక్కు, నౌకాశయాలు, విద్యుత్, టెలికాం, పోస్టల్, రైల్వే, రక్షణ, రోడ్డు రవాణా, విద్య, ఆరోగ్యం, జల, సౌర సేవల సంఘాల కార్యకర్తలు, నాయకులతో పాటు ప్రైవేటు, అసంఘటిత రంగానికి చెందిన ఒప్పంద-ఔట్‌సోర్సింగ్ కార్మికులు, స్వయం ఉపాధి, గిగ్ వర్కర్లు, ఇంటిపనివారు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, బీడీ, నిర్మాణ రంగ కార్మికులు, లోడింగ్, అన్‌లోడింగ్ చేసే వారు హాజరయ్యారు. కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక బీజేపీ ప్రభుత్వ విధానాలపై ఐక్యం గళం వినిపించారు. డిమాండ్ల సాధనకు సంఘటిత పోరుకు సంకల్పించారు.

## దేశ భద్రతకు విఘాతం

### స్టార్ లింక్‌కు శాటిలైట్ స్పెక్ట్రమ్ కేటాయింపుపై సీపీఐ

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ పూర్తి స్థాయిలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు తలొగ్గుతోందని సీపీఐ విమర్శించింది. ట్రంప్, ఆయన సహచరులు చెప్పినట్లు తలాడిస్తోందని దుయ్యబట్టింది. ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్‌కు వాణిజ్య ప్రయోజనాలను చేకూర్చేందుకు మోదీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తోందని సీపీఐ కార్యదర్శి వర్గం మంగళవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేసింది. అమెరికా అంతరిక్ష సంస్థ స్టార్ లింక్‌కు స్పెక్ట్రమ్ వనరుల కేటాయింపుపై తక్షణమే వెనక్కి తగ్గాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది. ఇది తేలికగా తీసుకునే అంశం కాదని దేశ భద్రతతో కూడుకున్నది కాబట్టి ఆచితూచి వ్యవహరించాలని హితవు పలికింది. 'హై స్పీడ్ శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలను భారత్‌లో అందించేందుకు స్టార్ లింక్‌తో జియో, ఎయిర్‌టెల్ సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. ఇందుకు భారత టెలికమ్యూనికేషన్స్ విభాగం కూడా అంగీకారం తెలిపింది. ఈ పరిణామం దేశ భద్రతకు, ఇతరత్రాలకు తీవ్ర ముప్పు కలిగించవచ్చు' అని సీపీఐ పేర్కొంది. 2జీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకంగా తాజా వ్యవహారం తోస్తోందని తెలిపింది. స్పెక్ట్రమ్ కేటాయింపు పారదర్శకంగా, బహిరంగ వేలం ద్వారా జరగాలని సూచించింది. ప్రైవేటు ఒప్పందాలు జరిగితే దేశ చట్టాలను అతిక్రమించడమే అవుతుందని సీపీఐ తెలిపింది. విదేశీ అంతరిక్ష సంస్థకు కీలక శాటిలైట్ స్పెక్ట్రమ్ డేటా ఇవ్వడమంటే దేశానికి ముఖ్యమైన భద్రతా మ్యాప్‌లు, ప్రాంతాలు, వనరులు, ప్రజల కాల్ డేటా అప్పగించి... ముప్పును కొనితెచ్చుకోవడమే అవుతుందని హెచ్చరించింది. పెంటగాన్, నాసా, అమెరికాకు సర్వీస్ ప్రొవైడర్‌గా ఉన్న స్టార్ లింక్‌కు భారత రక్షణ, ఇస్రో డేటా ఇవ్వడం ఎంత వరకు సమంజసమో కేంద్రం ఆలోచించాలని సూచించింది. 'విదేశీ సంస్థలను నమ్మి, భారత వ్యూహాత్మక స్పెక్ట్రమ్ డేటాను ఇవ్వడానికి ముందు రష్యాతో ఉక్రెయిన్ యుద్ధం వేళ స్టార్ లింక్ సేవల ఉపసంహరణను హెచ్చరికగా పరిగణించాలి. సార్వభౌమ భారతదేశ నిర్మాణానికిగాను టెలికమ్యూనికేషన్స్ కల్పన, ఖనిజ వనరుల గుర్తింపు, వాతావరణం, వ్యవసాయం, అంతరిక్ష అన్వేషణల దిశగా 1960లో విక్రమ్ సారాభాయి, ఇతర శాస్త్రవేత్తల విజన్లతో ఇస్రో స్థాపించబడింది' అని సీపీఐ పేర్కొంది.

## బుడమేరు ముంపు నివారణకు శాశ్వత ప్రణాళిక

### అసెంబ్లీలో మంత్రి నిమ్మల

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** బుడమేరు ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తుందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం అసెంబ్లీలో బుడమేరు ముంపుకు సంబంధించిన శాసనసభ్యులు వై.సుజనా చౌదరి, వసంత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, కామినేని శ్రీనివాస్ తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి రామానాయుడు సుదీర్ఘ, స్పష్టమైన సమాధానం ఇచ్చారు. బుడమేరు సమస్య ఒక విజయవాడ నగరానికే పరిమితం కాదని కొల్లేరు వరకు, అక్కడి నుంచి ఉప్పుటేరు, ఉప్పుటేరు మొదలు నుంచి సముద్రం వరకు సమస్య విస్తరించి ఉంది. బుడమేరు వరద సమస్య మూలాలను, తీవ్రతను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని క్యాబినెట్ సమావేశంలో తీవ్రంగా చర్చించి శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక రూపొందించామన్నారు. ఒక్క జల వనరుల శాఖ మాత్రమే కాకుండా వరద సమస్య పరిష్కారంలో భాగంగా, రెవెన్యూ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలను ఇందులో భాగస్వాములు చేశామని తెలిపారు. విజయవాడ నగరంతో పాటు ఇంత పెద్ద సమస్య పరిష్కారానికి గాను డిజాస్టర్ మేనేజ్మెంట్ ద్వారా కేంద్ర ప్రభుత్వ సహాయం కూడా కోరుతామన్నారు. బుడమేరు వరద సమస్య పరిష్కారంలో భాగంగా ఆ పనులను నాలుగు భాగాలుగా విభజించుకుని ముందుకెళ్లే విధంగా ప్రణాళికకు రూపకల్పన చేశామని ప్రణాళికను సభకు వివరించారు.

## ఈడీ విచారణకు రాబ్డీదేవి హాజరు

**పాట్నా:** బీహార్ మాజీ ముఖ్యమంత్రి రాబ్డీదేవి, ఆమె పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట విచారణకు హాజరయ్యారు. 'ఉద్యోగాల కోసం భూములు' అవినీతి కుంభకోణంపై దర్యాప్తునకు సంబంధించి ఈడీ విచారణకు హాజరుకావాలని ఈడీ వీరిద్దరికీ సమన్లు జారీచేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న రాబ్డీదేవి ఉదయం 10.30 గంటలకు బ్యాంక్ రోడ్‌లోని ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఇదే కేసులో నిందితురాలిగా ఉన్న పాటలీపుత్ర ఎంపీ, ఆమె పెద్ద కుమార్తె మీసా భారతి కూడా ఆమె వెంట ఉన్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరైన మాజీ మంత్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే తేజ్ ప్రతాప్ యాదవ్... భోజన విరామానికి ముందు ఈడీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఈడీ కార్యాలయం వద్దకు చేరుకున్న వందలాది మంది పార్టీ కార్యకర్తలు ఆర్జేడీ నేతలకు మద్దతుగా నినాదాలు చేశారు. పెద్ద ఎత్తున ఆర్జేడీ కార్యకర్తలు తరలిరావడంతో ఈడీ కార్యాలయానికి వెళ్లే రోడ్డుపై రాకపోకలు స్తంభించాయి. కాగా జర్నలిస్టులతో మాట్లాడేందుకు ఆర్జేడీ నేతలు నిరాకరించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ అధికార ప్రతినిధి ఇజాజ్ అహ్మద్ విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీ ప్రత్యర్థులపై కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తోందని మండిపడ్డారు. జార్ఖండ్, ఢిల్లీలో చూశాం... ఇప్పుడు బీహార్‌లో కనిపిస్తోందని విమర్శించారు.

**లాలూకు సమన్లు...:** 'ఉద్యోగాల కోసం భూములు' మనీలాండరింగ్ కేసులో బుధవారం ప్రశ్నించేందుకు ఆర్జేడీ అధ్యక్షుడు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. 2004 నుండి 2009 వరకు యూపీఏ హయాంలో లాలూ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో మధ్యప్రదేశ్ జబల్‌పూర్‌లోని వెస్ట్ సెంట్రల్ రైల్వే జోన్‌లో గ్రూప్-డి నియామకాలకు సంబంధించి కేసు ఇది. నియామకాలు జరిపిన వ్యక్తులు ఆర్జేడీ కుటుంబ సభ్యుల పేరుతో బహుమతిగా ఇచ్చిన లేదా బదిలీ చేసిన భూములకు బదులుగా ఈ నియామకాలు జరిగాయని ఆరోపణలున్నాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.